ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ప్రకాశం 5
జిల్లా వార్తలు
గురువారం 22, ఫిబ్రవరి 2024



ఎస్ఎస్ ట్యాంకు-1లో అడుగంటిన నీరు (ఇన్‌సెట్‌లో) కొత్తకూరగాయల మార్కెట్ సమీపంలోని షాదీఖానా భవన్ వద్ద పైపు లైన్ లీకు కట్టడి కోసం తీసిన గుంత

నగరంలో తాగునీటి కోసం జనం అల్లాడుతున్నారు. ఒకరోజు మోటర్ పాడైంది.. ఇంకోరోజు పైపులైను పగిలిపోయింది.. మరోసారి కరెంటు పోయింది... ఇదీ నీటి సరఫరాపై అధికారుల నుంచి వస్తున్న సమాధానాలు. నాలుగు మోటర్లకుగాను పనిచేస్తున్నది ఒకటే! ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు పెరుగుతున్న తాగునీటి అవసరాలతో నెలరోజులుగా సమస్య తీవ్రమైంది. ఏ డివిజన్‌లో చూసినా దాహం కేకలే. ఇదిలా ఉంచితే ఒంగోలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి రిమ్స్‌కు సరఫరా అయ్యే నీరు నిలిచిపోవడంతో వారం నుంచి రోగులు ఇబ్బందిపడుతున్నారు. అటుచూస్తే ఎస్ఎస్ ట్యాంకులు అడుగంటాయి. రామతీర్థంలోనూ నీరు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరంలో తాగునీటి సమస్యపై స్వయంగా అధికారపార్టీ కార్పొరేటర్లే ఈ నెల 16న జరిగిన కౌన్సిల్ సమావేశంలో గగ్గోలు పెట్టడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

నగరం.. నీరివ్వలేం!

ఒంగోలులో వేసవికి ముందే ఎక్కిళ్లు



పైప్‌లైన్ లీకుతో వృథాగా పోతున్న నీరు

అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా

- గుండ్లకమ్మ నుంచి ఆగాయి.. సాగర్ నీరే దిక్కు
- అడుగంటిన సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు
- ప్రస్తుతం ఉన్నవి నెలకు సరిపడా మాత్రమే
- మూడు రోజులకు ఒకసారి కూడా ఇవ్వలేక చేతులెత్తేస్తున్న అధికారులు
- పాలకుల హామీలు సరే.. జనం దాహం తీరేదెలా?

ఒంగోలు (కార్పొరేషన్), ఫిబ్రవరి 21: ఒంగోలు నగరంలో వేసవికి ముందే ఎక్కిళ్లు మొదలయ్యాయి. పాలకుల పదేపదే హామీలతో ఎప్పటికప్పుడు ఆశతో ఎదురుచూస్తున్న జనానికి గొంతు తడారిపోతుందే తప్ప సమస్య తీరడం లేదు. గత కొన్నేళ్లుగా నగర ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం లభించడం లేదు. ముఖ్యంగా ఇప్పటికే ఎండల తీవ్రత పెరిగింది. మరో నెలరోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే వేసవి దృష్ట్యా నగర పాలక సంస్థ యంత్రాంగం ముందుచూపు లేకపోవడంతో నీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. దీనిపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ నిర్లక్ష్యం, వైసీపీ పాలకులు పట్టించుకోనితనంతో పదేపదే తాగునీటి సమస్య తలెత్తుతోంది. మోటార్లు కాలిపోవడం, పైపులు పగిలిపోవడం లాంటి సమస్య వచ్చినప్పుడు నాలుగైదు రోజులకొకసారి నీరిచ్చిన ఘటనలూ ఉన్నాయి.

నగరమైనా ప్రైవేటు ట్యాంకర్లే

నగర జనాభా విపరీతంగా పెరిగింది. ఒంగోలు ప్రాంత పరిధులు పెరిగాయి. అయితే శివారు కాలనీలు, విలీన గ్రామాల స్థితిగతులు మాత్రం మారలేదని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. ఒంగోలు కార్పొరేషన్ అయినప్పటికీ అందుకు అనుగుణంగా నీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వ ట్యాంకర్లు లేవు. గతంలో మూడు ఉండగా అవి ప్రస్తుతం మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా ఏళ్ల తరబడి సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా కార్పొరేషన్‌లో మరో పది పంచాయతీలు విలీనం కావడంతో ఉన్న అరకొర ట్యాంకర్లే వాటికీ దిక్కయ్యాయి. దీంతో అటు శివారు కాలనీలు, ఇటు గ్రామీణప్రాంతాల ప్రజలు కూడా తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న వైద్యులు, రోగులు

జీజీహెచ్‌లో ఇన్‌పేషెంట్లు వెయ్యి మంది వరకూ చికిత్స పొందుతుండగా, వైద్య విద్యార్థులు 500 మంది, నర్సింగ్ విద్యార్థులు 500 మంది హాస్టల్‌లో ఉండి విద్యనభ్యసిస్తున్నారు. ప్రొఫెసర్లు, వైద్యులు, వైద్యసిబ్బంది, నర్సులు పలువురు క్షేత్రస్థాయి సిబ్బంది 2వేల మంది వరకూ ఉంటారు. రోజూ మరో 1,500 మంది అవుట్ పేషెంట్‌లు వచ్చి పోతుంటారు. దీంతో నిత్యం 4వేల నుంచి 5 వేలమందితో కిటకిటలాడే రిమ్స్‌లో కనీసం తాగునీరు లేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం రిమ్స్‌కు రోజుకు 3.50లక్షల లీటర్ల నీటి అవసరం ఉండగా, కార్పొరేషన్ వారు 60వేల లీటర్లు మాత్రమే అందిస్తున్నారు. వారంరోజుల నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీరు అడుగంటడంతో అది కూడా నిలిచిపోయింది. దీంతో కనీస అవసరాలు తీరకపోవడంలో రిమ్స్‌లో దాహం కేకలు వినిపిస్తున్నాయి.

ఏళ్ల తరబడి తాగునీటి కోసం తంటాలే..!

ఒంగోలు నగరంలో ఇటీవల కాలంలో పదేపదే తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నెలరోజుల నుంచి అయితే మరింత దారుణంగా మారింది. రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద నీటి సరఫరాకు ఉపయోగించే మోటారు ప్రతిసారీ మరమ్మతులకు గురవుతోంది. దీంతో నీటి సరఫరా వారంలో ఒకరోజు ఆలస్యమవుతోంది. అది కూడా ఒక మోటారుపైనే కావడంతో సరఫరా సమయం కూడా తగ్గించేశారు. దీంతో ప్రజలు ఎప్పుడొస్తాయో తెలియని నీటి కోసం రోజంతా పనులు మానుకుని ఎదురుచూడాల్సి వస్తోంది. ఒంగోలు నగరంలో 50 డివిజన్లు ఉండగా, వాటన్నింటికీ నీటి సరఫరా కోసం మూడు మోటార్లు ఏర్పాటు చేశారు. అయితే గతంలో ఎప్పుడో కొనుగోలు చేసిన మోటార్లు కావడంతో పదేపదే సమస్య ఎదురవుతోంది. ఒక్క మోటారు మొరాయించినా కాలనీలకు నీటిసరఫరా షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో మూడురోజులకు ఒకసారి ఇచ్చే నీరు మరో ఒక్కరెండురోజులు రోజుల ఆలస్యంగా వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అడుగంటిన వేసవి చెరువులు

గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు సరఫరా అవుతున్న తాగునీరు ఇరవై రోజులుగా నిలిచిపోయింది. సాగర్ నీరు ఇప్పట్లో విడుదలయ్యే అవకాశం లేదని అధికారుల నుంచి వినిపిస్తున్న మాట. అయితే పాలకులు తాగునీటికి కోట్ల రూపాయల జీవోలు తెచ్చాం. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెబుతున్న హామీలు ఆచరణలో అమలు కావడం లేదు. దీంతో నగర ప్రజలకు దాహం తీరే మార్గం కనిపించడం లేదు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీరు అడుగంటిపోయింది. వాస్తవ పరిస్థితి చూస్తే ఉన్న నీరు నెలరోజులకు మించి వచ్చే అవకాశం లేదని సమాచారం. ఇప్పటివరకూ నగరంలో మూడు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా జరుగుతోంది. అది కూడా అరకొరగానే ఇస్తుండటంతో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నగరంలో అధికశాతం ప్రాంతాల్లో పురాతన పైపులైన్లు ఉండగా, అతి కొద్ది ప్రాంతాల్లోనే కొత్తగా పైపులైను వేశారు. పాత పైపులైనులు పదేపదే పగిలిపోతున్నాయి. వాటికి తాత్కాలిక మరమ్మతుల చేయడం మినహా శాశ్వత పరిష్కారం చూపడంలో యంత్రాంగం విఫలమయ్యిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నగరంలో భారీగా ఉన్న లీకులను పూర్తిస్థాయిలో నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



ఎస్పీ పరమేశ్వరరెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు

పత్రికా స్వేచ్ఛను కాపాడండి

- అధికార పార్టీ దాడులను అరికట్టాలి
- ఎస్పీని కలిసి వినతిపత్రం అందజేసిన జర్నలిస్టులు

ఒంగోలు (క్రైం), ఫిబ్రవరి 21: రాష్ట్రంలో పేపర్ కార్యాలయాలు, జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టి, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని మీడియా ప్రతినిధులు కోరారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డిని కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ కార్యకర్తలు విచక్షణారహితంగా దాడిచేశారన్నారు. అలాగే కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేశాయని ఈ సందర్భంగా ఎస్పీకి వివరించారు. జిల్లాలో జర్నలిస్టులకు తగిన భద్రత కల్పించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎస్పీ ముందస్తు చర్యలు తీసుకుంటామని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు దాసరి కనకయ్య, అలుగుల సురేష్, కె.శ్రీనివాసరావు, మీడియా ప్రతినిధులు వెంకట్రావు, నల్లమోతు జనార్దన్, ప్రభాకర్, నంబూరి సురేష్, శ్రీనివాసనాయక్, దిలీప్, సర్వేశ్వరరావు, బుజ్జి, బాబి తదితరులు పాల్గొన్నారు.



సమస్యను ఎమ్మెల్యే రాంబాబుకు చెప్పేందుకు వేదిక వద్దకు వచ్చిన మహిళను నెట్టేస్తున్న వైసీపీ నాయకులు

మహిళను గెంటేశారు!

- ఆసరా సభలో సమస్యలు చెప్పొద్దంటూ అడ్డుకున్న వైసీపీ నాయకులు
- అసహనానికి గురైన డ్వాక్రా మహిళలు

తర్లుపాడు, ఫిబ్రవరి 21 : ఆసరా చెక్కుల పంపిణీ సభలో డ్వాక్రా మహిళలకు తీవ్ర అవమానం జరిగింది. తర్లుపాడులోని నాయుడుపల్లె కాలనీలో మంచినీటి సమస్య ఉందని కాలనీకి చెందిన చిట్యాల వెంకటమ్మ గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈలోపే సమస్యలను ఇక్కడ చెప్పవద్దంటూ స్టేజీపై ఉన్న వైసీపీ నాయకులు ఆమెను నెట్టివేశారు. గుక్కెడు నీరు ఇవ్వమని అడిగేందుకు వచ్చిన మహిళను వైసీపీ నాయకులు నెట్టివేయడం చూసిన మహిళలు వారి తీరుపై అసహనం వ్యక్తం చేశారు. సమస్యలు చెప్పుకునే అవకాశం లేదా? అంటూ ఆవేదనకు లోనయ్యారు.

అమ్మ భాష అంటే అంత చులకనా?

- మాతృభాషా దినోత్సవాన్ని పట్టించుకోని యంత్రాంగం
- తెలుగుతల్లి విగ్రహం చుట్టూ ఫ్లెక్సీలు, మద్యం బాటిళ్లు
- ఎర్రన కవికి కూడా కరువైన నివాళి



తలుపులు తెరవని ఎర్రన విగ్రహ ప్రాంగణం



ఒంగోలులో తెలుగుతల్లి విగ్రహం ముందు ఉన్న ఖాళీ మద్యం బాటిళ్లు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 21: మాతృ భాషకు పట్టం కట్టాల్సిన రాష్ట్ర ప్రభుత్వం దానిని నిర్వీర్యం చేస్తుంటే, యథా రాజా తథా అధికారులు అన్నట్లు జిల్లా యంత్రాంగం ప్రవర్తిస్తున్న తీరు భాషాభిమానులను కలచివేసింది. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పలు సాహిత్య సంఘాలు వారి శక్తిమేరకు వేడుకలను నిర్వహించగా అధికార యంత్రాంగం మాత్రం ఆవైపు కన్నెత్తి చూడలేదు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మాతృభాషా దినోత్సవాన్ని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి పలువురు సాహితీవేత్తలను సన్మానించే వారు. అయితే ప్రస్తుతం కనీసం తెలుగుతల్లి విగ్రహానికి సైతం పూలమాల సమర్పించే తీరిక అధికార యంత్రాంగానికి లేకుండాపోయింది. స్థానిక ఉత్తర బైపాస్ ఫ్లైఓవర్ కింద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గతంలో తెలుగుతల్లి విగ్రహాన్ని నెలకొల్పారు. అయితే బుధవారం ఆ విగ్రహానికి ఏఒక్క అధికారి కనీసం పూలమాల కూడా వేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అంతేకాకుండా తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేద్దామని వచ్చిన సాహిత్యసంఘాల ప్రతినిధులకు కూడా నిరాశే ఎదురైంది. విగ్రహం చుట్టూ అధికారపార్టీ ఫ్లెక్సీలు, మందుబాబులు తాగిపడేసిన మద్యం సీసాలు, చెత్తాచెదారం వారికి దర్శనమిచ్చాయి. దీంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు. తెలుగుతల్లి విగ్రహం వద్ద శుభ్రం చేయించమని నగరపాలక సంస్థ కమిషనర్‌కు రెండు రోజుల కిందటే విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు కలెక్టర్ కార్యాలయమైన ప్రకాశం భవన్ ఎదుట, ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న ఎర్రన విగ్రహం వైపు కూడా అధికారులు కన్నెత్తి చూడలేదు. విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన గేటుకు తాళం, గ్రిల్స్‌పై బిచ్చగాళ్లు వేసిన పాతవస్త్రాలు, చుట్టూ పేరుకుపోయిన చెత్త దర్శనమిచ్చాయి. దీనినిబట్టి ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి తెలుగుభాష పట్ల మమకారం ఏపాటిదో అర్థమవుతుందని పలువురు భాషాభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మూడు విడతలుగా పొగాకు కొనుగోళ్లు

- 29 నుంచి తొలి విడత వేలం
- ఒంగోలు-1, కొండపిలలో ప్రారంభం
- రైతు, వ్యాపార ప్రతినిధులతో బోర్డు అధికారుల సమావేశంలో నిర్ణయం



ఒంగోలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లు మూడు విడతలుగా ప్రారంభం కానున్నాయి. తొలిదశ ఈనెల 29న జిల్లాలోని ఒంగోలు-1, కొండపి కేంద్రాలలో వేలం చేపట్టనున్నారు. అనంతరం దక్షిణాది కేంద్రాల్లో మూడు చోట్ల రెండో విడతగా. మిగిలిన దక్షిణాదిలోని ఐదింటితోపాటు ఉత్తరాది కేంద్రాల్లో మూడో విడత ప్రారంభించనున్నారు. ఆమేరకు బుధవారం గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. పొగాకు బోర్డు ఛైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, సెక్రటరీ దివి వేణుగోపాల్‌ల సమక్షంలో వ్యాపారులు, రైతు ప్రతినిధుల సమావేశం జరిగింది. కర్ణాటకలో ప్రస్తుత సీజన్ కొనుగోళ్లు దాదాపు పూర్తి కావస్తున్నాయి. అలాగే మన రాష్ట్రంలో ప్రత్యేకించి దక్షిణాదిలోని చాలాచోట్ల పొగాకు కాల్చు జరిగి గ్రేడింగ్ జరుగుతోంది. ఎండల తీవ్రత పెరుగుతున్న పరిస్థితుల్లో వెంటనే వేలం ప్రారంభించడం అవసరం అన్న అభిప్రాయం రైతు ప్రతినిధులు వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే వ్యాపార ప్రతినిధులు మాత్రం దాదాపు నాలుగు నెలలపాటు కర్ణాటకలో వేలం ప్రక్రియ కొనసాగగా తమ సిబ్బందికి కొన్నిరోజులు విశ్రాంతి అవసరం కనుక రాష్ట్రంలో వచ్చేనెలలో కొనుగోళ్లు ప్రారంభించాలని కోరినట్లు తెలిసింది. ఆయా అంశాలపై చర్చ అనంతరం మూడు విడతలుగా వేలం ప్రారంభించాలని నిర్ణయించారు. గతేడాది ఫిబ్రవరి 24న తొలి విడత కొనుగోళ్లు ప్రారంభించి మార్చి 9న రెండో దశ, మార్చి 23 తుది దశగా మూడు విడతల్లో చేపట్టారు.

ప్రారంభ ధర రూ.250 ఉండాలి

తొలివిడత ఒంగోలు-1, కొండపి కేంద్రాల పరిధిలో ఈనెల 29న కొనుగోళ్లు మొదలుకానున్నాయి. వచ్చేనెల 6న కందుకూరు-1, 2, వెల్లంపల్లి కేంద్రాల్లోనూ, మూడో విడతగా మార్చి 14న దక్షిణాదిలో మిగిలిన కేంద్రాలైన ఒంగోలు-2, టంగుటూరు, కనిగిరి, డీసీపల్లి, కలిగిరి, పొదిలిలతోపాటు ఉత్తరాదిలోని ఐదు కేంద్రాల్లోనూ వేలం ప్రారంభించనున్నారు. ఈ ఏడాది పొగాకు సాగులో ఖర్చులు భారీగా పెరిగిన విషయాన్ని సమావేశంలో పలువురు రైతు ప్రతినిధులు బోర్డు అధికారులు, వ్యాపారుల దృష్టికి తీసుకెళ్లారు. వాస్తవ ఉత్పత్తి ఖర్చులను పరిగణనలోకి తీసుకొని ఆరంభం నుంచే సరైన ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకోసం ప్రారంభ ధర కిలో రూ.250 ఇచ్చేలా చూడాలని కోరినట్లు సమాచారం. దానిపై వేలం ప్రక్రియ ప్రారంభ సమయానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం క్షేత్రస్థాయి వేలం అధికారులతో ఏర్పాట్లపై ఉన్నతాధికారులు సమీక్షించారు. సమావేశంలో బోర్డు వైస్ ఛైర్మన్ గుత్తా వాసుబాబుతోపాటు జిల్లాకు చెందిన పాలక మండలి సభ్యులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

లోపలి పేజీల్లో..

పలుచబడిన అభిమానం

- వైసీపీ శ్రేణుల్లో కానరాని ఉత్సాహం
- పేలవంగా దద్దాల పరిచయ కార్యక్రమం
- డుమ్మా కొట్టిన ఎమ్మెల్యే బుర్రా, మాజీ ఎమ్మెల్యే కదిరి

టీడీపీ అధికారంలోకి రాగానే 2సెంట్ల భూమి, ఇల్లు

- అర్హులందరికీ ఇస్తాం
- నాలుగున్నరేళ్లుగా పట్టని పేదలు ఎన్నికలప్పుడు గుర్తొచ్చారా?
- బాలినేనిపై దామచర్ల పరోక్ష విమర్శలు
- ఆత్మీయ సమావేశంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

లోపలి పేజీల్లో..



వైసీపీని వీడి పార్టీలో చేరిన యువతతో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల, ఇతర నేతలు

ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను

మరో పదేళ్లు కొనసాగించాలి

• విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ డిమాండ్



మాట్లాడుతున్న జగదీష్

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌ను మరో పదేళ్ళు కొనసాగించాలని విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రాయపాటి జగదీష్ డిమాండ్ చేశారు. ఒంగోలులోని ఎంసీఏభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ రాష్ట్ర విభజన జరిగిన తొమ్మిది సంవత్సరాలు పూర్తయిందన్నారు. అప్పుడు ఉన్న పరిస్థితులే ఇప్పుడు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. రాష్ట్ర విభజన జరిగి ఇన్నేళ్లు అయినా రాజధాని లేదన్నారు. రాజకీయ పార్టీలు స్వార్ధ ప్రయోజనాల కోసం రాష్ట్ర హక్కులను ఢిల్లీ రాజకీయ పార్టీలకు తాకట్టు పెట్టారని విమర్శించారు. విభజన చట్టంలోని హామీలు, ప్రత్యేకహోదా, హైదరాబాద్ ఉమ్మడి రాజధాని నుంచి రావాల్సిన రూ.లక్ష కోట్ల రూపాయాలపై మాట్లాడలేని దుస్థితిలో రాజకీయ పార్టీలు ఉన్నాయని ఆరోపించారు. ఈ ఏడాది జూన్ 2వ తేదీతో ఉమ్మడిరాజధాని హైదరాబాద్‌ను కోల్పోతామని, అప్పుడు ఆంధ్రులకు రావాలికసన రూ.లక్ష కోట్లను ఏ రాజకీయ పార్టీ తెచ్చిఇస్తుందని ప్రశ్నించారు. ఈనెల 23న జిల్లాకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జిల్లాలో పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీల అమలుకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాకులు కార్తీక్, కరుణాకర్, శ్రీకృష్ణ, సూర్య ప్రకాష్, లోకేష్, శ్రీనివాస్, అశోక్, స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

రైజ్‌లో మహాధ్యాన యజ్ఞం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు స్పిరిట్యువల్ సొసైటీస్, రాగ ఉమెన్ ఎంపోవర్మెంట్ సంయుక్తంగా బుధవారం విద్యార్థులకు మెడిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భంగా మెడిటేషన్ ట్రైనర్ టి.శ్రీరామచంద్రమూర్తి, స్పిరిట్యువల్ సొసైటీ ప్రతినిధి ఆలపాటి ప్రశాంతి, ఆలపాటి హిమశ్రీ మాట్లాడుతూ నేటి సమాజం పరుగులు ప్రపంచంగా మా రిందని, అందువల్ల అనేక మానసిక రోగాలు వస్తున్నాయని, తద్వారా మనుషులు ఆనందమైన జీవితాన్ని పొందలేకపోతున్నారని తెలిపారు. ఇలాంటి ఇబ్బందులు నుంచి బయటపడాలంటే ప్రతి ఒక్కరూ కచ్చితంగా ప్రతిరోజు కనీసం 10నుంచి 20 నిమిషాల పాటు ప్రశాంతంగా కూర్చొని ఏకాగ్రతను పాటించాలన్నారు. ధ్యానం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. రాగ చీఫ్ అడ్వయిజర్ శిద్దా ప్రవల్లిక మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం చదువు, మార్కులు మాత్రమే ముఖ్యం కాదని, ఆరోగ్యంగా ఉండటం కూడా చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో రైజ్ గ్రూపు విద్యా సంస్థల డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ జేవీ.రమేష్‌బాబు, పాలిటెక్నిక్ రాగ కో ఆర్డినేటర్ కె.స్రవంతి పాల్గొన్నారు.

సమానత్వ సమాజమే లెనిన్ ఆశయం



నినదిస్తున్న సీపీఎం నాయకులు

కొండపి, ఫిబ్రవరి 21 : దోపిడీ రహిత, సమానత్వ సమాజం లెనిన్ ఆశయమని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు అన్నారు. దాన్ని నెరవేర్చేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. లెనిన్ వర్ధంతి సందర్భంగా పెరిదేపిలోని ముప్పరాజు శేషయ్య విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన రెడ్ బుక్స్‌డే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ శ్రమకు తగిన ఫలితం దక్కాలని, ప్రకృతి వనరులు, దేశ సంపద ప్రజలపరం కావాలన్నదే సోషలిజం సిద్ధాంతమన్నారు. తొలుత లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కేజీ మస్తాన్, నాయకులు గడ్డం వందనం, అంగలకుర్తి సూరిబాబు, ఎ.రవీంద్రబాబు, మల్లెల చిన్నారావు, ఎం.బాబూరావు, పి.జక్కరయ్య, ఎ.సుందరయ్య, సి.హెచ్.అంకయ్య, అంగలకుర్తిరెడ్డి పాల్గొన్నారు.

కేజీబీవీని పరిశీలించిన జీసీడీవో



రికార్డులను పరిశీలిస్తున్న జీసీడీవో ప్రమోద

జరుగుమల్లి (కొండపి), ఫిబ్రవరి 21 : మండలంలోని కె.బిట్రగుంట కేజీబీవీని బుధవారం జీసీడీవో ఎం.ప్రమోద సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించారు. పది, ఇంటర్ విద్యార్థినులతో ఆమె మాట్లాడారు. వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి అనుసరించాల్సిన పద్ధతులు, పరీక్షలు రాసే విధానంపై వారికి అవగాహన కల్పించారు. స్టడీ మెటీరియల్, ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ తదితర విషయాలపై ఉపాధ్యాయ, అధ్యాపకులతో మాట్లాడారు. కార్యక్రమంలో సిబ్బందితోపాటు స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్.స్రవంతి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో మంత్రి పర్యటన



ఉప్పలదిన్నెలో చిన్నారులతో మంత్రి సురేష్

పొన్నలూరు (కొండపి), ఫిబ్రవరి 21 : పల్లెపల్లెకు మన సురేష్ అన్న పేరుతో మంత్రి సురేష్ బుధవారం పొన్నలూరు మండలంలో పర్యటించారు. ముప్పాళ్ల, కొత్తసింగరబొట్లపాలెం, ఉప్పలదిన్నె, పాతసింగర బొట్లపాలెం గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉప్పలదిన్నెలో గ్రామ సచివాలయాన్ని ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో కూడా పర్యటించారు. ఈసందర్భంగా అక్కడ పలువురు చిన్నారులతో వైసీపీ జెండాలు పట్టించడం వివాదాస్పదమైంది.

ఫ్లోరోసిస్‌పై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్

పీసీపల్లి, ఫిబ్రవరి 21 : విద్యార్థులు ఫ్లోరోసిస్‌పై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ డాక్టర్ వి.అనిల్‌కుమార్ చెప్పారు. మండలంలోని పెదవరిమడుగు ప్రభుత్వ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు. ఫ్లోరైడ్ రహిత శుద్ధ జలాలను మాత్రమే తాగాలన్నారు. విటమిన్ సీ, కాల్షియం ఉన్నటువంటి ఆహారం తీసుకోవడం ద్వారా ఫ్లోరోసిస్ బారిన పడకుండా ఉండవచ్చని, డెంటల్ ఫ్లోరోసిస్ నుంచి స్కెల్టల్ ఫ్లోరోసిస్ స్టేజీ వరకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం నీటి శాంపిల్స్‌ని తీసుకున్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి మంజుల పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

• పలు సంఘాల ఆధ్వర్యంలో నిర్వహణ



సాహిత్యవేత్తలను సత్కరిస్తున్న నరసం సభ్యులు

ఒంగోలు(కల్చరల్), ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం బుధవారం పలు సాహిత్య సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఒంగోలు నగరం గాంధీపార్కు ఎదుట ఉన్న తెలుగుతల్లి, శ్రీకృష్ణదేవరాయలు, అన్నమయ్య విగ్రహాలకు పలు సంఘాల ప్రతినిధులు పూలమాల సమర్పించి తెలుగు భాషా పరిరక్షణ ఆవశ్యకత గురించి ప్రసంగించారు. విగ్రహాల ప్రతిష్టాపకులు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎంతోమంది సాహిత్య, సంగీతవేత్తలు తెలుగుభాష ఔన్నత్యానికి కృషిచేశారని, వారి గురించి ప్రస్తుత తరానికి తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

ఇక స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పలువురు తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాతృభాషను ప్రేమించి, గౌరవించి పరిరక్షించుకోవాలన్నారు. ముఖ్యఅతిథి డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణ అంటే ఒక జాతి సాంస్కృతిక వైభవాన్ని, వైవిధ్యాన్ని, చరిత్రను ముందుతరాలకు అందించే గురుతర బాధ్యతగా అభివర్ణించారు. అనంతరం నాటక, నృత్య, సాహిత్య రంగాలలో విశేష కృషి చేస్తున్న ప్రముఖులు మిడసల మల్లిఖార్జునరావు, కోవెలకుంట్ల బాలకోటయ్య, పరాంకుశం కృష్ణవేణిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నరసం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మున్నంగి రాజకుమారి, ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి, కుర్రా ప్రసాద్‌బాబు, గుళ్లాపల్లి ప్రసాద్, డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు, గుంటూరు సత్యనారాయణ, ఓరుగంటి ప్రసాద్, నూకతోటి శరత్‌బాబు, మారేపల్లి సూర్యకుమారి, సలిగల రాధికా రత్న, బీరం అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక కోటవీధిలోని ప్రకాశం జిల్లా ముస్లిం రచయితల సంఘ కార్యాలయంలో జరిగిన మాతృభాషా దినోత్సవంలో సంఘ అధ్యక్షుడు పొన్నూరి వేంకటశ్రీనివాసులు ప్రసంగిస్తూ భాష అంతరిస్తే జాతి అంతరిస్తుందని, కనుక భాషను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా ముస్లిం రచయితల సంఘ అధ్యక్షుడు షేక్ మహబూబ్ జాన్ రచించిన మూగబోయిన వేణుగానం రాధాకృష్ణుల ప్రణయ కావ్యాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య మాస్టర్, పి.జానకిరామ్, రామవాచారి, షేక్ హుమయూన్ పాల్గొన్నారు.

స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య మాట్లాడుతూ చిన్నతనం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తెలుగు భాష ఔన్నత్యం గురించి తెలియజేసి వారు అనర్గళంగా మాట్లాడటం, రాయటం నేర్చుకునేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బీఏకేఆర్ స్కూల్ విద్యార్థులకు గ్రంథాలయ సభ్యత్వాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, కె.సంపూర్ణ, స్మైలీ, టి.గోవిందమ్మ, కృష్ణవేణి, ఎం.శ్రీనివాసులు, ఉద్యోగ సంఘ నాయకులు పీవీ.సుబ్బారెడ్డి, జీవీ.శివారెడ్డి, ఎ.ప్రసాద్, నున్నా ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

ఒంగోలు(విద్య): ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డి.కళ్యాణి మాతృబాషా ప్రాధాన్యతను వివరించారు. ఆంధ్రకేసరి యూనివర్శిటీ ఈసీ మెంబర్ కేవీ.పద్మావతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తెలుగులో మాట్లాడాలని, తల్లిదండ్రులను మమ్మీ, డాడీ అని కాకుండా అమ్మనానా అని పిలవాలన్నారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు పి.యామిని అమ్మాజీ, పి.కుసుమకుమారి, జి.ధనుంజయరావు, అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో పుస్తక ఆవిష్కరణ



విద్యార్థులకు గ్రంథాలయం సభ్యత్వం అందజేసిన సిబ్బంది

బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలి

• జేసీ గోపాలకృష్ణ ఆదేశం



మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: జిల్లాలో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల వ్యయ నిర్వహణపై ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకొని అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందనహాలులో బుధవారం ఎన్నికల వ్యయ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారుల శిక్షణ తరగతుల్లో జేసీ మాట్లాడారు. ఖర్చుపరంగా పోటీలో ఉన్న అభ్యర్థుల మధ్య సమాన అవకాశం కల్పించడం కోసం సాధ్యమైనంత వరకు పరిమితం చేయడమే ఈ ఎన్నికల వ్యయ నిర్వహణ విభాగాల ముఖ్య ఉద్దేశమన్నారు. అభ్యర్థి ఖర్చును రెండు రకాలుగా జమ కడతామని, దీనిలో మొదటిది భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిమితలోపు ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. రెండవది నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ఖర్చు చేస్తే సంబంధిత అధికారుల దృష్టికి తేవాలని చెప్పారు. అందువల్ల ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను అవగాహన చేసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయవచ్చని తెలిపారు. అభ్యర్థుల ఎన్నికల ఖర్చు వివరాలను సంబంధిత అధికారులకు ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ముందుగా జిల్లా ఆడిట్ అధికారి శంకర నారాయణ, జిల్లా ఉపాధి అధికారి భరద్వాజ్, కమర్షియల్ టాక్స్ అధికారులు ఎన్నికల వ్యయ నిర్వహణలో చేపట్టాల్సిన విధులు, రోజువారీ నివేదికలు, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ యాప్‌లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్వో ఆర్.శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై వైసీపీ దాడులు దారుణం

• ఏపీయూడబ్ల్యూజేఎఫ్



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న పాత్రికేయులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి 21: అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సీఎం సభలో ఆంధ్రజ్యోతి జర్నలిస్టు శ్రీకృష్ణపై తీవ్రంగా దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఏపీయూడబ్ల్యూజేఎఫ్ డిమాండ్ చేశారు. అలాగే కర్నూలులోని ఈనాడు పత్రికా కార్యాలయంపై వైసీపీ మూకలు చేసిన దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మీడియాపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ బుధవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు గొట్టిపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కర్నూలులో ఈనాడు కార్యాలయంపై పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రామ్‌భూపాల్‌రెడ్డి అనుచరలు దాడులు చేయటం దారుణమన్నారు. ఆంధ్రజ్యోతి జర్నలిస్టు శ్రీకృష్ణపై అకారణంగా చేసిన దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ఆయా సంఘటనల్లో నిందితులను అరెస్టు చేయాలని కోరుతూ జేసీ గోపాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బ్రహ్మం, నాయకులు ఎ.సురేష్ నాగేశ్వరరావు, ఎల్.రాజు, ఎస్.జనార్దన్, దిలీప్, ప్రభాకర్, రవికిరణ్, మేదరమెట్ల అంజయ్య, రాఘవ, బెజవాడ ప్రసాద్, నంబునూరి సురేష్, డి.సునీల్‌రాజేష్, బాలాజీ, శ్రీనివాసాచారి, సుబ్బారావుగుప్తా తదితరులు పాల్గొన్నారు.

పదో డివిజన్‌లో డ్రైనేజీ అస్తవ్యస్తం

• జనసేన పార్టీ నాయకుల ప్రచారం



కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

ఒంగోలు(రూరల్), ఫిబ్రవరి21: ఒంగోలు నగర పరిధిలోని పదో డివిజన్‌లో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉందని, దీంతో కాలనీలలో ఉండలేక పోతున్నామని ప్రజలు వాపోతున్నారు. జనసేన పార్టీ నాయకులు బుధవారం పదో డివిజన్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఏకరువు పెట్టారు. డ్రైనేజీ సక్రమంగా లేక మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోతోందని, దీంతో దోమలు వృద్ధి చెంది రోగాలను వ్యాపింపజేస్తున్నాయని చెప్పారు. కాలనీలలు ఎలాంటి అభివృద్ధి చేయకపోవటంతో ఇబ్బందిపడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జనసేన నాయకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. తమ కూటమి అధికారంలోకి రాగానే కాలనీల్లోని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తేళ్ల హరీష్, కళ్యాణ్ ముత్యాల, పల్ల ప్రమీల, మాదాసు సాయి, ఉంగరాల వాసు, కోట సుధీర్, నరసింహారావు, మత్రి పూడి ఉదయ్, చెన్నునరేష్, మత్రిపూడి మధవి, అనూష, భాయ్‌రెడ్డి నాయుడు, అరవింద్‌బాబు, కృష్ణ సాయి, భాను తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం ధ్వంసం



పట్టుబడిన మద్యంను ధ్వంసం చేస్తున్న సిబ్బంది

దర్శి, ఫిబ్రవరి 21 : అక్రమ మద్యం వ్యాపారాల్లో పలు ప్రాంతాల్లో పట్టుపడిన మద్యాన్ని ఎస్ఈబీ అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. ఎస్ఈబీ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక సెబ్ కార్యాలయం పరిధిలో గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు పట్టుబడిన 1012 మద్యం బాటిల్స్‌ను ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సుందరరామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ అధికారులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

మైనర్ జంటను కాపాడిన రైల్వే పోలీసులు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి21: ప్రేమపేరుతో పదో తరగతి చదువుతున్న బాలుడు, బాలిక చనిపోయేందుకు తిరుపతికి వెళుతుండగా ఒంగోలు రైల్వేపోలీసులు గుర్తించి వారిని కాపాడారు. రైల్వే సీఐ ఎన్.శ్రీకాంత్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. తూర్పుగోదావరి జిల్లా ఉండరాజువరం గ్రామానికి చెందిన మైనర్ జంట రాజమండ్రి నుంచి ఒంగోలుకు బస్సులో వచ్చారు. వారి వద్ద డబ్బులు అయిపోవడంతో తిరుపతి వెళ్ళి ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకొని రైలులో అక్కడి వెళ్ళేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చారు. అయితే స్టేషన్‌లో ఈ జంట అనుమానాస్పదంగా ఉండటంతో రైల్వే పోలీసులు విచారించారు. వారు చెప్పిన వివరాల మేరకు ఉండరాజువరం పోలీస్‌స్టేషన్‌లోని ఎస్సైను సంప్రదించారు. అక్కడ అదృశ్యం కేసు నమోదైనట్లు తెలియజేయడంతో ఈ జంటను అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు బుధవారం ఒంగోలు రైల్వే పోలీస్‌స్టేషన్‌కు వారిని పిలిపించి ఇరువురిని అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను వినియోగించుకోవాలి

• ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి 21: ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లే వారు దొంగల బారి నుంచి ఇంట్లో ఉన్న విలువైన సామగ్రి కాపాడుకునేందు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టిమ్ (ఎల్‌హెచ్‌ఎంఎస్)ను వినియోగిచుకోవాలని ఎస్పీ పి.పరమేశ్వరరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఇళ్లకు విలువైన భద్రత కల్పించేందుకు పోలీసులు ఉచితంగా ఈ సేవలను అందిస్తున్నారని పేర్కొన్నారు. అందుకోసం ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులోని వాచ్ రిక్వెస్ట్‌ను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. ఇందులో పూర్తి వివరాలు నమోదు చేస్తే వెంటనే పోలీసులు వచ్చి ఇంటర్నెట్ ప్రోటోకాల్ బేస్డ్ కెమెరాలను అమర్చుతారన్నారు. ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవల కోసం సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో లేదా 9121102276 సెల్ నంబరుకు ఫోన్ చేసి సమాచారం తెలుసుకోవ్చని ఎస్పీ సూచించారు.

26న మద్దిపాడు మండల సమావేశం

మద్దిపాడు, ఫిబ్రవరి 21: మద్దిపాడు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 26న మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వాకా అరుణ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో టి.సుగుణమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, మండల పరిషత్ అధికారులు సమగ్ర నివేదికతో హాజరుకావాలని కోరారు.

వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం : టీడీపీ

మద్దిపాడు, ఫిబ్రవరి 21: వైసీపీ పాలనలో వ్యవస్థలు అన్నీ నిర్వీర్యం అయ్యాయని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు ఆరోపించారు. బుధవారం నేలటూరు దళితవాడలో మనఊరు-మనతెలుగుదేశం కార్యక్రమంలో ఆయన పాల్గొని మట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హయాంలో అన్ని వ్యవస్థలు కుదేలు అయ్యాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పక్కదారి పట్టించారని విమర్శించారు. దేవబత్తిన ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లతోపాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. కారక్రమంలో నాయకులు ముల్లారి మురళి, మండవ గోపీనాథ్, రెబ్బ వరపు ప్రభాకర్, శుద్దపలి అనిల్, శుద్దపల్లి సుబ్బారావు, వేల్పుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన పెంచుకోవాలి

మద్దిపాడు ఫిబ్రవరి 21: హెచ్ఐవీ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎయిడ్స్ విభాగం ప్రాజెక్టు మేనేజర్ ఎస్‌కే.పీర్‌బాషా తెలిపారు. బుధవారం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో కళాకారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకుని జాగ్రత్తగా జీవించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయలక్ష్మి, అనిల్, రాణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బులు చెల్లించాలి

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: అగ్రిగోల్డ్ బాధితులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పూర్తిగా డబ్బులు చెల్లించాలని అగ్రిగోల్డ్ బాధితుల పోరాట సంఘం నాయకులు వి.మోజెష్, జి.జడ్సన్, ఎ.కోటేశ్వరరావు, కె.విశాలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పూర్తిగా డబ్బులు వస్తాయని ఎదురు చూసిన బాధితులకు నిరాశే మిగిలిందన్నారు. రూ.20వేల లోపు వారికి కూడా పూర్తిగా డబ్బులు ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే బాధితులందరికి డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఉద్యమాలను ఉధృతం చేయాలి



మాట్లాడుతున్న ఆంజనేయులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: అక్టోబరు విప్లవ స్ఫూర్తితో కార్మిక, కర్షక ఉద్యమాలను ఉధృతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు పిలుపునిచ్చారు. రెడ్ బుక్‌డే సందర్భంగా బుధవారం ఒంగోలులోని సుందరయ్యభవన్‌లో జరిగిన సమావేశానికి జి.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మార్క్స్, ఎంగిల్స్ రూపొందించిన కమ్యూనిస్టు సిద్ధాంతం ఆధారంగా లెనిన్ రష్యాలో 1917లో సోషలిస్ట్ విప్లవం సాధించారన్నారు. అనంతరం చైనా, వియత్నాం, క్యూబా, లావోస్, ఉత్తర కొరియాలలో సోషలిస్ట్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయని తెలిపారు. దేశంలో కార్పొరేట్, దోపిడీ కారణంగా రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. పాలక ప్రభుత్వాలు కార్పొరేట్ల ప్రయోజనాలకు తలొగ్గి సామాన్యుల ప్రయోజనాలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జీవీ.కొండారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి



డీఈవో సుభద్రకు వినతిపత్రం ఇస్తున్న సంఘ నాయకులు

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 21: జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. బుధవారం ఒంగోలులో జిల్లా విద్యాశాఖాధికారి సుభద్రను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులను వెంటనే చేపట్టాలని, సర్వీసు రెగ్యులేషన్ క్యాంపులు నిర్వహించాలని కోరారు. కొవిడ్ సమయంలో పనిచేసిన ఉపాధ్యాయులకు సంపాదిత సెలవుల ఉత్తర్వులు ఇవ్వాలని, డీఈవో కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులు, గ్రూపు-1, గ్రూపు-2 అభ్యర్థుల ఎన్‌ఓసీలను ఇవ్వాలన్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న ఒంగోలు, మార్కాపురం మునిసిపల్ పాఠశాలలకు అద్దె చెల్లించాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల శిక్షణ రెమ్యునరైజేషన్ చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కె.శ్రీనివాసరావు, డి.వీరాంజనేయులు, ఎస్.రవి, జి.ఉమామహేశ్వరి, కొండారెడ్డి, పి.ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యతో ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న ఎస్సై నాగేశ్వరరావు

టంగుటూరు, ఫిబ్రవరి 21 : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఎస్సై నాగేశ్వరరావు సూచించారు. బుధవారం టంగుటూరు పోతుల చెంచయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల 52వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న ఎస్సై మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు అవసరమైన ఆర్థికసహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మార్చిలో ఉద్యోగ విరమణ చేయబోతున్న వీరనారాయణరావును కళాశాల సిబ్బంది ఘనంగా సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ బి.నారాయణ, సింగరాయకొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, డీటీ శ్రీనాథ్, మండల వ్యవసాయాధికారి స్వర్ణలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే

అర్హులకు 2సెంట్లు భూమి, ఇళ్ల నిర్మాణం

నాలుగేళ్ళుగా గుర్తుకు రాని పేదలు ఎన్నికలప్పుడే గుర్తొచ్చారా..? • టీడీపీ ఆత్మీయ సమావేశంలో దామచర్ల విమర్శలు • వైసీపీ నుంచి భారీగా టీడీపీలోకి చేరికలు





దామచర్ల జనార్దన్, బీఎన్.విజయ్‌కుమార్‌లకు పూలమాల వేస్తున్న నాయకులు, సభకు భారీగా తరలివచ్చిన మహిళలు, యువత

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 21: గత నాలుగున్నరేళ్ళుగా గుర్తుకు రాని పేదలు, ఎన్నికల సమయంలో గుర్తుకు వచ్చారా? ప్రతిసారి ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, ప్రజలను మోసం చేయడం ఒంగోలు ఎమ్మెల్యేకు వెన్నతో పెట్టిన విద్యలాంటిదని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి ఒక్కరికి 2 సెంట్లు భూమి ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణం చేపడతామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కర్నూలురోడ్‌లో నిర్వహించిన టీడీపీ ఆత్మీయ సమావేశానికి దామచర్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైసీపీ యువజన నాయకులు రావినూతల రవితేజ, నెమలకంటి అనిల్, పాశం గంగాధర్ ఆధ్వర్యంలో 100మంది యువత టీడీపీలోకి చేరారు. పార్టీ నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన సమావేశంలో దామచర్ల మాట్లాడుతూ గడిచిన ఐదేళ్ళలో గుర్తుకు రాని పేదలు వైసీపీ నేతకు ఇప్పుడు గుర్తొచ్చారా అని ప్రశ్నించారు. ఇళ్ళ పట్టాల పంపిణీలో పారదర్శకత లేదని, నగరంలో 87వేల మంది ఉంటే 25వేల మంది పేదలు ఉన్నట్లుగా చెబుతున్నావు. అందులో నిజమైన అర్హులు 7వేలకు మించి లేరని విమర్శించారు. ఇపుడు ఇచ్చే 20,840 పట్టాలలో సగానికి పైగా అందరూ వైసీపీకి చెందిన వారే అని ఆరోపించారు. పేదల పట్టాల పంపిణీపై కోర్టుకు వెళ్ళింది వైసీపీ చెందిన వారే అని, ఆ విషయాన్ని కప్పిపుంచి టీడీపీపై నిందలు వేయడం మానుకోవాలని హితవు పలికారు. చేతనైతే ఇళ్ళ పట్టాలపై కోర్టులో పిల్ వేసింది ఏ పార్టీకి చెందిన వారో పత్రికాముఖంగా చెప్పే ధైర్యం లేదన్నారు. గతంలో కొప్పోలు వద్ద బాలినేని పట్టాలు ఇస్తే ఇప్పటికీ ఎవరూ అక్కడ నివసించడం లేదని, అలాంటి పట్టాలు ఇచ్చి మోసం చేయడం మానుకోవాలన్నారు. పట్టాల పంపిణీ ప్రక్రియ చట్టబద్ధంగా లేదని, భరోసా పత్రాలు ఇస్తే పట్టాలు అవుతాయా ? అని దామచర్ల ఘాటుగా విమర్శించారు. అధికారం, డబ్బు ఉందని ప్రజలను మోసం చేస్తే నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్నారు. ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయడం కోసం కొద్ది రోజులుగా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని దామచర్ల తెలిపారు. వైసీపీ ఎన్ని బూటకపు కుట్రలు పన్నినా ప్రజలు తమ పక్షాన ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ గెలుస్తుందని చెప్పారు. టీడీపీ అధికారంలోకి రాగానే గతంలో ఇచ్చిన టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి వారికి కేటాయిస్తామన్నారు. అలాగే మిగిలిపోయిన లబ్ధిదారులకు 2సెంట్లు భూమి, ఇళ్ళు కట్టి ఇస్తామని హామీ ఇచ్చారు.

ఎస్ఎన్.పాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బీఎన్.విజయ్ కుమార్ మాట్లాడుతూ పేదల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. వైసీపీ అరాచక పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా నష్టపోయారన్నారు. మరోసారి వైసీపీ అధికారంలోకి వస్తే సామాన్యుడు సంతోషంగా జీవించే పరిస్థితి లేదన్నారు. వైసీపీ అరాచక పాలన ప్రజలకు కళ్ళకు కట్టినట్టు కనిపిస్తుందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించి ప్రజల పాలన సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానికంగా నివసించే వైసీపీకి చెందిన యువత పెద్ద సంఖ్యలో దామచర్ల సమక్షంలో టీడీపీలో చేరారు. అంతకుముందు టీడీపీలో చేరడాన్ని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు యువతను బెదిరింపులకు గురి చేయగా, వారి బెదిరింపులను సైతం లెక్కచేయని యువత టీడీపీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు మంత్రి శ్రీనివాసరావు, వైవీ.సుబ్బారావు, బొల్లినేని వాసుకృష్ణ, కాట్రగడ్డ సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీలో బీఈడీలకు షాక్

• ఎస్‌జీటీ పోస్టులకు దరఖాస్తులపై హైకోర్టు స్టే

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 21 : డీఎస్సీ-2024 బీఈడీ అభ్యర్థులకు షాక్ తగిలింది. డీఎస్సీలో ప్రకటించిన సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు బీఈడీ విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడంపై బుధవారం హైకోర్టు స్టే విధించింది. దీంతో ఎస్‌జీటీ పోస్టులపై వారు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. బీఈడీ విద్యార్హతలున్న అభ్యర్థులు స్కూలు అసిస్టెంట్లు, టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్స్ పోస్టులకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో డీఎస్సీ 2024కు మొత్తం 503 పోస్టులు మాత్రమే ప్రకటించారు. వీటిలో ఎస్‌జీటీ 111, స్కూలు అసిస్టెంట్లు 299, టీజీటీ పోస్టులు 93 ఉన్నాయి. ఎస్‌జీటీలకు డీఈడీ, బీఈడీ అభ్యర్థులందరూ అర్హులేనని డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటించారు. అయితే నిబంధనల మేరకు కేవలం డీఈడీ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఈమేరకు ఏపీసీటీఈ కూడా ధ్రువీకరించింది. గతంలో ఎస్‌జీటీ అర్హతలపై డీఈడీ, బీఈడీ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు కూడా డీఈడీ అభ్యర్థులకే కేటాయించాలని తీర్పు ఇచ్చింది. అయితే డీఎస్సీ-24లో బీఈడీ అభ్యర్థులకు కూడా ఎస్‌జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వడంతో డీఈడీ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారించిన న్యాయస్థానం ఎస్‌జీటీ పోస్టులపై స్టే విధించింది. తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఇదిలా ఉండగా ఈనెల 12 నుంచి అభ్యర్థులు డీఎస్సీ పోస్టులకు దరఖాస్తులు చేస్తున్నారు. బుధవారంతో దరఖాస్తు గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో ఎస్‌జీటీ పోస్టులకు ఇప్పటికే వందలాది మంది బీఈడీ అభ్యర్థులు దరఖాస్తు చేసి ఉంటారు. వీరిని రాత పరీక్షకు అనుమతించకపోతే వారు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వ పరిస్థితి 'ముందు నుయ్యి వెనుక గొయ్యి' అన్న చందంగా మారింది. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో మొత్తంగా ఎస్‌జీటీల నియామక ప్రక్రియకు బ్రేకులు పడే అవకాశం కనిపిస్తోంది.

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

హెలిప్యాడ్‌తోపాటు వాహన రాకపోకలకు ప్రత్యేక చర్యలు

పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ, బాలినేని



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలినేని, కలెక్టర్, ఎస్పీ, అధికారులు

ఒంగోలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 21 : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఒంగోలుకు రానున్నారు. నగర సమీపంలోని ఎన్.అగ్రహారంలో లే అవుట్‌లో పేదలకు పట్టాలు పంపిణీ చేయనున్నారు. అందుకు సంబంధించి అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. నవరత్నాల పథకంలో భాగంగా సుమారు 23వేల మందికి పట్టాల పంపిణీకి భారీగా జనం తరలిరానుండటంతో సభా వేదిక వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. వీఐపీలు, అధికారులకు ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఏర్పాట్లను మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ పరమేశ్వరరెడ్డితో పాటు పలుశాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం భద్రతతోపాటు వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, మేయర్ గంగాడ సుజాత ఉన్నారు. మరోవైపు జిల్లా అధికారులతో కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సీఎం పర్యటన నేపథ్యంలో ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు.

పలుచబడిన అభిమానం

వైసీపీ శ్రేణుల్లో కానరాని ఉత్సాహం

పేలవంగా దద్దాల పరిచయ కార్యక్రమం

కార్యక్రమానికి డుమ్మా కొట్టిన ఎమ్మెల్యే బుర్రా, మాజీ ఎమ్మెల్యే కదిరి

కనిగిరి, ఫిబ్రవరి 21 : అట్టహాసంగా సాగుతుందనకున్న వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ పరిచయ కార్యక్రమం కనిగిరిలో పేలవంగా జరిగిందని ఆ పార్టీ శ్రేణులే గుసగుసలాడుకుంటున్నాయి. ఇన్‌చార్జిగా అధిష్ఠానం ప్రకటించిన నాటినుంచి పదిరోజుల క్రితం ఒకసారి, బాలినేని, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రాక సందర్భంగా మరోసారి దద్దాల నారాయణ స్వాగత ర్యాలీలు నిర్వహించారు. తొలి ర్యాలీలో వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులయ్యాక తొలిసారి వస్తున్న దద్దాలకు స్వాగతం కోసం జరగగా, బుధవారం రెండోసారి పరిచయ వేదిక అంటూ బాలినేని, చెవిరెడ్డిలకు స్వాగత ర్యాలీ నిర్వహించారు. తొలిసారి నిర్వహించిన ర్యాలీ కంటే బుధవారం నిర్వహించిన ర్యాలీలో జనాలు మరింత పలుచగా కనిపించారు. నియోజకవర్గంలోని ప్రధాన సామాజికవర్గానికి చెందిన నేతల కనుసన్నల్లోనే దద్దాల ఆద్యంతం నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి కార్యక్రమంలోనూ నగదు పంపకంతోనే జనసమీకరణ చేశారు. నగదు కోసం వచ్చిన జనం చాలామంది భోజనాలు చేసి ఫంక్షన్ హాలులోకి రాకుండానే తిరుగుముఖం పట్టారు. దీంతో హాలులో కేవలం వెయ్యి మందికి మించి లేకపోవటం శ్రేణుల్లో నిరుత్సాహాన్ని నింపింది.

కార్యకర్తలను, నేతలను విస్మరిస్తే మనుగడ కష్టం

ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రసంగంలో ఎమ్మెల్యే బుర్రాపై పరోక్ష విమర్శలు చేశారు. అధికారంలోకి రాకముందు ముఖ్యనేతలు, కార్యకర్తలను భుజానకెత్తుకుని అధికారాన్ని చేపట్టాక వారిని విస్మరిస్తే రాజకీయంగా మనుగడ కష్టమని హెచ్చరించారు. కులం ఓట్లతోనే రాజకీయం చేయాలనుకుంటే ఒకసారికే పదవి ఉంటుదన్న విషయం రుజువైందని ఎమ్మెల్యే బుర్రాకు పరోక్షంగా చురకలు అంటించారు. ఈ కారక్రమానికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావులు డుమ్మాకొట్టారు. ఈ సభకు రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, ఐదు మండలాల జడ్పీటీసీ సభ్యులు, నలుగురు ఎంపీపీలు, కౌన్సిలర్లు హాజరు కాగా, సీఎస్‌పురం ఎంపీపీ మూడమంచు, కనిగిరి ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు చప్పిడి వెంగయ్యలు మాత్రం హాజరుకాలేదు.

నల్లమలలో ట్రాఫిక్ స్తంభన

• రెండు వాహనాలు ఢీకొని 3 గంటలు నిలిచిన రాకపోకలు

పెద్దదోర్నాల, ఫిబ్రవరి 21 : ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు లారీలు ఢీ కొని 3 గంటల పాటు రాకపోకలు స్తంభించిన ఘటన నల్లమల అటవీ ప్రాంతంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ సంఘటన ఆత్మకూరు మండల పరిధిలో రోళ్లపెంట సమీపంలో జరిగింది. గుంటూరు వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న వడ్ల లారీ కర్నూలు వైపు నుంచి దోర్నాల వైపు ప్రయాణిస్తున్న లారీ మూలమలుపు వద్ద వేగం అదుపు తప్పి రెండు వాహనాలు ఢీకొని రోడ్డుకు అడ్డంగా తిరిగాయి. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి అపాయం జరగలేదు. కానీ రెండు వైపులా వాహనాలకు ప్రయాణించే అవకాశం లేక నిలిచిపోయాయి. ఉదయం 8గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదం వల్ల ఉదయం11గంటల వరకు 3గంటల పాటు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ఆత్మకూరు పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకుని రెండు వాహనాలను పక్కకు తొలగించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

వైసీపీ పాలనలో రాజధాని లేని రాష్ట్రం



ప్రేక్షకులకు ఉచితంగా టిక్కెట్లను అందజేస్తున్న పువ్వాడి

పామూరు, ఫిబ్రవరి 21 : రాష్ట్ర రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయాల్సిన వైసీపీ పాలకులు మూడు రాజధానులు అంటు రాజధాని లేని రాష్ట్రంగా తయారు చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆరోపించారు. రాజధాని అమరావతిని వైసీపీ పాలకులు ఎలా అధోగతి పాల్జేశారో తెలుసుకునేందుకు తీసిన సినిమాయే రాజధాని ఫైల్స్ అని వారు చెప్పారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉగ్ర ఆదేశాల మేరకు మండలంలోని ప్రజలందరూ సినిమాను తిలకించేందుకు శేషమహాల్‌లో బుధవారం 4 షోల టికెట్లను ప్రజలకు పంపిణీ చేసినట్లు పువ్వాడి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం రమణయ్య, షేక్ ఖాజారహంతుల్లా, ఎస్ సాంబయ్య, దేవరపు మాల్యాద్రి, యాదాల మాలకొండయ్య, పువ్వాడి చినలక్ష్మయ్య, పూనాటి వెంకటేశ్వర్లు, పగడాల మాల్యాద్రిలు పాల్గొన్నారు.

అద్దె చెల్లించలేదని..

తురకపాలెం సచివాలయానికి తాళం

• 18నెలలుగా పేరుకుపోయిన బకాయిలు



సచివాలయానికి వేసిన తాళం

తాళ్లూరు, ఫిబ్రవరి 21 : గ్రామ సచివాలయం నిర్వహిస్తున్న భవనానికి 18 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమాని బుధవారం తాళం వేసి సిబ్బందిని బయటకు పంపారు. ఈ ఘటన తాళ్లూరు మండలం తురకపాలెంలో చోటుచేసుకుంది. గ్రామసచివాలయాన్ని 2020 జనవరి నుంచి అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గ్రామానికి సొంతంగా పంచాయతీ కార్యాలయం ఉన్నా బాగా లేదంటూ అధికార పార్టీ నేతలు తమ అనుచరునికి లబ్ధి చేకూర్చేందుకు వ్యూహం పన్నారు. మారుమూల గ్రామంలో సైతం నెలకు రూ.4వేల చొప్పున అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పటి నుంచి పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేకాధికారి పాలన కొనసాగినా అద్దె చెల్లించలేదు. పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్ష టీడీపీ మద్దతుదారుడు సర్పంచ్‌గా ఎన్నికైన తరువాత అద్దె బకాయిలు తెరపైకి వచ్చాయి. అద్దె బకాయి చెల్లించాలని పదేపదే ఒత్తిడి చేయటం, ఇంటి యజమాని సచివాలయానికి తాళం వేస్తుండటం కొనసాగుతూనే ఉంది.

బకాయి రూ.72వేలు

ప్రస్తుతం సచివాలయానికి 18నెలలకు గాను రూ.72వేల అద్దె బకాయి ఉంది. ఇటీవల గ్రామ సర్పంచ్ రూ.25వేలు తన సొంత డబ్బు చెల్లించారు. ప్రభుత్వం పంచాయతీ నిధులను తరచూ దారిమళ్లిస్తుండడంతో నిధుల కొరత వేధిస్తోంది. దీంతో అద్దెలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. గ్రామపంచాయతీలో నిధులు లేకపోవటంతో అద్దె చెల్లింపు కష్టంగా ఉందని, నూతన సచివాలయం భవన నిర్మాణం జరిగే వరకు పంచాయతీ సొంత భవనంలో సచివాలయం నడపాలని అధికారులకు, కలెక్టర్‌కు సర్పంచ్ విన్నవించినా పట్టించుకున్న నాథుడే లేరు. త్వరలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే అద్దె చెల్లింపు కష్టం అవుతుందని పలువురు చెప్పటంతో ఇంటి యజమాని చింపిరయ్య గత రెండు వారాల్లో నాలుగుసార్లు సచివాలయానికి తాళం వేశారు. సర్పంచ్ మాట్లాడి తాళం తీయించటం జరుగుతూనే ఉంది. సర్పంచ్ ఈ విషయాన్ని ఎంపీడీవో యుగకీర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఇంటి యజమానిని పిలిచి మాట్లాడినా మంగళ, బుధవారాలు సచివాలయానికి మళ్లీ తాళం వేసి సిబ్బంది విధులను అడ్డుకోవడం గమనార్హం.

ప్రతిపక్ష సర్పంచ్‌నైనందునే సచివాలయానికి తాళం



పంచాయతీలో నిధుల కొరత వేధిస్తోంది. ఉన్న నిధులను ప్రభుత్వం వాడేసుకుంది. గ్రామంలో వీధిలైట్లు, సైడు కాలువల పనులు చేసేందుకూ డబ్బులు లేవు. సొంత భవనాన్ని వదిలేసి అధికారపార్టీ వారికి లబ్ధి జరిగేలా అద్దె భవనంలో సచివాలయాన్ని నడిపిస్తున్నారు. ప్రతిపక్ష సర్పంచ్‌నైనందున అధికారపార్టీ నేతలు చెప్పినట్లు ఇంటి యజమాని సచివాలయానికి తాళం వేసి ఇబ్బందులు పెడుతున్నాడు.

\- చంద్రగిరి గుర్వారెడ్డి, సర్పంచ్

వెలిగొండ ప్రాజెక్టు పైపులకు తుప్పు

కాలువల నిర్మాణ పనుల్లో ఐదేళ్లుగా నిర్లక్ష్యం • రూ.కోట్ల విలువ చేసే ఇనుప పైపులు పాడవుతున్నవైనం



కాలువపల్లి బస్టాండ్ సమీపంలో నిల్వ ఉంచిన ప్రాజెక్టు పైపులు

రాచర్ల, ఫిబ్రవరి 21 : వెలిగొండ ప్రాజెక్టు కాలువ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనపడుతున్నది. పశ్చిమ ప్రాంత వరప్రసాదిని అయిన వెలిగొండ ప్రాజెక్టు రెండు టన్నెల్స్ తామే పూర్తి చేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం కాలువ పనుల్లో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నది. 5 సంవత్సరాల నుంచి పనుల్లో పురోగతి లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉన్నట్లుగా తయారైంది. వెలిగొండ ప్రాజెక్టు పనుల్లో భాగంగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో కాలువ పనులు మొదలు పెట్టారు. తురిమెళ్ల వద్ద రిజర్వాయర్ నిర్మించి పైపులైన్ కాలువ ద్వారా రాచర్ల చెరువుకు నీరు వచ్చేటట్లు, అక్కడి నుంచి పైపలైన్ ద్వారా కొమరోలు మండలం మీదుగా కడపకు వెలిగొండ జలాలు వెళ్లాల్సి ఉంది. ఆమేరకు దాదాపు పెద్దపెద్ద ఇనుప పైపులను కాలువపల్లి బస్టాండ్ సమీపాన అప్పటి అధికారులు నిలువ ఉంచారు. వాటికి ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేసి వాటిపై కాంక్రీట్ వేశారు. అయితే గత ఐదేళ్ల నుంచి రాచర్ల మండల పరిధిలో గౌతవరం మీదుగా రాచర్ల వరకు పైపులైన్ వేసి వదిలివేశారు. మిగతా పనులు ఇంతవరకు జరగకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు కాలువ పనులు దాదాపు 50శాతం పైగానే చేసినప్పటికీ మిగతా పనులు చేయడంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది. కాలువపల్లి బస్టాండ్ సమీపంలో భారీ పైపులు తుప్పుపట్టిపోయాయి. దీంతో ఈ పైపులు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. వర్షానికి, ఎండకు ఉండడంతో పైపుల నాణ్యత తగ్గిపోయి కాలువ నిర్మాణానికి పనికిరాకుండా పోయినట్లు రైతులు చెప్తున్నారు.

ఆర్టీసీ బస్సులు ఢీకొని

పలువురికి గాయాలు

పర్చూరు - గుంటూరు రహదారిలో బోడవాడ వద్ద సంఘటన



పూర్తిగా దెబ్బతిన్న ఆర్డినరీ బస్సు

బోడవాడ(పర్చూరు), ఫిబ్రవరి 21: రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పర్చూరు - గుంటూరు అర్‌అండ్‌బీ రోడ్డులోని బోడవాడ సమీపంలో చోటుచేసుకుంది. ప్రయాణికులు, స్థానికుల సమాచారం మేరకు పర్చూరు నుంచి ప్రయాణికులతో గుంటూరు వెళుతున్న ఆర్డినరీ బస్సు బోడవాడ సమీపానికి చేరుకునే క్రమంలో గుంటూరు నుంచి ప్రయాణికులతో పర్చూరు వస్తున్న ఆర్‌టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా వచ్చి ఆర్డినరీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్డినరీ బస్సులో ప్రయాణిస్తున్న కంబంపాటి అక్కమ్మ, ఎం.తిరుపతమ్మ అనే ఇరువురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతోపాటు పలువురు ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదతీరును పరిశీలించారు. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అనంతరం గుంటూరు తరలించారు.

అతివేగమే ప్రమాదానికి కారణం : ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా దూసుకు రావటం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు అంటున్నారు. బస్సు వేగాన్ని గుర్తించిన ఆర్డినరీ బస్సు డ్రైవర్ బస్సును మార్జిన్‌లోకి తీసుకుపోవటంతో ప్రాణాలతో బయట పడ్డామని ప్రయాణికులు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం : ప్రమాదం జరిగిన సమయంలో ఎక్స్‌ప్రెస్ బస్సులో 42 మంది, ఆర్డినరీ బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎదురెదురుగా బస్సులు ఢీకొని ఉంటే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగి ఉండేదని ప్రయాణికులు అంటున్నారు.

హత్య కేసులో ప్రియుడి అరెస్టు

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 21: మండలంలోని నికరంపల్లి గ్రా మంలో మీనిగ వెంకటేశ్వర్లును హత్యచేసిన వ్యక్తి మారంరెడ్డి కాశిరామిరెడ్డి ని అరెస్టు చేసినట్లు సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ బుధవారం తెలిపారు. మీనిగ వెంకటేశ్వర్లు భార్యతో నిందితుడు కాశీరామిరెడ్డి వివాహేతర సంబంధం కలిగి ఉండడంతో ఆమె భర్త అడ్డుగా ఉన్నాడన్న కారణంతో సోమవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న వెంకటేశ్వర్లును హత్య చేశాడని తెలిపారు. పరారీలో ఉన్న కాశీరామిరెడ్డిని పోలీసులు గాలించి బుధవారం అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. కాశీరామిరెడ్డిని కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

లాడ్జి కిటికీ నుంచి పడి ఉద్యోగి మృతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంకు చెందిన అగ్రికల్చర్ ఉద్యోగి చీరాల పట్టణంలో బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే భీమవరంకు చెందిన గొందు కరుణకుమార్(48) అగ్రికల్చర్ అటెండర్. ఈక్రమంలో సహోద్యోగి సాయివంశీ, డ్రైవర్ శ్రీనుతో కలిసి వేటపాలెం మండలంలోని సంబంధిత డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారి ఇంట్లో శుభకార్యానికి మంగళవారం రాత్రి చీరాలకు వచ్చారు. బుధవారం ఫంక్షన్ కావడంతో చీరాల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో రూం బుక్ చేసుకున్నారు. ఈ సమయంలో సహచరులతో కలిసి మద్యం సేవించారు. అనంతరం ఇరువురు నిద్రించగా కరుణకుమార్ కిటికీలో కూర్చుని జారిపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అర్ధరాత్రి లాడ్జి వద్దకు చేరుకుని నిద్రలో ఉన్న ఇరువురిని లేపి విషయంపై ఆరా తీయగా వారు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఏరియా వైద్యశాలలో పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే మిగిలిన ఇరువురిని వన్‌టౌన్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కరుణకుమార్ మృతితో ఆ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు చీరాలకు వచ్చారు. మృతి ప్రమాదవశాత్తుగానే జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతునికి మూడు నెలల పాప, భార్య ఉన్నారు.

వరద వస్తే నీళ్లివ్వొచ్చు..!

» రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్

» వెలిగొండ సొరంగాల పరిశీలన



టన్నెల్‌ను పరిశీలిస్తున్న శశిభూషణ్

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 21 : వర్షాలు బాగా కురిసి కృష్ణానదికి వరద వస్తే నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు నీళ్లివ్వచ్చని జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ పేర్కొన్నారు. పెద్దదోర్నాల మండలంలోని కొత్తూరు వద్ద నిర్మిస్తున్న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులోని కీలక భాగాలైన రెండవ సొరంగం పనులను ఆయన జిల్లా ఇరిగేషన్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు పనుల పురోగతిని వివరించారు. అనంతరం కారుల్లో రెండో సొరంగం అంతర్భాగం గుండా హెడ్ రెగ్యులేటర్ వరకు వెళ్లి పరిశీలించి వచ్చారు. ఈ సందర్భంగా శశిభూషణ్ విలేకరులతో మాట్లాడుతూ నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయని, దేవుడి దయ వల్ల వర్షాలు బాగా కురిస్తే వచ్చే మిగులు జలాలను నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు తరలించవచ్చన్నారు. నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పరిహారం పరిస్థితిపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ పరిహారం ఇవ్వకుండా ఎక్కడైనా ప్రారంభించారా? అని అన్నారు. సొరంగం లోపలి భాగాన ఉన్న లైనింగ్ పనులు, టీబీఎం తొలగింపు తదితర పెండింగ్ పనులపై మాట్లాడుతూ నీళ్లివ్వడానికి అవేమీ ఇబ్బంది కాదని, ఇంజనీరింగ్ శాఖాధికారులు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించేందుకు త్వరలో టన్నెళ్ల వద్దకు రానున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెలిప్యాడ్‌ను ఆధునికీకరించారు. అక్కడే పైలాన్‌ను కూడా నిర్మించారు. ఈక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సందర్శనతో సీఎం పర్యటన తేదీని ప్రకటించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖాధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఎన్‌సీ నారాయణరెడ్డి, సీఈ మురళీధర్, ఎస్ఈ అబూతాలిబ్, ఈఈ పురవర్ధన్‌రెడ్డి, మెఘా ప్రతినిధి రాంబాబు పాల్గొన్నారు.



శ్రీచక్ర స్నానం చేయిస్తున్న అర్చకులు

వైభవంగా శ్రీచక్ర స్నానం

పరవశించిన భక్త జనం

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 21: గుండ్లకమ్మ నదీ తీరాన వెలసిన లక్ష్మీ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా బుధవారం శ్రీమహావిష్ణువు ప్రధాన ఆయుధమైన శ్రీచక్రానికి శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహించారు. ఎత్తైన వేదికపై శ్రీచక్రాన్ని ఉంచి భక్తులు శ్రీ చక్ర స్నానం ఆచరించే విధంగా నిర్వహించారు. అనంతరం ఆలయ బలిహరణ, ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి అశ్వ వాహన సేవ స్వామికి నిర్వహించారు. ఉభయదాతులు నాదెళ్ల సుబ్రహ్మణ్యం, చంద్రమౌళి వ్యవహరించారు.

హెచ్‌ఐవీపై కళాకారుల అవగాహన

త్రిపురాంతకం, ఫిబ్రవరి 21: ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాలతో హెచ్‌వోసీ ఆధ్వర్యంలో ఎయిడ్స్, సుఖవ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీవిశ్వేశ్వర కళాజాతా శివప్రసాద్ బృందంతో హెచ్‌ఐవీ ఎలా వస్తుంది, రాకుండా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలు, సుఖవ్యాధులపై నాటక రూపంలో ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌వోసీ ప్రాజెక్టు మేనేజర్ కె.ఐజక్‌బాబు, డి.సుబ్బయ్య, అన్నపూర్ణ, సువర్ణ పాల్గొన్నారు.




అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వెలిగొండ పైపులకు తుప్పు..!

- కాలువల నిర్మాణ పనుల్లో ఐదేళ్లుగా నిర్లక్ష్యం
- కోట్ల విలువ చేసే ఇనుప పైపులు పాడవుతున్న వైనం

రాచర్ల, ఫిబ్రవరి 21 : వెలిగొండ ప్రాజెక్టు కాలువ పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనపడుతున్నది. పశ్చిమ ప్రాంత వరప్రసాదిని అయిన వెలిగొండ ప్రాజెక్టు రెండు టన్నెల్స్ తామే పూర్తి చేశామని చెప్పుకుంటున్న ప్రభుత్వం కాలువ పనుల్లో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నది. 5 సంవత్సరాల నుంచి పనుల్లో పురోగతి లేకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉన్నట్లుగా తయారైంది. వెలి గొండ ప్రాజెక్టు పనుల్లో భాగంగా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వంలో కాలువ పనులు మొదలు పెట్టారు. తురిమెళ్ల వద్ద రిజర్వాయర్ నిర్మించి పైపులైన్ కాలువ ద్వారా రాచర్ల చెరువుకు నీరు వచ్చేటట్లు, అక్కడి నుంచి పైపులైన్ ద్వారా కొమరోలు మండలం మీదుగా కడపకు వెలిగొండ జలాలు వెళ్లాల్సి ఉంది. ఆమేరకు దాదాపు పెద్ద ఇనుప పైపులను కాలువపల్లి బస్టాండ్ సమీపాన అప్పటి అధికారులు నిలువ ఉంచారు. వాటికి ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేసి వాటిపై కాంక్రీట్ వేశారు. అయితే గత ఐదేళ్ల నుంచి రాచర్ల మండల పరిధిలో గౌతవరం మీదుగా రాచర్ల వరకు పైపులైన్ వేసి వదిలివేశారు. మిగతా పనులు ఇంతవరకు జరగకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు కాలువ పనులు దాదాపు 50శాతం పైగానే చేసినప్పటికీ మిగతా పనులు చేయడంలో వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నది. కాలువపల్లి బస్టాండ్ సమీపంలో భారీ పైపులు తుప్పుపట్టిపోయాయి. దీంతో ఈ పైపులు ఎందుకూ పనికిరాకుండా పోయాయి. వర్షానికి, ఎండకు ఉండడంతో పైపుల నాణ్యత తగ్గిపోయి కాలువ నిర్మాణానికి పనికిరాకుండా పోయినట్లు రైతులు చెప్తున్నారు.



కాలువపల్లి బస్టాండ్ సమీపంలో నిల్వ ఉంచిన వెలిగొండ ప్రాజెక్టు పైపులు

తుప్పు పట్టిన పైపులు



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఓటమి భయంతోనే మీడియాపై దాడులు

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఫిబ్రవరి 21 : ప్రశ్నించే గళం విన్నా.. నిజాలు రాసినా జగన్‌రెడ్డికి వణుకు అని, ఓడిపోతామన్న భయంతోనే మీడియా సంస్థలు, పత్రికా ప్రతినిధులు, ప్రతిపక్ష నేతలపై వైసీపీ అల్లరిమూకలతో దాడులకు పూనుకుంటున్నారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం మీడియాపై వైసీపీ శ్రేణుల దాడులపై ఆయన మాట్లాడారు. ఓటమితో పాటు పరాభవం ఖాయమని తెలిసి ఉద్దేశపూర్వకంగానే మీడియా, ప్రతినిధులపై వైసీపీ రౌడీ మూకలతో జగన్‌రెడ్డి దాడులు చేయిస్తున్నారన్నారు. ఇటీవల వరుసగా రాప్తాడు, కర్నూలు సంఘటనలు జరగడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా పేర్కొన్నారు. మీడియాపై దాడిని ప్రతి ఒక్కరూ ఖండించాలని ఎరిక్షన్‌బాబు విజ్ఞప్తి చేశారు. ప్రతి సభలోనూ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ-5 చానల్‌పై జగన్‌రెడ్డి అక్కసు వెళ్లగక్కుతూ మాట్లాడుతున్నారని గుర్తు చేశారు. బహిరంగంగానే వైసీపీ శ్రేణులను దాడులకు ఉసిగొల్పేలా జగన్‌రెడ్డి మాట్లాడుతున్నారని అన్నారు. భూములు, ఇసుక, మైనింగ్‌ను దోచుకోవడం, అత్యాచారాలు, హత్యలు, వైసీపీ అరాచకాలను వెలుగులోకి తెస్తున్న పత్రికలపై దాడి చేయడం జగన్‌రెడ్డి నియంతపాలనను ఎత్తిచూపుతుందన్నారు. పత్రికలపై, ప్రతిపక్షాలపై దాడులు కొనసాగిస్తే ప్రజలు చూస్తూ ఊరుకోరని తిరగబడతారని ఎరిక్షన్‌బాబు హెచ్చరించారు. సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి రాగానే అర్హులకు 2సెంట్లు భూమి, ఇల్లు నిర్మాణం

- టీడీపీ ఆత్మీయ సమావేశంలో దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 21: గత నాలుగున్న రేళ్లుగా గుర్తుకు రాని పేదలు, ఎన్నికల సమయంలో గుర్తుకు వచ్చారా? ప్రతిసారి ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం, ప్రజలన మోసం చేయడం ఒంగోలు ఎమ్మెల్యేకు వెన్నతో పెట్టిన విద్యలాంటిదని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ 2 సెంట్లు భూమి ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణం చేపడతామని రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. బుధవారం కర్నూలురోడ్‌లో నిర్వహించిన టీడీపీ ఆత్మీయ శ్రేణుల సమావేశంలో దామచర్ల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పార్టీ నగర అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో దామచర్ల మాట్లా డుతూ గడిచిన ఐదేళ్లలో గుర్తుకురాని పేదలు వైసీపీ నేతకు ఇప్పుడు గుర్తొచ్చారా అని ప్రశ్నించారు. ఇళ్ల పట్టాల పంపిణీలో పారదర్శకత లేదని, నగరంలో 87వేల మంది ఉంటే 25వేల మంది పేదలు ఉన్నట్లుగా చెప్తున్నావు.. అందులో నిజమైన అర్హులు 7వేలకు మించి లేరని విమర్శించారు. ఇపుడు ఇచ్చే 20,840 పట్టాలలో సగానికి పైగా అందరూ వైసీపీకి చెందిన వారే అని ఆరోపించారు.

నల్లమలలో ట్రాఫిక్ స్తంభన

రెండు వాహనాలు ఢీకొని 3 గంటలు నిలిచిన రాకపోకలు

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 21 : ఎదురెదురుగా ప్రయాణిస్తున్న రెండు లారీలు ఢీ కొని 3 గంటల పాటు రాకపోకలు స్తంభించిన ఘటన నల్లమల అటవీ ప్రాంతంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ సంఘటన ఆత్మకూరు మండల పరిధిలో రోళ్లపెంట సమీపంలో జరిగింది. గుంటూరు వైపు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న వడ్ల లారీ కర్నూలు వైపు నుంచి దోర్నాల వైపు ప్రయాణిస్తున్న లారీ మూలమలుపు వద్ద వేగం అదుపు తప్పి రెండు వాహనాలు ఢీకొని రోడ్డుకు అడ్డంగా తిరిగా యి. అయితే ఈ ప్రమాదంలో ఎవరికి ఎటువంటి అపాయం జరగలేదు. కానీ రెండు వైపులా వాహనాలకు ప్రయాణించే అవకాశం లేక నిలిచిపోయాయి. ఉదయం 8గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదం వల్ల ఉదయం11గంటల వరకు 3గంటల పాటు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ఆత్మకూరు పోలీసులకు సమాచారం అందడంతో సంఘటనా స్థలానికి చేరుకుని రెండు వాహనాలను పక్కకు తొలగించడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

26, 27 తేదీల్లో పరీక్షలు

గిద్దలూరు, ఫిబ్రవరి 21 : ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర పోస్టులకు ఈనెల 26, 27 తేదీలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు సెయింట్ పాల్స్ విద్యా సంస్థల కరస్పాండెంట్ ఆశీర్వాదం ఒక ప్రకటనలో తెలిపారు. 26న సెకండరీ గ్రేడ్, 27న స్కూల్ అసిస్టెంట్ ఎయిడ్ పోస్టులకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్హత, టెట్ ధ్రువీకరణ పత్రాలను వెంట తెచ్చుకోవాలన్నారు. ఎంప్లాయిమెంట్ ఎక్చేంజ్ ద్వారా చాలా మందికి సమాచారం పంపినప్పటికీ అడ్రస్సులు, పిన్‌కోడ్‌లలో లేనందున సకాలంలో అందని అభ్యర్థులందరూ పరీక్షకు నేరుగా హాజరు కావచ్చని పేర్కొన్నారు.

వలంటీర్లకు సన్మానం

గిద్దలూరు, ఫిబ్రవరి 21 : గిద్దలూరులోని విశా సుబ్బరత్నం కల్యాణ మండపం ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కె.నాగార్జునరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సన్మానించి ప్రశంసాపత్రాలను అందచేశారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలను కొనియాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందే విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, వైస్‌చైర్మన్లు ఆర్.డి.రామక్రిష్ణ, దీపిక, కమీషనర్ శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా హైస్కూల్ వార్షికోత్సవం



వార్షికోత్సవ సభలో మాట్లాడుతున్న జంకె

పొదిలి, ఫిబ్రవరి 21 : ప్రభుత్వ బాలురు ఉన్నతపాఠశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ ఐబీసీ రాష్ట్ర అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ చదవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ముందుగా సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేసి పూజులు చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు.

210 మద్యం బాటిళ్లు ధ్వంసం

పొదిలి, ఫిబ్రవరి 21 : వివిధ ప్రాంతాల్లో పట్టుబడిన మద్యం బాటిళ్లను ఎస్ఈబీ అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. ఎస్ఈబీ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో ఉన్న ద్విచక్రవాహనానికి వేలం వేశారు. రూ.20వేలు, జీఎస్టీ రూ.2400 వచ్చిందన్నారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో సీజ్ చేసిన 210 మద్యం బాటిళ్లను పగులగొట్టారు. ఎన్నికల దృష్ట్యా గంజాయి, మద్యం అక్రమ రవాణాపై దృష్టి సారించాలని సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డికి సూచించారు. సిబ్బంది చలపతి, గురవయ్య, పున్నమ్మ పాల్గొన్నారు.

హత్య కేసులో ప్రియుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ

మార్కాపురం రూరల్, ఫిబ్రవరి 21: మండలంలోని నికరంపల్లి గ్రామంలో మీనిగ వెంకటేశ్వర్లును హత్య చేసిన వ్యక్తి మారంరెడ్డి కాశిరామిరెడ్డిని అరెస్టు చేసినట్లు సీఐ ఆవుల వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర నాయక్ బుధవారం తెలిపారు. మీనిగ వెంకటేశ్వర్లు భార్యతో నిందితుడు కాశీరామిరెడ్డి వివాహేతర సంబంధం కలిగి ఉండడంతో ఆమె భర్త అడ్డుగా ఉన్నాడన్న కారణంతో సోమవారం అర్ధరాత్రి నిద్రిస్తున్న వెంకటేశ్వర్లును హత్య చేశాడని తెలిపారు. పరారీలో ఉన్న కాశీరామిరెడ్డిని పోలీసులు గాలించి బుధవారం అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. కాశీరామిరెడ్డిని కోర్టులో హాజరు పరచనున్నట్లు సీఐ వెల్లడించారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాంబాబు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తర్లుపాడు, ఫిబ్రవరి 21 : పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద వైఎస్ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మండలంలోని 590 డ్వాక్రా సభ్యులకు రూ.3,98,66142 చెక్కులను అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ మహిళా సంక్షేమ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సూరెడ్డి భూలక్ష్మి, ఏపీఎం డీ పిచ్చయ్య, ఎంఈవో దేవరకొండ సుజాత, ఇన్‌చార్జి ఎంపీడీవో చంద్రశేఖర్, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కందులకు మద్దతుగా ఉండాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందుల

పొదిలి, ఫిబ్రవరి 21 : రానున్న ఎన్నికల్లో తన విజయానికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ నివాసంలో క్లాత్, గోల్డ్ మర్చంట్ అసోసియేషన్ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. తన హయాంలో పట్టణంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండే కందులకు మద్దతుగా నిలవాలని భాస్కర్ విజ్ఞప్తి చేశారు. అనంతరం కందుల మాట్లాడుతూ రెండు పర్యాయాలు ఓటమి చవిచూసినా మీవెంటే ఉన్నానని గుర్తు చేశారు. రాష్ట్ర భవిష్యత్ దృష్ట్యా టీడీపీ గెలుపు అనివార్యమన్నారు.

మానవత్వం చాటుకున్న గునుపూడి

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ మానవత్వం చాటుకున్నారు. వారం కిందట రోడ్డు ప్రమాదంలో వేల్పుల నర్సయ్య ప్రమాదానికి గురయ్యారు. నర్సయ్యను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ అన్నీతానై ఒంగోలు ప్రైవేటు వైద్యశాలలో చేర్పించి స్వయంగా చికిత్సను చేయించారు. కోలుకొని ఇంటికి వచ్చిన నర్సయ్యను భాస్కర్ పరామర్శించారు. తనకు సాయపడిన భాస్కర్‌కు నర్సయ్య దంతపులు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా రుద్రాక్షల గ్రామోత్సవం



రుద్రాక్షలతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పొదిలి, ఫిబ్రవరి 21 : రుద్రాక్షలతో పొదిలి పట్టణంలో వైభవంగా బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. లోకనాయకుడైన శివునికి ప్రీతివంతమైన 20 లక్షల రుద్రాక్షలను ఓభక్తుడు నేపాల్ నుంచి తీసుకువచ్చారు. పార్వతీ సమేత నిర్మమహేశ్వర ఆలయం వద్ద నుంచి పెద్దబస్టాండ్ వరకు రుద్రాక్షల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులు మాట్లాడుతూ రానున్న శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం పుణ్యక్షేత్రంలో 30 అడుగుల శివలింగాన్ని ఏర్పాటు చేసి రుద్రాక్షలతో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వాటిని భక్తులకు అందజేస్తానని పగడాల మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు.కార్యక్రమంలో గునుపూడి భాస్కర్, జీసీ సుబ్బారావు, శేషగిరి, శ్రావణి వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ, రాజా, మోరబోయిన బాబూరావు, వరికుంట్ల అనిల్, మహిళా భక్తులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో మైనార్టీలకు రక్షణ కరువు

- జగన్‌రెడ్డి గద్దె దిగితేనే అభివృద్ధి
- టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు మౌలానా ముస్తాక్

మార్కాపురం వన్‌టౌన్, ఫిబ్రవరి 21: వైసీపీ పాలనలో రాష్ట్రంలో మైనార్టీలకు రక్షణ రనేవైందని తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా షేక్ ముస్తాక్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక జవహర్ నగర్‌లో నియోజకవర్గ ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం బుధవారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మౌలానా ముస్తాక్ మాట్లాడుతూ జగన్‌రెడ్డి గద్దెదిగితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల్లో వైసీపీని చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ భూములు, కొండలు, ఇసుకను ఏదీ వదలకుండా అన్ని కబ్జాలకు గురయ్యాయని అన్నారు. మాఫియా సామ్రాజ్యం లాగా ఇసుక మాఫియా, భూ మాఫియా చేస్తూ అన్ని వర్గాల ప్రజలను సంక్షోభంలోకి నెట్టి వైసీపీ గ్యాంగ్ మాత్రం హ్యాపీగా ఉందన్నారు. మైనార్టీలను దగా చేసిన ఏకైక వ్యక్తి జగన్ అన్నారు. మైనార్టీలపై వంద దాడులు జరిగాయని, అమాయకుల ఆత్మహత్యలకు వైసీపీ ప్రభుత్వ నాయకులే అన్నారు. పవర్ లేని వ్యక్తులకు మైనార్టీ పదవులు కట్టబెట్టారని విమర్శించారు. రాష్ట్రంలో రాజ్యాంగం ఉందా అని సూటిగా ప్రశ్నించారు. టీడీపీ అంటే తెగింపు, ధైర్యం, పోరాటం చేసే పార్టీ అన్నారు. జగన్ ప్రభుత్వం ఇచ్చేది గోరంత, లాక్కొనేది కొండంత అన్నారు. రానున్న ఎన్నికలలో వైసీపీకి బుద్ధి చెప్పాలని ముస్తాక్ పిలుపునిచ్చారు. టీడీపీ హయాంలో మైనార్టీలను చంద్రబాబు అన్ని రంగాలలో అభివృద్ధి చేశారన్నారు. కడపలో హజ్‌హౌస్ టీడీపీ హయాంలో 98శాతం పనులు పూర్తి చేస్తే వైసీపీ నిర్లక్ష్యం చేసిందన్నారు. దేశంలో 9 సార్లు కరెంట్ బిల్లులు పెంచి సామాన్యులను పీక్కుతుంటున్న వ్యక్తి జగన్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ తాను మైనార్టీలకు అన్ని రకాలుగా అండగా ఉన్నానన్నారు. కొంత మంది ప్యాకేజీ స్టార్‌లు ముస్లిం పోస్టులకు గాలం వేస్తున్నారని, వారికి బుద్ధి చెప్పాలన్నారు. వెలిగొండ ప్రాజెక్టుపై వైసీపీ నేతలు అబద్ధాలు చెప్తున్నారన్నారు. ఐదేళ్ల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందన్నారు. పట్టణంలో తాగునీటి ఎద్దడి తీర్చానని, రూ.43కోట్లతో సాగర్ జలాలు అందించానన్నారు. మార్కాపురం జిల్లా, వెలిగొండ పూర్తి చేయడమే తన లక్ష్యమన్నారు. సమావేశంలో ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ రసూల్, రాష్ట్ర కార్యదర్శి ఇబ్రహీం ఖాన్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి దూదేకుల మస్తాన్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహబూబ్ బాషా, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఎస్ఎం బాషా, జనసేన జిల్లా కార్యదర్శి సయ్యద్ సాదిక్, నియోజకవర్గంలోని మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముస్తాక్

భారీగా తరలిన ముస్లింలు

పొదిలి : మార్కాపురం నియోజకవర్గంలో బుధవారం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ముస్లిం మైనార్టీ విస్తృత స్థాయి సమావేశానికి పొదిలి నుంచి పెద్దఎత్తున టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు తరలివెళ్లారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఇమాంమ్‌సా, ఎస్సీసెల్ నాయకులు జ్యోతిమల్లికార్జున్ ఆధ్వర్యంలో మార్కాపురం వెళ్లారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న అశోక్‌రెడ్డి



బాబు ష్యూరిటీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న విఘ్నేష్‌రెడ్డి

అభివృద్ధికి పాతరేసిన జగన్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

బేస్తవారపేట, ఫిబ్రవరి 21 : జగన్‌రెడ్డి అభివృద్ధికి పాతరేసి, అరాచకాలు, దోపిడీ, దౌర్జన్యాలతో పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బేస్తవారపేట మండలంలోని పాపాయిపల్లె గ్రామంలో ఆయన పర్యటించారు. అశోక్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం జరిగిన గ్రామ సభలో మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే రాష్ట్రం బాగుతోపాటు అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉంటారన్నారు. అరాచకపాలనకు, అభివృద్ధి పాలనకు మధ్య జరిగే ఎన్నిలన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప ఈ ఐదేళ్లలో ఒక్కచోటా అభివృద్ధి పని జరగలేదన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి సంక్షేమమం కోసం పాటుపడతానని, వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వానికి మద్దతుగా నిలిచి టీడీపీని గెలిపించాలని అశోక్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సోరెడ్డి మోహన్‌రెడ్డి, పూనూరు భూపాల్‌రెడ్డి, మూప్పూరి రాము, కంచి సురేష్, దగ్గుబాటి పుల్లయ్య, వై.బాలకొండయ్య, కంచి రాజేష్, నాగిని నిరంజన్,పట్టణ అధ్యక్షులు దూదెకుల సైదులు, గుంటక నరసింహయాదవ్, పోలిశెట్టి సుబ్రహ్మణ్యం, బీ రోషన్‌బాబు, విశ్వనాథం, దూదెకుల మాబు, బీసు అరుణ్‌కుమార్, దూదెకుల ఆదాం, సత్యేలి కృష్ణ, నల్లగాల్వ శేషయ్య, షేక్ రషీద్, షేక్ ఖాదర్‌బాషా, సున్నపు అనిత, సందు రమేష్, ఆవుల మంద వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ నాయకులు నరసింహారావు, బాలరంగయ్య మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈ సం దర్భంగా వైసీపీ వార్డు మెంబర్ ఎర్రంశెట్టి అ రుణ ఆధ్వర్యంలో సుమారు 100 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి అశో క్‌రెడ్డి కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బడేఖాన్ పేటలో భవిష్యత్‌కు గ్యారెంటీ

మార్కాపురం రూరల్ : మండలంలోని బడేఖాన్ పేట గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కుమారుడు విఘ్నేష్‌రెడ్డి నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఇంటింటికీ తిరిగి చంద్రబాబు రూపొందించిన సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని కోరారు. యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్ర భవిష్యత్ బాగుండాలన్నా టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. సీసీరోడ్లు లేదని, తాగునీటికి కటకటలాడుతున్నామని స్థానికులు విఘ్నేష్ దృష్టికి తీసుకురాగా కనీసం సీసీ రోడ్డు కూడా వేయలేని చేతగాని వైసీపీ పాలకులను ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని విఘ్నేష్‌రెడ్డి హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తన తండ్రి కందుల నారాయణరెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని విఘ్నేష్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జవ్వాజి రామానుజులరెడ్డి, గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలకు శాంతి స్వరూప్ భట్నాగర్ దిక్సూచి

పామూరు, ఫిబ్రవరి 21 : చమురు అన్వేషణలో ఇబ్బందులు పడుతున్న వేళ వారికి జిగురు కలిపిన ఓ ఫార్ములాను అందజేసి కంపెనీలను ఎన్నో లక్షల కోట్ల నష్టాల నుంచి బయట పడవేసి భావితరాలకు దిక్సూచీగా శాంతిస్వరూప్ భట్నాగర్ నిలిచారని హెచ్ఎం మహబూబ్‌బాష కొనియాడారు. మండలంలోని నర్రమారెళ్ల గ్రామ ప్రభుత్వ పాథమికోన్నత పాఠశాలలో శాంతిస్వరూప్‌భట్నాగర్ జయంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట రమేష్, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, సుజాత, ఎస్వీ ప్రసాద్ పాల్గొన్నారు.

వరద వస్తే నీళ్లివ్వచ్చు!

- రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్
- వెలిగొండ సొరంగాల పరిశీలన

పెద్ద దోర్నాల, ఫిబ్రవరి 21 : వర్షాలు బాగా కురిసి కృష్ణానదికి వరద వస్తే నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు నీళ్లివ్వచ్చని జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలంలోని కొత్తూరు వద్ద నిర్మిస్తున్న పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులోని కీలక భాగాలైన రెండవ సొరంగం పనులను ఆయన జిల్లా ఇరిగేషన్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు పనుల పురోగతిని వివరించారు. అనంతరం కారుల్లో రెండో సొరంగం అంతర్భాగం గుండా హెడ్ రెగ్యులేటర్ వరకు వెళ్లి పరిశీలించి వచ్చారు. ఈ సందర్భంగా శశిభూషణ్ విలేకరులతో మాట్లాడుతూ నిర్మాణం పనులు దాదాపు పూర్తయ్యాయని, దేవుడి దయవల్ల వర్షాలు బాగా కురిస్తే వచ్చే మిగులు జలాలను నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు తరలించవచ్చన్నారు. నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ, పరిహారం పరిస్థితిపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ పరిహారం ఇవ్వకుండా ఎక్కడైనా ప్రారంభించారా? అని అన్నారు. సొరంగం లోపలి భాగాన ఉన్న లైనింగ్ పనులు, టీబీఎం తొలగింపు తదితర పెండింగ్ పనులపై మాట్లాడుతూ నీళ్లివ్వడానికి అవేమీ ఇబ్బంది కాదని, ఇంజనీరింగ్ శాఖాధికారులు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించేందుకు త్వరలో టన్నెళ్ల వద్దకు రానున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు హెలిప్యాడ్‌ను ఆధునికీకరించారు. అక్కడే పైలాన్‌ను కూడా నిర్మించారు. ఈక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సందర్శనతో సీఎం పర్యటన తేదీని ప్రకటించే అవకాశం ఉన్నట్లు ఆ శాఖాధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఈఎన్‌సీ నారాయణరెడ్డి, సీఈ మురళీధర్, ఎస్ఈ అబూతాలిమ్, ఈఈ పురవర్ధన్‌రెడ్డి, మెఘా ప్రతినిధి రాంబాబు పాల్గొన్నారు.



టన్నెల్‌ను పరిశీలిస్తున్న శశిభూషణ్

పలుచబడిన అభిమానం

వైసీపీ శ్రేణుల్లో కానరాని ఉత్సాహం

పేలవంగా దద్దాల పరిచయ కార్యక్రమం

కార్యక్రమానికి డుమ్మా కొట్టిన ఎమ్మెల్యే బుర్రా, మాజీ ఎమ్మెల్యే కదిరి

కనిగిరి, ఫిబ్రవరి 21 : అట్టహాసంగా సాగుతుందనుకున్న వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ పరిచయ కార్యక్రమం కనిగిరిలో పేలవంగా జరిగిందని ఆ పార్టీ శ్రేణులే గుసగుసలాడుకుంటున్నాయి. ఇన్‌చార్జిగా అధిష్ఠానం ప్రకటించిన నాటినుంచి పదిరోజుల క్రితం ఒకసారి, బాలినేని, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రాక సందర్భంగా మరోసారి దద్దాల నారాయణ స్వాగత ర్యాలీలు నిర్వహించారు. తొలి ర్యాలీలో వైసీపీ ఇన్‌చార్జిగా నియమితులయ్యాక తొలిసారి వస్తున్న దద్దాలకు స్వాగతం కోసం జరగగా, బుధవారం రెండోసారి పరిచయ వేదిక అంటూ బాలినేని, చెవిరెడ్డిలకు స్వాగత ర్యాలీ నిర్వహించారు. తొలిసారి నిర్వహించిన ర్యాలీ కంటే బుధవారం నిర్వహించిన ర్యాలీలో జనాలు మరింత పలుచగా


ర్యాలీ ముందుభాగాన పలుచగా జనం


మాట్లాడుతున్న బాలినేని, పక్కన దద్దాల

కనిపించారు. నియోజకవర్గంలోని ప్రధాన సామాజికవర్గానికి చెందిన నేతల కనుసన్నల్లోనే దద్దాల ఆద్యంతం నడవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతి కార్యక్రమంలోనూ నగదు పంపకంతోనే జనసమీకరణ చేశారు. నగదు కోసం వచ్చిన జనం చాలామంది భోజనాలు చేసి ఫంక్షన్ హాలులోకి రాకుండానే తిరుగుముఖం పట్టారు. దీంతో హాలులో కేవలం వెయ్యి మందికి మించి లేకపోవటం శ్రేణుల్లో నిరుత్సాహాన్ని నింపింది.

కార్యకర్తలను, నేతలను విస్మరిస్తే మనుగడ కష్టం

ఈ కార్యక్రమంలో ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రసంగంలో ఎమ్మెల్యే బుర్రాపై పరోక్ష విమర్శలు చేశారు. అధికారంలోకి రాకముందు ముఖ్యనేతలు, కార్యకర్తలను భుజానకెత్తుకుని అధికారాన్ని చేపట్టాక వారిని విస్మరిస్తే రాజకీయంగా మనుగడ కష్టమని హెచ్చరించారు. కులం ఓట్లతోనే రాజకీయం చేయాలనుకుంటే ఒకసారికే పదవి ఉంటుదన్న విషయం రుజువైందని ఎమ్మెల్యే బుర్రాకు పరోక్షంగా చురకలు అంటించారు. ఈ కారక్రమానికి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావులు డుమ్మాకొట్టారు. ఈ సభకు రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, ఐదు మండలాల జడ్పీటీసీ సభ్యులు, నలుగురు ఎంపీపీలు, కౌన్సిలర్లు హాజరు కాగా, సీఎస్‌పురం ఎంపీపీ మూడమంచు, కనిగిరి ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, పామూరు ఎంపీపీ గంగసాని లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు చప్పిడి వెంగయ్యలు మాత్రం హాజరుకాలేదు.


పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉగ్ర

సమన్వయంతో పనిచేస్తే విజయం మనదే

నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఉగ్ర

వైసీపీని వీడి టీడీపీలో చెరిన 45 కుటుంబాలు

వెలిగండ్ల, ఫిబ్రవరి 21 : టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తే సునాయాసంగా విజయం సాధించవచ్చని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి చెప్పారు. మండలంలోని గన్నవరం పంచాయతీ గండ్లోపల్లి గ్రామంలో బుధవారం వైసీపీని వీడి 35 కుటుంబాలు, రాళ్లపల్లి హరిజన కాలనీలో 10 కుటుంబాలు ఉగ్ర అధ్వర్యంలో టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ వైసీపీ మునిగిపోయే పడవ అని ప్రజలు తెలుసుకోవాలన్నారు. జనసేన, టీడీపీ కలయికతో రాష్ట్రంలో టీడీపీ పార్టీ విజయం తథ్యం అని చెప్పారు. వైసీపీ దోపిడీతో రాష్ట్రం దివాళా తీసిందని, అవినీతి, అక్రమాలు పెచ్చుమీరాయన్నారు. దానికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వైసీపీ హయాంలో బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనారిటీ వర్గాలపై అక్రమంగా కేసులు, దాడులు జరిగాయని తెలియజేశారు. తాము అధికారంలోకి వచ్చాకా గన్నవరం పంచాయతీ ప్రజల ప్రధాన సమస్య బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ముత్తిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, గోనా ప్రతాప్, గవదకట్ల హరి, రావి శ్రీనివాసుల చౌదరి, కొండు భాస్కర్‌రెడ్డి, రావి గురుస్వామి, మెటాటి సుబ్బారెడ్డి, మౌలాలీ, చిలకల వెంకటేశ్వర రెడ్డి, సలోమన్‌రాజు, చందా కాశిరెడ్డి, పాప కోటిరెడ్డి, తిరుపతయ్య, కారంపూడి వెంటేశ్వర్లు, రావి గురుస్వామి పాల్గొన్నారు.

మీడియాపై దాడి అమానుషం


వెలిగండ్లలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉగ్ర, నేతలు


దర్శిలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు


దొనకొండలో ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విలేకరులు

దర్శి, ఫిబ్రవరి 21 : వైసీపీ నాయకులు మీడియాపై దాడి చేయటం హేయమైన చర్య అని టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు చిట్టే వెంకటేశ్వర్లు, నగర పంచాయతీ వైస్ చైర్మన్ స్టీవెన్, దర్శి పట్టణ టీడీపీ అధ్యక్షుడు యాదగిరి వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ స్థానిక కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జగన్ పాలనపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తుండటంతో ఓటమి భయంతో వైసీపీ పాలకులు పత్రికలపై, ప్రతిపక్ష నాయకులపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగ బద్ధంగా వ్యవహరించాల్సిన సీఎం జగన్ చొక్కా మడతపెట్టి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయటం ఆయన ఫ్యాక్షనిస్టు విధానాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, దర్శి పట్టణ క్లష్టర్ ఇన్‌చార్జి నారపుశెట్టి మధు, తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ బత్తుల శ్రీరామ్, టీడీపీ నాయకులు పారా గాలయ్య, జూపల్లి కోటేశ్వరరావు, కనకం సైదారావు, బాచిన శ్రీనివాసరావు, పోకూరి నారాయణస్వామి పాల్గొన్నారు.


తాళ్లూరులో వినతిపత్రం ఇస్తున్న విలేకరులు

తాళ్లూరులో...

తాళ్లూరు, ఫిబ్రవరి 21: మీడియాపై దాడులు ప్రవాదకరమని, మీడియాపై దాడులు చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ తాళ్లూరు మండల పాత్రికేయులు డిప్యూటీ తహసీల్దార్ జె.ఇమ్మానియేల్‌రాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు ఎస్.నరేంద్రనాథ్, ఎం.నరసింహారావు, షేక్ బడేషా, వి.శ్రీరామూర్తి, కె.రాంబాబు, పి.రవికుమార్‌లు ఉన్నారు.

వెలిగండ్లలో...

వెలిగండ్ల, ఫిబ్రవరి 21 : సీఎం జగన్ పాలనలో పాత్రికేయులపై వైసీపీ మూకల వరుస దాడులను ఖండిస్తూ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టరు ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, నాయకులతో కలసి ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. వెలిగండ్లలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు పాల్గొన్నారు.

దొనకొండలో...

దొనకొండ, ఫిబ్రవరి 21 : ఆంధ్రజ్యోతి, ఈనాడు ఫొటోగ్రాఫర్లపై దాడిచేయటం, కర్నూలు ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకలు చేపట్టిన దాడులను నిరసిస్తూ దొనకొండలో రెవెన్యూ కార్యాయలం వద్ద విలేకర్లు నిరసన తెలిపారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. విలేకర్లు రవికాంత్, కె. వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, జి. చంద్రశేఖర్, ఎస్. సత్యనారాయణ, జి. కోటయ్య, టి. శ్యామ్, బుజ్జి, ఇస్సాకు, దేవిలాల్, అబ్రహం పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి టీడీపీ జిల్లా లీగల్‌సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ సంఘీభావం తెలిపారు.

మహిళలను మహరాణులు చేసింది టీడీపీ ప్రభుత్వమే

దొనకొండ, ఫిబ్రవరి 21 : గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలనే ధ్యేయంతో పొదుపు సంఘాలు ఏర్పాటు చేసి చేయూతనిచ్చి మహరాణులుగా చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనని టీడీపీ జిల్లా లీగల్ సెల్ మాజీ అధ్యక్షుడు పరిటాల సురేష్ చెప్పారు. మండలంలోని పెద్దన్నపాలెంలో టీడీపీ పరిటాల ప్రజాయాత్ర కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. బీసీ సెల్ నాయకుడు బత్తుల గాలయ్య రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు బాధ్యతగా పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో కటారు గోపాలకృష్ణ, దండూరి గురవయ్య, పెద్దకాశయ్య, గార్లపాటి గోపాల్, తిరుమలయ్య, సుబ్బారావు పాల్గొన్నారు.

294 గ్రామాలకు నిలిచిన సాగర్ నీటి సరఫరా

నీటి కోసం అవస్థలు పడుతున్న ప్రజలు


కనిగిరి దొరువు వద్ద ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద అడుగునీటిని పట్టుకుంటున్న ప్రజలు

కనిగిరి, ఫిబ్రవరి 21 : వేసవికాలం సమీపించిన తరుణంలో కనిగిరి ప్రాంతానికి రామతీర్థం నుంచి వచ్చే సాగర్ నీటి సరఫరా నిలిచిపోయింది. మంగళవారం రాత్రి రామతీర్థం వద్ద పంపింగ్ హౌస్‌కు వెళ్లే హెచ్‌టీ లైను వైరు తెగిపోవటంతో కనిగిరికి సరఫరా చేసే నీరు నిలిచిపోయింది. దీంతో కనిగిరి ప్రాంతంలోని 294 గ్రామాల ప్రజలకు నీటి ఇక్కట్లు ఏర్పడ్డాయి. ఈ విషయం తెలియడంతో ప్రజలు పట్టణంలోని దొరువు వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు అడుగున ఉన్న నీటిని పట్టుకునేందుకు పోటీ పడ్డారు. ప్రజలకు ఎంతో అవసరమైన నీటి సరఫరా విషయంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంతో పాటు, ముందస్తు పరిశీలనలు లేకపోవటంతో ఈ సమస్య ఎదురైంది. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు త్వరితిగతిన నీటి సరఫరా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

మహ్మద్ ప్రవక్త బాటలో పయనించాలి

పామూరు, ఫిబ్రవరి 21 : ముస్లింలందరూ మహ్మద్ ప్రవక్త చూపిన బాటలో పయనించాలని జనాబ్ అబ్దుల్‌వహాబ్ సూచించారు. విరువూరురోడ్ బుజ్జిబాయ్ రంపకోతమిల్లు సమీపంలో నూతనంగా నిర్మించిన మజీదే ఆయేషా మసీదును బుధవారం ప్రారంభించారు.అనంతరం ప్రార్థనలు చేశారు.

మైనర్ జంటను కాపాడిన రైల్వే పోలీసులు

ఒంగోలు(క్రైం), ఫిబ్రవరి21: ప్రేమపేరుతో పదో తరగతి చదువుతున్న బాలుడు, బాలిక చనిపోయేందుకు తిరుపతికి వెళుతుండగా ఒంగోలు రైల్వేపోలీసులు గుర్తించి కాపాడారు. రైల్వే సీఐ శ్రీకాంత్‌బాబు వివరాల మే రకు.. తూర్పుగోదావరి జిల్లా ఉండరాజువరం గ్రామానికి చెందిన మైనర్ జంట రాజమండ్రి నుంచి ఒంగోలుకు బస్సులో వచ్చారు. డబ్బులు అయిపోవడంతో తిరుపతి వెళ్ళి ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకొని రైలులో వెళ్ళేందుకు రైల్వేస్టేషన్‌కు వచ్చారు.ఈ జంట అనుమానాస్పదంగా ఉండటంతో రైల్వే పోలీసులు విచారించారు. ఉండరాజువరం పోలీస్‌స్టేషన్‌లో అదృశ్యం కేసు నమోదైనట్లు తెలియయడంతో ఈ జంటను అదుపులోకి తీసుకుని వారి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు వారిని పిలిపించి ఇరువురిని అప్పగించినట్లు సీఐ తెలిపారు.

తెలుగు భాషను దశదిశలా వ్యాప్తి చేయాలి

పామూరు, ఫిబ్రవరి 21 : తెలుగు భాష సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచం నలుమూలాలా చాటిన భాషాభిమానులకు మనందరం రుణపడిఉండాలని జేవీవీ జాతీయ కార్య దర్శి షేక్ గయాజ్ తెలిపారు. స్థానిక కేజీబీవీలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కటకం సజన పాల్గొన్నారు.

సచివాలయాల్లో సమయపాలన కరువు

సచివాలయాల్లో సమయపాలన కరువు

వెలిగండ్ల, ఫిబ్రవరి 21 : ప్రజల వద్దకు పాలన కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ఆచరణలో అభాసుపాలవుతోంది. నిబంధనల మేరకు సచివాలయ సిబ్బంది ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలి. కానీ మండలంలోని పలు సచివాలయాల్లో సిబ్బంది కార్యాలయానికి ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. రామగోపాలపురం, గన్నవరం సచివాలయాల్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఆంధ్రజ్యోతి విజిట్ చేయగా ఇద్దరు మాత్రమే విధులకు హాజరయ్యారు. మిగతావారు ఎక్కడికి వెళ్లారని అడిగితే ఫీల్డ్ విజిట్ అని ఒకసారి, ఉన్నతాధికారి రమ్మంటే వెళ్లారని మరోసారి వంటి పొంతన లేని సమాధానాలు చెప్పారు. ఫీల్డ్ విజిట్‌కు వెళ్లే సిబ్బంది సంబంధిత రిజిష్టర్‌లో రాసిన దాఖాలాలు లేవు. 12 సచివాలయాలుంటే అన్ని సచివాలయాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.


రామగోపాలపురం సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

వైసీపీ పాలనలో రాజధాని లేని రాష్ట్రం


ప్రేక్షకులకు ఉచితంగా టిక్కెట్లు అందజేస్తున్న పువ్వాడి

పామూరు, ఫిబ్రవరి 21 : రాష్ట్ర రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయాల్సిన వైసీపీ పాలకులు మూడు రాజధానులు అంటు రాజధాని లేని రాష్ట్రంగా తయారు చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆరోపించారు. రాజధాని అమరావతిని వైసీపీ పాలకులు ఎలా అథోగతి పాల్జేశారో తెలుసుకునేందుకు తీసిన సినిమాయే రాజధాని ఫైల్స్ అని వారు చెప్పారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉగ్ర ఆదేశాల మేరకు మండలంలోని ప్రజలందరూ సినిమాను తిలకించేందుకు శేషమహాల్‌లో బుధవారం 4 షోల టికెట్లను ప్రజలకు పంపిణీ చేసినట్లు పువ్వాడి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం రమణయ్య, షేక్ ఖాజారహంతుల్లా, ఎస్ సాంబయ్య, దేవరపు మాల్యాద్రి, యాదాల మాలకొండయ్య, పువ్వాడి చినలక్ష్మయ్య, పూనాటి వెంకటేశ్వర్లు, పగడాల మాల్యాద్రిలు పాల్గొన్నారు.

అద్దె బకాయి చెల్లించకపోవడంతో సచివాలయానికి తాళం

తాళ్లూరు మండలం తురకపాలెంలో ఘటన

ఇంకా రూ.47 వేలు పెండింగ్

తాళ్లూరు, ఫిబ్రవరి 21 : గ్రామ సచివాలయం నిర్వహిస్తున్న భవనానికి 18 నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో ఇంటి యజమాని బుధవారం తాళం వేసి సిబ్బందిని బయటకు పంపారు. ఈ ఘటన ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలంలోని తురకపాలెంలో చోటుచేసుకుంది. గ్రామసచివాలయాన్ని 2020 జనవరి నుంచి అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. గ్రామానికి సొంతంగా పంచాయతీ కార్యాలయం ఉన్నా బాగా లేదంటూ అధికార పార్టీ నేతలు తమ అనుచరునికి లబ్ధి చేకూర్చేందుకు వ్యూహం పన్నారు. మారుమూల గ్రామంలో సైతం నెలకు రూ.4వేల చొప్పున అద్దె చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. అప్పటి నుంచి పంచాయతీ ఎన్నికలు జరిగే వరకు ప్రత్యేకాధికారి పాలన కొనసాగినా అద్దె చెల్లించలేదు. పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్ష టీడీపీ మద్దతుదారుడు సర్పంచ్‌గా ఎన్నికైన తరువాత అద్దె బకాయిలు తెరపైకి వచ్చాయి. అద్దె బకాయి చెల్లించాలని పదేపదే ఒత్తిడి చేయటం, ఇంటి యజమాని సచివాలయానికి తాళం వేస్తుండటం కొనసాగుతూనే ఉంది.


తురకపాలెం గ్రామసచివాలయానికి వేసిన తాళం

రూ.72వేలు బకాయి

ప్రస్తుతం సచివాలయానికి 18నెలలకు గాను రూ.72వేల అద్దె బకాయి ఉంది. ఇటీవల గ్రామ సర్పంచ్ రూ.25వేలు తన సొంత డబ్బు చెల్లించారు. ప్రభుత్వం పంచాయతీ నిధులను తరచూ దారిమళ్లిస్తుండడంతో నిధుల కొరత వేధిస్తోంది. దీంతో అద్దెలు చెల్లించలేని దుస్థితి నెలకొంది. గ్రామపంచాయతీలో నిధులు లేకపోవటంతో అద్దె చెల్లింపు కష్టంగా ఉందని, నూతన సచివాలయం భవన నిర్మాణం జరిగే వరకు పంచాయతీ సొంత భవనంలో సచివాలయం నడపాలని అధికారులకు, కలెక్టర్‌కు సర్పంచ్ విన్నవించినా పట్టించుకున్న నాథుడే లేరు. త్వరలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వస్తే అద్దె చెల్లింపు కష్టం అవుతుందని పలువురు చెప్పటంతో ఇంటి యజమాని చింపిరయ్య గత రెండు వారాల్లో నాలుగుసార్లు సచివాలయానికి తాళం వేశారు. సర్పంచ్ మాట్లాడి తాళం తీయించటం జరుగుతూనే ఉంది. సర్పంచ్ ఈ విషయాన్ని ఎంపీడీవో యుగకీర్తి దృష్టికి తీసుకెళ్లారు. ఆమె ఇంటి యజమానిని పిలిచి మాట్లాడినా మంగళ, బుధవారాలు సచివాలయానికి మళ్లీ తాళం వేసి సిబ్బంది విధులను అడ్డుకోవడం గమనార్హం.

ప్రతిపక్ష సర్పంచ్‌నైనందునే సచివాలయానికి తాళం

-చంద్రగిరి గుర్వారెడ్డి, సర్పంచ్ తురకపాలెం



పంచాయతీలో నిధుల కొరత వేధిస్తోంది. ఉన్న నిధులను ప్రభుత్వం వాడేసుకుంది. గ్రామంలో వీధిలైట్లు, సైడు కాలువల పనులు చేసేందుకూ డబ్బులు లేవు. సొంత భవనాన్ని వదిలేసి అధికారపార్టీ వారికి లబ్ధి జరిగేలా అద్దె భవనంలో సచివాలయాన్ని నడిపిస్తున్నారు. ప్రతిపక్ష సర్పంచ్‌నైనందున అధికారపార్టీ నేతలు చెప్పినట్లు ఇంటి యజమాని సచివాలయానికి తాళం వేసి ఇబ్బందులు పెడుతున్నాడు.

అక్రమ మద్యం ధ్వంసం


పట్టుబడిన మద్యంను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

దర్శి, ఫిబ్రవరి 21 : అక్రమమద్యం వ్యాపారాల్లో పలు ప్రాంతాల్లో పట్టుపడిన మద్యాన్ని ఎస్ఈబీ అధికారులు బుధవారం ధ్వంసం చేశారు. ఎస్ఈబీ సూపరింటెండెంట్ రవికుమార్ ఆధ్వర్యంలో స్థానిక సెబ్ కార్యాలయం పరిధిలో గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు పట్టుబడిన 1012 మద్యం బాటిల్స్‌ను ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సుందరరామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యం వ్యాపారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెబ్ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహాల గ్రామోత్సవం


హోమాల్లో కూర్చొన్న భక్తులు

పామూరు, ఫిబ్రవరి 21 : స్థానిక తూర్పు వీధిలోని శ్రీ సీతారామలక్ష్మణ సమేత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు జరుగుతున్న ప్రత్యేక హోమాల్లో భక్తులు పాల్గొన్నారు. పురోహితులు రావూరి సత్యనారాయణశాస్త్రి, మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన సామవేద పండితులు పప్పు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో గురువారం స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠతో పాటు, శాంతికల్యాణం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.



గుంటూరు హిందూ కాలేజ్ సెంటర్లో మానవహారం

ఎస్పీ తుషార్ డూడీకి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

కలంపై దాడి.. సిగ్గు..సిగ్గు..

- గుంటూరులో వెల్లువెత్తిన నిరసనలు
- మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం
- హిందూ కళాశాల కూడలిలో మానవహారం
- ఎస్పీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ, నినాదాలు
- విలేకర్లకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలని డిమాండ్
- రాప్తాడు, కర్నూలు ఘటనలపై అఖిలపక్ష, జర్నలిస్టు సంఘాల ధ్వజం



గుంటూరు: హిమని సెంటర్లలో గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టు సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు



ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యేలు నరేంద్ర, మస్తాన్‌వలి, కనపర్తి, ప్రభాకర్, శేషయ్య, మన్నవ తదితరులు



హిందూ కాలేజి సెంటర్‌లో రోడ్డుపై కూర్చుని నిరసన

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'కలంపై దాడులా సిగ్గుసిగ్గు.. జర్నలిస్టులపై దాడులు హేయం..' అంటూ ప్రభుత్వ తీరుపై గుంటూరు జిల్లా జర్నలిస్టులు, అఖిలపక్ష నేతలు, ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ బుధవారం పాత్రికేయ సంఘాలు తలపెట్టిన నిరసన కార్యక్రమంతో గుంటూరు నగరం దద్దరిల్లిపోయింది. వందల మంది విలేకరులు, అఖిలపక్ష నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కదంతొక్కారు. దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. రాప్తాడు 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపైన, కర్నూలు జిల్లాలో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకల దాడులకు నిరసనగా బుధవారం గుంటూరులో ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ పార్టీలు మద్దతు తెలియజేశాయి. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతోపాటు అన్ని పార్టీలు, అనుబంధ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత గుంటూరు కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెపారు. మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, దాడులను నిరసిస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడి నుంచి నినాదాలు చేస్తూ హిందూ కాలేజ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. వైసీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడిన ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ చేసి, ఎస్పీ తుషార్‌డూడీకి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల ప్రాణ రక్ష ణకు ప్రత్యేక చ ట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, కనపర్తి శ్రీనివాసరావు, సుఖవాసి శ్రీనివాసరవు, రావిపాటి సాయికృష్ణ, వేములకొండ శ్రీనివాస్, ఫిరోజ్, కార్పొరేటర్లు ఈరంటి బాబు, కొమ్మినేని కోటేశ్వరరావు, మానం శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, సోమేపల్లి శివప్రసాద్, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, షేక్ ఉస్మాన్, షేక్ బాజీ, బ్రహ్మం, షేక్ సుభాని, గంటా పెద్దబ్బాయి, మౌలిక, వీ.గంగాదర్, జర్నలిస్టు సంఘాల నేతలు భక్తవత్సలరావు, ఐజేయూ గిరధర్‌కుమార్, ఫణీంద్రకుమార్, నరసింహారావు, పరస్యం నాయక్, ఆసిఫ్, నిమ్మరాజు చలపతిరావు, ఎస్ రవికుమార్, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ సూదా రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు, బ్యూరో ఇన్‌చార్జి గింజుపల్లి భాస్కరరావు, స్టాఫ్ రిపోర్టర్లు మధుసూదనరావు, సతీష్, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టరు సాంబశివరావు, ఆంధ్రజ్యోతి యాడ్స్ మేనేజర్ ఎం.సుబ్బారావు, సర్క్యులేషన్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, సబ్ ఎడిటర్లు జీ.వెంకటేశ్వరరావు, సురేంద్ర, పరమేశ్వరరావు, వీరేష్‌కుమార్, బీ శ్రీనివాసరావు, జ్యోతి, లక్ష్మణ్, రిపోర్టర్లు, వివిధ విభాగాల సిబ్బంది పెద్దసంఖ్య లో పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాల్లోనూ..

మీడియాపై రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న దాడులపై ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రజాసంఘాలు, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. మున్సిపల్ కార్యాలయం సమీపంలో జర్నలిస్టులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. పత్రికా స్వేచ్ఛపై దాడి నశించాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. పిడుగురాళ్ల, మాచవరం, రాజుపాలెంలో కూడా నిరసన ర్యాలీలు జరిగాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు, తుళ్లూరుల్లో అంబేద్కర్ బొమ్మల వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. బాపట్ల జిల్లా భట్టిప్రోలు రథం సెంటర్‌లో జర్నలిస్టులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి ఆనందబాబు పాల్గొన్నారు.



రాజుపాలెం సెంటర్లో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు



భట్టిప్రోలు రథం సెంటర్‌లో జరిగిన జర్నలిస్టుల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు



కలెక్టర్ శివశంకర్ లోతేటికి వినతి పత్రం అందజేస్తున్న వివిధ పార్టీల నాయకులు



ప్రత్యేక చట్టం తీసుకురావాలి

విధి నిర్వహణలో భాగంగా సభలు, సమావేశాలను కవర్ చేసే విలేకరులపై దాడులు చేయడం అన్యాయం. దాడులకు బలైపోతున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. పార్టీలు, సంస్థలు ఏవైనా విబేధాలు ఉంటే వాటికి జర్నలిస్టులను బలి చేయవద్దు. ప్రాణాంత కంగా మారిన నేపథ్యంలో జర్నలిస్టులకు రక్షణ చట్టం తేవాలి.దాడులకు తెగించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- ఎస్ఎన్ మీరా, ఏపీయూడబ్ల్యూజే

ప్రజలే బుద్ధి చెప్పాలి

విలేకరులపై దాడులు, దౌర్జన్యాలు దుర్మార్గం. అభ్యంతరం తెలపడానికి దాడులే మార్గమైతే, బూతులు తిట్టే మంత్రులను ఎన్నిసార్లు కొట్టాలి? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవారు రేపు ప్రజాకోర్టులో నుంచోవాలి. వారికి తగిన బుద్ధి ప్రజలే చెబుతారు. సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలి.

- నిమ్మల శేషయ్య

దాడి అమానుషం

పత్రికా విలేకరులపై దాడి అమానుషం. పత్రికా స్వేచ్ఛను హరించే స్థాయికి ప్రభుత్వం దిగజారడం సిగ్గుచేటు. నిజాన్ని నిర్భయంగా చూపించే మీడియాపై దాడి సీఎం అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే. ఎన్నికల నేపథ్యంలో పథకం ప్రకారం దాడులు చేయిస్తున్నారు. విలేకరులకు క్షమాపణ చెప్పి, బాధితుడికి న్యాయం చేయాలి.

- దేగల ప్రభాకర్

దాడులకు జగన్ ప్రోత్సాహం

రాష్ట్రంలో ప్రజలను, ప్రజాస్వామ్యాని తుంగలో తొక్కేందుకు సీఎం జగనే దాడులను ప్రోత్సహిస్తున్నారు. చేతులు మడతపెట్టాలని హింట్లు ఇచ్చి రెచ్చగొడుతున్నారు. వారి అవినీతి బాగోతాలు వెలికితీస్తున్న ఆంధ్రజ్యోతి,ఈనాడు సంస్థలపైనే దాడి చేయాలని సూచించినట్లు కనిపిస్తోంది. కొద్దిరోజుల్లో అధికారం మారుతుంది. దానికి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించి, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు మీడియా సహా అందరూ ఏకమవ్వాలి.

- నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

వినాశకాలే విపరీతబుద్ధి

పోయేకాలం దాపురిస్తే ఇలానే చేస్తారు. వినాశకాలే విపరీతబుద్ధి. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని నాలుగేళ్ల క్రితమే చెప్పా. ఇక ఈ పాలనను తరిమికొట్టేందుకు సమయం వచ్చింది. అందరూ ఒక్కటై జగన్‌ను తరిమికొట్టాలి. - కన్నా లక్ష్మీ నారాయణ, మాజీ మంత్రి

ప్రజాస్వామ్యం పరిహాసం

నాలుగో స్తంభమైన మీడియాపై దాడులు చేయిస్తున్న జగన్ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారు. పాలనా వైఫల్యాలు, అవినీతి, అక్రమాలను వెలికితీస్తున్నా యన్న కోపంతోనే ఆంధ్రజ్యోతి, ఈనాడు లపై దాడులకు తెగిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి. - నరేంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే

రాష్ట్రంలో పాశవిక పాలన

పత్రికా స్వేచ్ఛపై దాడి చేసే పాశవిక పాలన ఈ రాష్ట్రంలో అమలు జరుగుతోంది. మీడియా గొంతు నొక్కేస్తున్నారు. తన అవినీతి, అక్రమాలు కప్పి పుచ్చుకునేందుకే మీడియాపై దాడి చేస్తున్నారు. పాత్రికేయులపై దాడులు చేయడం మానుకోకపోతే ప్రత్యక్ష తిరుగుబాటు తప్పదు. దాడులు, దౌర్జనాలకు తెగిస్తున్న పాలకులను ఓడించాలి. - ముప్పాళ్ల నాగేశ్వరరావు , సీపీఐ

సీఎం క్షమాపణ చెప్పాలి

ప్రజలు, ప్రజాస్వామ్యంపై రాక్షసులు దాడులు చేస్తారనడానికి నిదర్శనమే రాప్తా డు, కర్నూలు ఘటనలు. ఈ ఘటనలపై సీఎం జగన్ మీడియాకు బహిరంగ క్షమా పణ చెప్పాలి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మీడియాపై దాడులు పరిపాటిగా మారాయి. నియంతృత్వ పాలనకు ప్రజలే చరమగీతం పాడతారు. బాధితుడికి సొంత ఖర్చుతో వైద్యం అందించాలి. - మస్తాన్‌వలి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్

ప్రజాస్వామ్యంపై దాడి

విలేకర్లపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి. ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించే మీడియా మిత్రులను భయభ్రాంతులకు గురిచేయాలని సైకో ముఖ్యమంత్రి వారిపై దాడులకు పాల్పడేలా చేస్తున్నారు. దాడులు చేసిన మూకలను వెంటనే అరెస్టు చేయాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. ప్రజలు ఇలాంటి సీఎంకి తగిన బుద్ధి చెప్పాలి.

- మొహమ్మద్ నసీర్ , టీడీపీ తూర్పు ఇన్‌చార్జి

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి

రిపోర్టర్లపై దాడి హీనమైన చర్య. అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తున్నందునే అధికారపార్టీ మూకలను సీఎం దాడులకు పురిగొల్పుతున్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి.

- మన్నవ మోహనకృష్ణ

పోలింగ్ కేంద్రాలపై కసరత్తు

- రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్

బాపట్ల, ఫిబ్రవరి 21: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల సౌలభ్యం కొరకు పోలింగ్ కేంద్రాల మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల నాయకులతో బుధవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశమయ్యారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల పేర్లు, చిరునామాల మార్పులు, చేర్పులపై నమోదయ్యే దరఖాస్తులను తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. మృతుల ఓటర్లను జాబితా నుంచి తొలిగించడానికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. రాజకీయపార్టీలు తమ అభ్యంతరాలపై లిఖితపూర్వక ఫిర్యాదులు చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో సవరణలపై వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుంటున్నామన్నారు. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 2,28,622 దరఖాస్తులు రాగా 1,84,667 పరిష్కరించామన్నారు. 34,344 తిరస్కరించగా 9,611 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. సమావేశంలో ఏవో కృష్ణకాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సీతారామయ్య, బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీ, ఆమ్‌ఆద్మీ, సీపీఎం, వైసీపీ, టీడీపీ నాయకులు రామకృష్ణ, దోనేపూడి రవి, కాగిత కోటేశ్వరరావు, బాలాజీరెడ్డి, కోటేశ్వరరావు, ఇనగలూరి మాల్యాద్రి, షేక్.మహ్మద్‌గౌస్‌బాషా పాల్గొన్నారు.



నాయకులతో సమావేశమైన కలెక్టర్ పి.రంజిత్‌బాషా

సరిహద్దులో.. ఇసుక తోడేళ్లు

- అడ్డూ, అదుపు లేకుండా కాసులవేట
- పొరుగు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యే, మంత్రి హస్తం
- వారికి కొమ్ము కాస్తున్న ఓ జిల్లా స్థాయి పోలీస్ అధికారి

చీరాల, ఫిబ్రవరి 21: సరిహద్దుల్లో ఇసుక తోడేళ్ల దందా... ఓ ఎమ్మెల్యే, ఓ మంత్రి హస్తం.. వారికి ఓ జిల్లా స్థాయి పోలీస్ అధికారి కొమ్ముకాస్తున్న వైనం. దీంతో అడ్డూ, అదుపు లేకుండా ఇసుకలో కాసులవేట యథేచ్ఛగా సాగుతోంది. చీరాల, బాపట్ల మండలాల సరిహద్దు కావూరివారిపాలెం సమీపంలో సహజ వనరుల దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. సెబ్, పోలీస్, రెవెన్యూ, మైనింగ్ ఏ శాఖ అధికారులు కూడా ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగుతున్నాయి. ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు సాగిస్తూ, టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా జరుగుతోంది. ప్రస్తుతం ఇసుక తవ్వకాలు సాగిస్తున్న భూములు ఒకప్పుడు పంట పొలాలు. ఆ ప్రాంతంలో ఇసుక తవ్వకాలతో భారీ గోతులు ఏర్పడ్డాయి. వాటిలో ఊటనీరు చేరి చెరువులను తలపిస్తుంది. దీంతో చుట్టుపక్కల పొలాలు కూడా బీడు భూములుగా మారుతున్నాయని రైతులు వాపోతున్నారు. అనుమతులు పేరుతో అక్రమ దందా సాగిస్తున్నారని స్థానికులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. గతంలో పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ప్రతినిధులు ఆ ప్రాంతంలో జరుగుతున్న ఇసుక తవ్వకాలను నిలుపుదల చేయాలని ఉద్యమించారు. వారి ఆందోళన నేపథ్యంలో కేవలం ఒకటి, రెండు రోజులు మాత్రమే తవ్వకాలు ఆపి మమ అనిపించారు. ఆ తర్వాత యథావిధిగా ఎక్స్ కవేటర్లతో ఇసుక తవ్వకాలు మొదలుపెట్టారు. ఈపురు పాలెం వై జంక్షన్‌కు సమీపంలో కూడా భారీగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. అక్కడ కూడా భారీగా గోతులు ఏర్పడి, ఊటనీటితో చెరువులను తలపిస్తున్నాయి. ఇదే పరిస్థితి బోయిన వారిపాలెంలో కూడా ఉంది. ఆయా ప్రాంతాల్లో ఇసుక గోతుల్లో గతంలో చిన్నారులు, మూగజీవాలు విగత జీవులైన సందర్భాలు ఉన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టి అక్రమార్కులకు కళ్లెం వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఫోన్ ద్వారా సెబ్ సీఐ కర్ణను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.



అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్



ఇసుక తవ్వకాలతో భారీగా ఏర్పడిన గోతులు



చీరాల మండల కావూరివారిపాలెం సమీపంలో ఇసుక తవ్వకాలకు వినియోగిస్తున్న ఎక్స్‌కవేటర్లు

25న ఎయిమ్స్ జాతికి అంకితం

- హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా అధికారులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 21: మంగళగిరిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమైన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)ను ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 25న వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేయనున్నారు. 183.11 ఎకరాల విస్తీర్ణంలో ఎయిమ్స్ నిర్మాణం జరిగింది. 960 పడకల ఆస్పత్రి, 125 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాల కోసం కేంద్రం రూ.1,618.23 కోట్లు ఖర్చు చేసింది. ఎయిమ్స్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ఇందుకోసం ఎయిమ్స్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టరు ఎం.వేణుగోపాల్‌రెడ్డి వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరు జే.నివాస్, ఎస్పీ తుషార్‌డూడీతో కలిసి బుధవారం పరిశీలించారు. గవర్నరు, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నివాస్

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే రవికుమార్



ఎమ్మెల్యే రవికుమార్‌కు మద్దతు తెలిపిన మీరావలి

మేదరమెట్ల , ఫిబ్రవరి 21: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలో కొరిశపాడుకు చెందిన మాజీ ఎంపీటీసీ కరోది మీరావలి, షేక్ హమీద్ బాషా, కొప్పర్తి సుబ్బయ్య, తేళ్ల సుబ్బారావు, షేక్ కాశీం, షేక్ ఉస్సేన్ తదితరులు రవికుమార్‌కు మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా రాజధాని అమరావతిని జగన్‌మోహన్‌రెడ్డి గాలికి వదిలేశారన్నారు. నాలుగు సంవత్సరాల 9 నెలల పాలనలో రాష్ట్రాన్ని నిలువున ముంచి వేశారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులను కూడా వేధింపులకు గురి చేసి వంచించారన్నారు. ఉద్యోగులకు సీపీఎస్ రద్దు చేస్తానని చెప్పి చివరకు సాధ్యం కాదని నాలుక మడతేశారని ఎద్దేవాచేశారు. తెలుగుదేశం ప్రభుత్వంలో ఇసుక ఉచితంగా అందిస్తే జగన్‌మోహన్‌రెడ్డి దానిని తప్పు బట్టి నూతన పాలసీ పేరుతో వేలకోట్లు కొట్టేశాడని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్ళాలని వి వరించారు. సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబు నాయుడుతోనే సాధ్యం అన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ప్రజా ప్రతినిధులను ఎన్నుకోకపోతే భవిషత్ అంధకారం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడెం భవాని ప్రసాద్‌రెడ్డి, సింబోతుల సత్యనారాయణ, పలువురు తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి



వలంటీర్లకు ప్రశంసాపత్రం అందజేస్తున్న వెంకటేష్

చీరాల, ఫిబ్రవరి 21: వలంటీర్లు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మన న్నలు పొందాలని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ ప్రాంగణంలోని ఓపెటీలో బుధవారం వలంటీర్ల పనితీరు నేపథ్యంలో వారికి సేవ మిత్ర, సేవ రత్న, సేవ వజ్ర అనే ప్రశంసాపత్రాలు, మెడల్స్‌ను వెంకటేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ముందుకు సాగాలని చెప్పారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి దిక్సూచిలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, గుంటూరు మాధవరావు, గవిని శ్రీనివాసరావు, మల్లి వైష్ణవి, మల్లెల లలిత రాజశేఖర్, పట్టెం డేవిడ్ మనోహర్, శిఖా సురేష్, చీమకుర్తి బాలకృష్ణ, సల్లూరి అనిల్, చిలుకోటి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు బత్తుల అనిల్, కంపా అరుణ్, కీర్తి వెంకట్రావు, మించాల సాంబశివరావు, సల్లూరి సత్యానందం, షేక్ మొహిద్దీన్, కట్టా గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పరిశీలన



మరుగు దొడ్డిని పరిశీలిస్తున్న యూనివర్సల్ కంపెనీ ప్రతినిధులు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 21: యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామంలో బుధవారం యూనివర్సల్ కంపెనీ ప్రతినిధులు ఎస్సీ కాలనీలో నిర్మించిన మరుగుదొడ్లను పరిశీలించారు. గతంలో ఈ గ్రామంలో అసిస్ట్ సంస్థ మరుగు దొడ్లు లేని ఇళ్లపై సర్వే చేసింది. గ్రామ ఉప సర్పంచ్ చెరుకూరి వేణు బాబు గ్రామంలో మరుగు దొడ్లు నిర్మించుకునే ఆర్థిక స్తోమత లేని కుటుంబాలకు సాయం అందించాలని అసిస్ట్ సంస్థను కోరారు. దాంతో వారు గ్రామంలో ప్రత్యేకంగా సర్వే చేయించారు. అనంతరం ఎస్సీ కాలనీలో 60 మందికి మరుగు దొడ్లు నిర్మించాలని ప్రతిపాదించారు. దాంతో యూనివర్సల్ కంపెనీ ప్రతినిధులు, జీపీఐ టుబాకో కంపెనీ ప్రతినిధులు సహకారం అందించగా, అసిస్ట్ సంస్థ నేతృత్వంలో 60 మరుగుదొడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. బుధవారం పూర్తి చేసిన వాటిని వారు పరి శీలించారు. అంతేగాకుండా గ్రామానికి చెందిన మంచినీటి చెరువులో పూడిక తీయడానికి సహకరించాలని ఉప సర్పంచ్ వేణు చేసిన అభ్యర్థన మేరకు వారు దాదాపు రూ. 12 లక్షల వ్యయంతో పూడిక తీయించారు. వాటన్నింటిని యూనివర్సల్ ప్రతినిధులు లిమా స్కాట్, లూయిస్ ఫ్లవర్‌లు, జీపీఐ పొగాకు కంపెనీ ప్రతినిధులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మాతృభాషపై మమకారం ఉండాలి

మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు

చీరాల,ఫిబ్రవరి 21 : మాతృభాషపై ప్రతి ఒక్కరికీ మమకారం ఉండాలని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని తెలుగుతల్లి విగ్రహానికి బుధవారం పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు భాషా ప్రియులు మాట్లాడుతూ మమ్మీ, డాడీ సంస్కృతి కన్నా అమ్మానాన్నల సంస్కృతి మిన్న అన్నారు. పరభాష వ్యామోహంలో మాతృభాషను మరవకూడదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారథి, తహసీల్దార్ నాసరయ్య, అన్నంరాజు సుబ్బారావు, సర్విశెట్టి సుబ్బరామయ్య, జి. హరిప్రసాద్, కొనికి చంద్రశేఖర్, కృష్ణమూర్తి, పలువురు కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


భావనారాయణునికి 108 ప్రసాదాలతో దివ్య నివేదన



స్వామికి నివేదించిన ప్రసాదాలు

చినగంజాం, ఫిబ్రవరి 21 : స్థానిక భూ సమేత భావ నారాయణస్వామి దేవస్థానంలోని స్వామి వారికి 108 ప్రసాదాలతో దివ్య నివేదన కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మోహనలక్ష్మీ నరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని విశేషంగా అలంకరించి పూజలు జరిపారు. రామాచారులు ఆధ్వర్యంలో దంపతులచే విష్ణు పరమాత్మిక హోమాన్ని నిర్వహించారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని మహిళా భక్తులు 108 ప్రసాదాలను స్వామి వారికి నివేదించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను వినియోగం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి శివనారాయణ, వెంకటరామానుజం, విశ్వనాథబాబు, ఆలయ సేవాదళ్ సభ్యులు గుద్దంటి పిచ్చయ్యల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

25న ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమావేశం



పోస్టరును ఆవిష్కరిస్తున్న ముస్లిం నాయకులు

ఇంకొల్లు,ఫిబ్రవరి 21: పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ కల్యాణమండపంలో ఈ నెల 25వ తేదీ ఆదివారం జరిగే ముస్లిం మైనార్టీల ఆత్మీయసమావేశానికి వేలాదిగా ముస్లింలు తరలిరావాలని టీడీపీ రాష్ట్రమైనార్టీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ అబ్దుల్ రజాక్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఇంకొల్లులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ ఆత్మీయ సమావేశానికి శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, టీడీపీ రాష్ట్రమైనార్టీసెల్ అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్, గుంటూరు ఈస్ట్ ఇన్‌చార్జి నజీర్‌అహ్మద్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు మృతి

అద్దంకి, ఫిబ్రవరి21: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నాగబోయిన కోటేశ్వరరావు(78) అనే వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మండలంలోని జార్లపాలెంకు చెందిన కోటేశ్వరరావు మంగళవారం సాయంత్రం గడ్డి మోపుతో అద్దంకి-రేణింగవరం రోడ్డు దాటుతుండగా స్కూటీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన కోటేశ్వరరావును ఒంగోలులోని ప్రయివేట్ వైద్యశాలకు తరలించగా అర్ధరాత్రి సమయంలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

24న ప్రతిభమూర్తులు-మధురస్మృతుల సభ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 21: ఆర్‌టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం, అద్దంకి డిపో ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ సాయంత్రం 6 గంటలకు చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో ప్రతిభమూర్తులు-మధురస్మృతుల సభ జరుగుతుందని నిర్వాహకులు పీసీహెచ్ కోటయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

నగరం.. నీరివ్వలేం!

ఒంగోలులో వేసవికి ముందే ఎక్కిళ్లు..!

అస్తవ్యస్తంగా తాగునీటి సరఫరా..!

గుండ్లకమ్మ నీరు ఆగాయి .. సాగర్ నీరే దిక్కు

అడుగుంటిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు

ప్రస్తుతం ఉన్నవి నెలరోజులకు సరిపడానే..

మూడు రోజులకు ఒకసారి కూడా

ఇవ్వలేక చేతులెత్తేస్తున్న అధికారులు

పాలకుల హామీలు సరే.. జనం దాహం తీరేదెలా?

నగరంలో తాగునీటి కోసం జనం అల్లాడుతున్నారు. ఒకరోజు మోటారు పాడైంది, ఇంకో రోజు పైపులైను పగిలిపోయింది, మరోసారి కరెంటు పోయింది... ఇదీ నీటి సరఫరాపై అధికారుల నుంచి వస్తున్న సమాధానం. నాలుగు మోటార్లకుగాను పనిచేస్తుంది ఒకటే. ఒకవైపు మండుతున్న ఎండలు మరోవైపు పెరుగుతున్న తాగునీటి అవసరాలతో నెల రోజులుగా సమస్య తీవ్రమైంది. ఏ డివిజన్‌లో చూసినా దాహం కేకలే. ఇదిలా ఉంచితే ఒంగోలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుంచి రిమ్స్‌కు సరఫరా అయ్యే నీరు నిలిచిపోవడంతో వారంరోజులుగా పేషెంట్లు ఇబ్బందిపడుతున్నారు. అలాగే రిమ్స్‌లోనే ఉంటున్న వైద్యులు, వైద్యాధికారులు, మెడికల్, నర్సింగ్ విద్యార్థులు పడుతున్న పాట్లు అంతాఇంతా కాదు. అటుచూస్తే ఎస్ఎస్ ట్యాంకులు అడుగంటగా, రామతీర్థంలోనూ నీరు లేకపోవడం ఆందోళనకరమైన విషయం. కాగా నగరంలో తాగునీటి సమస్యపై స్వయంగా అధికారపార్టీ కార్పొరేటర్లే ఈ నెల 16న జరిగిన కౌన్సిల్ సమావేశంలో గగ్గోలు పెట్టడం గమనార్హం.



అడుగంటిన 1వ ఎస్ఎస్ ట్యాంక్

ఒంగోలు(కార్పొరేషన్), ఫిబ్రవరి 21: ఒంగోలు నగరంలో వేసవికి ముందే వెక్కిళ్లు మొదలయ్యాయి. పాలకుల పదేపదే హామీలతో ఎప్పటికప్పుడు ఆశతో ఎదురుచూస్తున్న జనానికి గొంతు తడారిపోతుంది తప్ప సమస్య తీరడం లేదు. గత కొన్నేళ్లుగా నగర ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడికి శాశ్వత పరిష్కారం లభించడం లేదు. ముఖ్యంగా ఇప్పటికే వేసవిని తలపించేలా ఎండలు మొదలు కాగా, మరో నెలరోజుల్లో తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే వేసవి దృష్ట్యా మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం ముందుచూపు లేకపోవడంతో నీటి సరఫరా అస్తవ్యస్తంగా తయారైంది. దీనిపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ నిర్లక్ష్యం, వైసీపీ పాలకులు పట్టించుకోనితనంతో నగరంలో పదే పదే తాగునీటి సమస్య తలెత్తుతోంది. మోటార్లు కాలిపోవడం, పైపులు పగిలిపోవడం లాంటి సమస్య వచ్చినప్పుడు నాలుగైదు రోజులకొకసారి నీరిచ్చిన ఘటనలు ఉన్నాయి.

ఏళ్ల తరబడి తాగునీటి కోసం తంటాలే..!

ఒంగోలు నగరంలో ఇటీవల కాలంలో పదేపదే తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత నెలరోజులుగా అయితే మరింత దారుణంగా మారింది. రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద నీటి సరఫరాకు ఉపయోగించే మోటారు ప్రతిసారీ మరమ్మతులక గురవుతుంది. దీంతో నీటి సరఫరా వారంలో ఒకరోజు ఆలస్యం అవుతుంది. అది కూడా ఒక మోటారుపైనే కావడంతో సరఫరా సమయం కూడా తగ్గించేశారు. దీంతో ప్రజలు ఎప్పుడొస్తాయో తెలియని నీటి కోసం రోజంతా పనులు మానుకుని ఎదురుచూడాల్సి వస్తోంది. ఒంగోలు నగరంలో 50 డివిజన్లు ఉండగా, వాటన్నింటికీ నీటి సరఫరాకు మూడు మోటార్లు ఏర్పాటు చేశారు. అయితే గతంలో ఎప్పుడో కొనుగోలు చేసిన మోటార్లు కావడంతో పదేపదే సమస్య ఎదురవుతుంది. ఒక్క మోటారు మొరాయించినా కాలనీలకు నీటిసరఫరా షెడ్యూలులో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో మూడురోజులకు ఒకసారి ఇచ్చే నీరు మరో ఒకటి, రెండు రోజుల ఆలస్యంగా వస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నగరమైనా ప్రైవేటు ట్యాంకర్లే

నగర జనాభా విపరీతంగా పెరిగింది. ఒంగోలు ప్రాంత పరిధులు పెరిగాయి. అయితే శివారు కాలనీలు, విలీన గ్రామాల స్థితిగతులు మాత్రం మారలేదని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. జిల్లాకేంద్రమైన ఒంగోలుకు మాత్రమే తొలిసారిగా కార్పొరేషన్ హోదా లభించింది. కానీ అందుకు అనుగుణంగా నీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వ ట్యాంకర్లు లేవు. గతంలో మూడు ఉండగా అవి ప్రస్తుతం మరమ్మతులకు గురై నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా ఏళ్ల తరబడి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇదిలా ఉండగా కార్పొరేషన్‌లో మరో పది పంచాయతీలు విలీనం కావడంతో ఉన్న అరకొర ట్యాంకర్లే వాటికీ దిక్కయ్యాయి. దాంతో అటు శివారు కాలనీలు, ఇటు గ్రామీణప్రాంతాల ప్రజలు కూడా తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు.

అడుగుంటిన వేసవి చెరువులు

గుండ్లకమ్మ నుంచి ఒంగోలుకు సరఫరా అవుతున్న తాగునీరు గత ఇరవై రోజులుగా నిలిచిపోయింది. ఇదిలాఉంచితే సాగర్ నీరు ఇప్పట్లో విడుదలయ్యే అవకాశాలు లేవని అధికారుల నుంచి వినిపిస్తున్న మాట. అయితే పాలకులు తాగునీటికి కోట్ల రూపాయల జీవోలు తెచ్చాం. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెబుతున్న హామీలు ఆచరణలో అమలు కావటం లేదు. దీంతో నగర ప్రజలు దాహం తీరే మార్గం కనిపించడం లేదు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీరు అడుగంటిపోయాయి. వాస్తవ పరిస్థితి చూస్తే ఉన్న నీరు నెలరోజులకు మించి వచ్చే పరిస్థితి లేదని సమాచారం. ఇప్పటివరకు మూడు రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా చేస్తోంది. అది కూడా అరకొరగానే విడుదల చేయడంతో నగరంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నగరంలో అధికశాతం ప్రాంతాల్లో పురాతన పైపులైన్లు ఉండగా, అతి కొద్ది ప్రాంతాల్లోనే కొత్తగా పైపులైను వేశారు. దీంతో పాత పైపులైనులు పదే పదే పగిలిపోతున్నాయి. వాటికి తాత్కాలిక మరమ్మతుల చేయడం మినహా శాశ్వత పరిష్కారం చూపడంలో యంత్రాంగం విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే నగరంలో భారీగా ఉన్న లీకులను పూర్తిస్థాయిలో నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అధికారులు నగరంలో డివిజన్‌ల వారీగా లీకుల జాబితా సిద్ధం చేసి, ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న వైద్యులు. రోగులు

రిమ్స్‌లోని జీజీహెచ్‌లో ఇన్‌పేషంట్లు వెయ్యి మంది వరకు చికిత్సపొందుతుండగా, వైద్య విద్యార్థులు 500 మంది, నర్సింగ్ విద్యార్థులు 500 మంది హాస్టల్‌లో ఉండి విద్యనభ్యసిస్తున్నారు. ప్రొఫెసర్లు, వైద్యులు, వైద్యసిబ్బంది, నర్సులు పలువురు క్షేత్రస్థాయి సిబ్బంది 2వేల మంది వరకు ఉంటారు. రోజు వైద్యం కోసం వచ్చేవారు మరో పదిహేను వందల మంది అవుట్ పేషెంట్‌లు వచ్చి పోతుంటారు. దీంతో నిత్యం 4 నుంచి 5 వేలమందితో కిటకిటలాడే రిమ్స్‌లో కనీస తాగునీరు లేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ లెక్కల ప్రకారం రిమ్స్‌లో రోజుకు 3.50లక్షల లీటర్ల నీటి అవసరం ఉండగా, కార్పొరేషన్ వారు 60వేల లీటర్ల అందిస్తున్నారు. వారంరోజుల నుంచి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల్లో నీరు అడుగంటి పోవడంతో అది కూడా నిలిచిపోయింది. దీంతో కనీస అవసరాలు తీరకపోవడంలో రిమ్స్‌లో దాహం కేకలు వినిపిస్తున్నాయి.

మూడు విడతలుగా కొనుగోళ్లు

ఈనెల 29 నుంచి తొలిదశగా

ఒంగోలు-1, కొండపిలలో ప్రారంభం

రైతు, వ్యాపార ప్రతినిధులతో

పొగాకుబోర్డు సమావేశంలో నిర్ణయం



ఒంగోలు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రస్తుత సీజన్ పొగాకు కొనుగోళ్లు మూడు విడతలుగా ప్రారంభం కానున్నాయి. తొలిదశగా ఈనెల 29న జిల్లాలోని ఒంగోలు-1, కొండపి కేంద్రాలలో వేలం చేపట్టనున్నారు. అనంతరం దక్షిణాది కేంద్రాల్లో మూడు చోట్ల రెండో విడతగా మిగిలిన దక్షిణాదిలోని ఐదుకేంద్రాలతోపాటు ఉత్తరాది కేంద్రాల్లో మూడో విడత ప్రారంభించనున్నారు. ఆ మేరకు బుధవారం గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో నిర్ణయించారు. పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, ఈడీ అద్దంకి శ్రీధర్‌బాబు, సెక్రటరి దివి వేణుగోపాల్‌ల సమక్షంలో వ్యాపారులు, రైతు ప్రతినిధుల సమావేశం జరిగింది. కర్ణాటకలో ప్రస్తుత సీజన్ కొనుగోళ్లు దాదాపు పూర్తి కావస్తున్నాయి. అలాగే రాష్ట్రంలో ప్రత్యేకించి దక్షిణాదిలోని చాలాచోట్ల పొగాకు కాల్చు జరిగి గ్రేడింగ్‌లు జరుగుతున్నాయి. ఎండల తీవ్రత పెరుగుతున్న పరిస్థితుల్లో వెంటనే వేలం ప్రారంభించడం అవసరం అన్న అభిప్రాయం రైతు ప్రతినిధులు వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే వ్యాపార ప్రతినిధులు మాత్రం దాదాపు నాలుగు నెలల పాటు కర్ణాటకలో వేలం ప్రక్రియ కొనసాగగా తమ సిబ్బందికి కొన్నిరోజులు విశ్రాంతి అవసరం కనుక రాష్ట్రంలో వచ్చేనెలలో కొనుగోళ్లు ప్రారంభించాలని కోరినట్లు తెలిసింది. ఆయా అంశాలపై చర్చ అనంతరం మూడు విడతలుగా వేలం ప్రారంభించాలని నిర్ణయించారు. గతేడాది ఫిబ్రవరి 24న తొలి విడత కొనుగోళ్లు ప్రారంభించి మార్చి 9న రెండవ దశ, మార్చి 23 తుది దశగా మూడు విడతల్లో చేపట్టారు.

ప్రారంభ ధర రూ.250 ఉండాలి

అయితే ఈ ఏడాది ఫిబ్రవరి 29న తొలివిడత చేపట్టి మొత్తం మూడు విడతలుగా వేలం ప్రారంభించాలని నిర్ణయించారు. తొలివిడత ఒంగోలు-1, కొండపి కేంద్రాల పరిధిలో ఈనెల 29న కొనుగోళ్లు మొదలుకానుండగా మార్చి 6న కందుకూరు-1, 2, వెల్లంపల్లి కేంద్రాల్లోనూ, మూడవ విడతగా మార్చి 14న దక్షిణాదిలో మిగిలిన కేంద్రాలైన ఒంగోలు-2, టంగుటూరు, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలిలతోపాటు ఉత్తరాదిలోని ఐదు కేంద్రాల్లోనూ వేలం ప్రారంభించనున్నారు. ఈ ఏడాది పొగాకు సాగులో ఖర్చులు భారీగా పెరిగిన విషయాన్ని ఈ సందర్భంగా పలువురు రైతు ప్రతినిధులు బోర్డు అధికారులు, వ్యాపారుల దృష్టికి తీసుకెళ్లారు. వాస్తవ ఉత్పత్తి ఖర్చులను పరిగణనలోకి తీసుకొని వేలం ప్రారంభం రోజు నుంచే సరైన ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకోసం ప్రారంభ ధర కిలో రూ.250 చూడాలని కోరినట్లు సమాచారం. దానిపై వేలం ప్రక్రియ ప్రారంభ సమయానికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ సమావేశం అనంతరం క్షేత్రస్థాయి వేలం అధికారులతో ఏర్పాట్లపై ఉన్నతాధికారులు సమీక్షించారు. సమావేశంలో బోర్డు వైస్ చైర్మన్ గుత్తా వాసుబాబుతోపాటు జిల్లాకు చెందిన పాలక మండలి సభ్యులు, రైతు ప్రతినిధులు పాల్గొన్నారు.

డీఎస్సీలో బీఈడీలకు షాక్

ఎస్‌జీటీ పోస్టులకు దరఖాస్తులపై హైకోర్టు స్టే

ఒంగోలు(విద్య), ఫిబ్రవరి 21 : డీఎస్సీ-2024 బీఈడీ అభ్యర్థులకు షాక్ తగిలింది. డీఎస్సీలో ప్రకటించిన సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులకు బీఈడీ విద్యార్హతలు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడంపై బుధవారం హైకోర్టు స్టే విధించింది. దీంతో ఎస్‌జీటీ పోస్టులపై వారు పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. బీఈడీ విద్యార్హతలు అభ్యర్థులు స్కూలు అసిస్టెంట్లు, టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపాల్స్ పోస్టులకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో డీఎస్సీ 2024కు మొత్తం 503 పోస్టులు మాత్రమే ప్రకటించారు. వీటిలో ఎస్‌జీటీ పోస్టులు 111, స్కూలు అసిస్టెంట్లు 299, టీజీటీ పోస్టులు 93 ప్రకటించారు. ఎస్‌జీటీలకు డీఈడీ, బీఈడీ అభ్యర్థులందరూ అర్హులేనని డీఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకటించారు. అయితే నిబంధనల మేరకు కేవలం డీఈడీ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఈ మేరకు ఏపీసీటీఈ కూడా ధ్రువీకరించింది. గతంలో ఎస్‌జీటీ అర్హతలపై డీఈడీ, బీఈడీ అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీం కోర్టు కూడా డీఈడీ అభ్యర్థులకే కేటాయించాలని తీర్పు ఇచ్చింది. ఈ నేపథ్యంలో డీఎస్సీ-24 బీఈడీ అభ్యర్థులకు కూడా ఎస్‌జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వడంతో డీఈడీ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారించిన హైకోర్టు డీఎస్సీపై స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేసింది. ఇదిలా ఉండగా ఈనెల 12 నుంచి అభ్యర్థులు డీఎస్సీ పోస్టులకు దరఖాస్తులు చేస్తున్నారు. బుధవారంతో దరఖాస్తు గడువు ముగిసింది. ఈ నేపథ్యంలో ఎస్‌జీటీ పోస్టులకు ఇప్పటికే వందలాది మంది బీఈడీ అభ్యర్థులు దరఖాస్తు చేసి ఉంటారు. వీరిని రాత పరీక్షకు అనుమతించకపోతే వారు కోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వ పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి మాదిరిగా తయారైంది హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో మొత్తంగా ఎస్‌జీటీల నియామక ప్రక్రియకు బ్రేకులు పడే అవకాశం కనిపిస్తోంది. మొత్తం మీద ఏమి జరుగుతుందో వేచి చూడాల్సిందే.

అంగరంగ వైభవంగా నవగ్రహాల ప్రతిష్ఠ

కొణిదెన బ్రహ్మగుండం వద్దకు

పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు




నూతనంగా ప్రతిష్ఠించిన నవగ్రహ విగ్రహాలు

బల్లికురవ, ఫిబ్రవరి 21 :మండలంలోని కొణిదెన గ్రామంలోని ప్రసిద్ధ బ్రహ్మగుండం వద్ద బుధవారం అంగరంగ వైభవంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం జరిగింది. బ్రహ్మగుండం వద్ద అనాటి రాజులు ఏర్పాటు చేసిన దేవతామూర్తుల విగ్రహాలను ఎంతో కాలం నుంచి భక్తులు పూజలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన భక్తులు బ్రహ్మగుండం వద్ద శివ లింగం, సుబ్రమణ్యేశ్వర స్వామి వారి విగ్రహాలను గతంలో ప్రతిష్ఠించారు. నూతనంగా దాతల సహకారంతో నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా గ్రామ పరిసర గ్రామాల నుంచి భక్తులు విచ్చేసి ప్రత్యేక హోమాలలో పాల్గొన్నారు. అనంతరం వేద పండితులచే ప్రతిష్ఠ నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

24 న చెన్నుపల్లిలో శివలింగం ప్రతిష్ఠ

మండలంలోని కొండాయపాలెంలో గంగాపార్వతి సమేత నీల కంఠేశ్వరస్వామి దేవాలయ ధర్మకర్త దూళిపాళ్ల రామగోవిందు సహకారంతో చెన్నుపల్లి గ్రామంలో ఈ నెల 24వతేదీ ఉదయం 10 గంటలకు శివ లింగ ప్రతిష్ఠ జరగనుంది. ఈసందర్భంగా పూజలతో పాటు అన్న దానం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.



ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక హోమాలలో పాల్గొన్న భక్తులు

గందరగోళంగా మండల సమావేశం

కోరం లేక వాయిదా

మేదరమెట్ల , ఫిబ్రవరి 21 : కొరిశపాడు మండల పరిషత్ సమావేశం మారుతున్న రాజకీయాలకు వేదికగా మారింది. సమావేశం 10:30 ప్రారంభం కావాల్సి ఉండగా 12 గంటల వరకు ఎంపీటీసీలు సమావేశంలోకి రాలేదు. 12 గంటల తరవాత సమావేశం హాలులోకి వచ్చిన ఎంపీటీసీలు మండల పరిషత్‌నిధులలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు కాపీని సమావేశం నిర్వహిస్తున్న ఈవోఆర్డీకి అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఎంపీటీసీలు మాట్లాడుతూ కొత్త కార్యవర్గం ఏర్పడిన తరువాత తమకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదని, నిధుల పంపిణీలో కూడా అసమానతలు ఉన్నాయని ఆరోపించారు. అయితే సమావేశంలోకి ఎటువంటి హోదాలు లేని పలువురు వ్యక్తులు రావడం తీవ్ర చర్చనీయాంశం అయింది. సమావేశంలోకి వచ్చిన బయట వ్యక్తులు పెద్ద ఎత్తున వాదనలకు దిగడంతో సమావేశం రసాభాసగా మారింది. సమావేశం ముగించి వెళ్తున్న ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారిని, ఆమె భర్త సాధినేని మస్తాన్ రావును కొత్త ఇన్‌చార్జి హనిమిరెడ్డి వెంట ఎందుకు రాలేదని ప్రశ్నించారు. సమావేశపు హాల్‌లోనే జిందాబాద్ హనిమిరెడ్డి అంటూ నినాదాలు చేయడం కొసమెరుపు. మొత్తం మీద ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో బాచిన కృష్ణచైతన్యను వైసీపీ ఇన్‌చార్జిగా తప్పించడం, కొత్త ఇన్‌చార్జిగా పాణెం చిన్న హనిమిరెడ్డి రావడం కృష్ణచైతన్య వ్యతిరేకులు అందరు చైతన్యం అయ్యారు. ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, ఆమె భర్త మస్తాన్‌రావులు కృష్ణచైతన్య వర్గంలో ఉండడం ఈ పరిణామాలు అన్నింటికి మూలం. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి నిబంధనలు అంగీకరించకపోవడంతో బలవంతంగా రాజీనామా చేయించాలనే ప్రయత్నంలో ఈ గందరగోళం జరిగిందని మండలంలోని రాజకీయ పార్టీ నాయకులు భావిస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మేదరమెట్ల , ఫిబ్రవరి 21: మేదరమెట్లలోని తమ్మవరం రోడ్డులో కిరాణా షాపు నిర్వహిస్తున్న మహిళ మెడలో గొలుసు చోరీ జరిగింది. తమ్మవరం రోడ్డులో సాతులూరు లక్ష్మి, భర్త ఆంజనేయులుతో కలిసి కిరాణా షాప్ నిర్వహిస్తుంది. మంగళవారం రాత్రి గ్లాసులు కావాలంటూ వచ్చిన యువకుడు లక్ష్మి మెడలోని బంగారు గొలుసు లాగడంతో కొత్తభాగం తెగి దొంగ చేతికి వెళ్ళింది. గొలుసు లాక్కొని వెళుతున్న దొంగ బయట సిద్ధంగా ఉన్న బైక్‌పై పరారు అయ్యాడు. లక్ష్మి ఫిర్యాదు మేరకు మేదరమెట్ల ఎస్ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్వో వెంకటేశ్వర్లు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

● ఈఆర్వో కె.వెంకటేశ్వర్లు

పర్చూరు, ఫిబ్రవరి 21: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పర్చూరు నియోజకవర్గ ఎన్నికల ప్రత్యేక అధికారి కె.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో అఖిలపక్ష రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈఆర్వో మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 1,390 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అందులో ఫాం 7కి సంబంధించి 859, ఫాం -8కు 179, ఫారం 6 నూతనంగా ఓటుకోసం దరఖాస్తు చేసుకున్నవి 350 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫారం 7 విషయంలో కలెక్టర్, సీఈవో అనుమతితో మాత్రమే తొలగిస్తామన్నారు. ఫారం 6, ఫారం 8కు సంబంధించి వచ్చిన దరఖాస్తులు రోజూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోనే మానిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా పూర్తిస్థాయిలో వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈకార్యక్రమంలో పర్చూరు, కారంచేడు తహసీల్దార్లు సీహెచ్.సుబ్బయ్య, మోహర్ కుమార్, ఎలక్షన్ డీటీ సత్యనారాయణ అఖిలపక్ష పార్టీల నేతలు ఉన్నారు.



ముస్లింల ఆత్మీయ సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

ముస్లింల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయండి

చినగంజాం, ఫిబ్రవరి 21 : పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ కల్యాణ మండపంలో ఈ నెల 25వ తేదీ సాయంత్రం 5గంటలకు నిర్వహించే ముస్లింల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్‌రజాక్ పిలుపునిచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సయ్యద్ అబ్దుల్‌కలాంఆజాద్ ఆధ్యక్షతన మండల పరిధిలోని ముస్లిం మైనార్టీ నాయకులతో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం మండల ముస్లిం నాయకులతో కలిసి పర్చూరులో జరిగే ముస్లిం ఆత్మీయ సమావేశం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పర్చూరు మండల మాజీ అధ్యక్షులు జమాలుద్దీన్, కారంచేడు మండల ప్రధాన కార్యదర్శి ఖాసీం, ఇంకొల్లు మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు బాబర్‌భాషా, పర్చూరు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు రసూల్, టీడీపీ మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ జిలాని, షేక్.హుస్సేన్‌బాషా, షేక్.సలాం, మండల ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.



పొగాకు పంటను సాగు చేసే రైతులతో విదేశీ యూఎల్‌టీసీ కంపెనీ ప్రతినిధులు

పొగాకు పంటను పరిశీలించిన విదేశీ ప్రతినిధులు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 21: యద్దనపూడి మండలంలో సాగు చేస్తున్న నల్ల బర్లీ పొగాకు (హెచ్‌డీబీఆర్‌జీ) పంటలను బుధవారం విదేశీ ప్రతినిధులైన ముగ్గురు యూఎల్‌టీసీ కంపెనీ ప్రతినిధులు పరిశీలించారు. మండలంలోని చింతపల్లిపాడు, యనమదల, అనంతవరం ప్రాంతంలోని సాగు చేస్తున్న పొగాకు పంటలను వారు పరిశీలించారు. తరువాత పంటలను సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. అంతర్జాతీయ స్థాయిలో నల్ల బర్లీ పొగాకుకు గుర్తింపు రావడానికి కారణం రైతులు సుస్థిరమైన పద్ధతిలో పంటను సాగు చేయడమని, దాంతో రైతులు సాగు చేస్తున్న పంటలను స్వయంగా పరిశీలించడానికి ఈ ప్రాంతానికి వచ్చామని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విదేశీ కంపెనీ ప్రతినిధులు లిమా స్కాట్, లూయిస్ ఫ్లవర్, బ్రాడ్లీ ఫైక్‌లు పంటలను పరిశీలించగా, జీపీఐ కంపెనీ ప్రతినిధులు వైఎస్ పాటిల్, సందీప్ కుమార్, పునీత, ఉమా మహేష్‌లతో పాటు పలువురు పొగాకు రైతులు పాల్గొన్నారు.



యద్దనపూడిలో నాయనమ్మ సుబ్బాయమ్మ అంతిమయాత్రలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు మాతృమూర్తి మృతి

● అంతిమయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే రవికుమార్

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 21: యద్దనపూడి గ్రామంలో స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు మాతృమూర్తి సుబ్బాయమ్మ (98) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. అద్దంకి శాసన సభ్యులు గొట్టిపాటి రవికుమార్ తండ్రి శేషగిరిరావు స్వయానా హనుమంతరావుకు సోదరుడు కావడంతో బుధవారం నాయనమ్మ సుబ్బాయమ్మ అంత్యక్రియలలో రవి కుమార్ పాల్గొన్నారు. ఆమె పార్థీవ దేహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ఇంటి నుంచి ప్రారంభమయిన అంతిమయాత్రలో తుది వరకు రవికుమార్‌తో పాటు గొట్టిపాటి భరత్ నడిచారు. అద్దంకి మాజీ శాసన సభ్యులు బాచిన చెంచు గరటయ్య, అసిస్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు తదితరులు యద్దనపూడి గ్రామానికి వచ్చి సుబ్బాయమ్మ పార్థీవ దేహం వద్ద నివాళులు అర్పించారు. అదేవిధంగా అద్దంకి నియోజకవర్గం నుంచి పలువురు టీడీపీ నాయకులు యద్దనపూడి వచ్చి రవి కుమార్ ను కలిశారు.

పంటకు నీటి తడుల కోసం పాట్లు

కిలోమీటర్ల దూరం పైప్‌లు ఏర్పాటు చేసి పంపింగ్

ఎకరాకు రూ. 5 నుంచి 10 వేల ఖర్చు

రైతులకు మరింత భారం

అద్దంకి, ఫిబ్రవరి21: వ్యవసాయం భారంగా మారిన నేపథ్యంలో పంటలకు నీటి తడులు వేయాల్సి రావటంతో రైతులు మరింత ఆందోళన ఆందోళన చెందుతున్నారు. అయితే నోటికాడికి వచ్చిన పంటను ఎండ బెట్టుకోలేక, అదనపు భారం అయినా సుదూర ప్రాంతాల నుంచి సైతం నీటిని పంపింగ్ చేసి పొలాలకు పెడుతున్నారు. అద్దంకి ప్రాంతంలో ఆలస్యంగా సాగు చేసిన మొక్కజొన్న, పొగాకు, మిర్చి పంటలకు నీటి తడులు అవసరం అయ్యాయి. సాగర్ నీరు విడుదలై ఉంటూ పొలాలకు కాలువల ద్వారా నీరు పెట్టుకునే వీలు ఉండేది. అయితే ఈ ఏడాది సాగర్ నీరు విడుదల జరగకపోవటంతో నీటి తడుల కోసం రైతులు మరింత ఇబ్బంది పడుతున్నారు. దీంతో సుదూర ప్రాంతంలో ఉన్న నీటి వనరులను పొలాలకు చేర్చేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు.



నీటి తడులు పెడుతున్న మొక్కజొన్న చేను



అద్దంకి సమీపంలో నామ్ రోడ్డు వెంబడి పొలాలకు నాగులపాడు చెరువు నీటిని ట్రాక్టర్‌తో పంప్ చేస్తున్న రైతులు

ప్రతి మూడు నాలుగు వందల మీటర్లకు ఒక చోట ట్రాక్టర్‌ల ఇంజన్‌లు ఏర్పాటు చేసి నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఒక్కో చోట కిలో మీటరు నుంచి రెండు కిలోమీటర్ల వరకు పంపింగ్ చేయాల్సి ఉండటంతో మూడు, నాలుగు చోట్ల ట్రాక్టర్‌లను వినియోగిస్తున్నారు. దీంతో ఒక్కో ఎకరాకు నీటి తడుల కోసం 5 వేల నుంచి 10 వేల రూపాయల అదనపు భారం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలే వ్యవసాయం భారంగా మారిన తరుణంలో నీటి తడుల కోసం అదనపు ఖర్చు చేయాల్సి రావటం మరింత వ్యయం గా మారిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎకరాకు రూ. 5 వేలకు పైగా ఖర్చు



పంటలు ఎండిపోయే దశలో ఉండటంతో నీటి తడులు పెట్టాల్సి వస్తుంది. సుమారు కిలో మీటరన్నర దూరంలో ఉన్న చెరువు నుంచి 3 చోట్ల ట్రాక్టర్‌లకు పంప్‌సెట్‌లు ఏర్పాటు చేసి నీటిని పంపింగ్ చేస్తున్నాం. ఎకరాకు 5 వేల రూపాయల ఖర్చు అవుతోంది.

-శేషారెడ్డి, రైతు, అద్దంకి

జగనన్న కాలనీలో ఇచ్చిన ఇళ్ల పట్టాలు మార్చండి

కలెక్టర్‌ను కోరిన పూనూరు మహిళలు

యద్దనపూడి, (మార్టూరు) ఫిబ్రవరి 21: గ్రామానికి దూరంగా ఉన్నాయని, అక్కడ ఇళ్లు నిర్మించుకోవడానికి స్థలం సక్రమంగా లేదని, వాటిని రద్దు చేసి మరో చోట తమకు ఇంటి స్థలాలు ఇవ్వాలని మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన 42 మంది మహిళలు కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం అందజేశారు. బుధవారం యద్దనపూడిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ రంజిత్ బాషా పాల్గొని మాట్లాడుతూ ప్రజలనుంచి వచ్చే అర్జీలకు వెంటనే స్పందించాలని అధికారులను కోరారు. అధికారులు ప్రజలకు అందు బాటులో ఉండాలన్నారు.అనంతరం ప్రజలనుంచి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. పూనూరు గ్రామానికి చెందిన మహిళలు జగనన్న కాలనీలో ఇచ్చిన పట్టాలను రద్దు చేసి మరో స్థలంలో ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. దీనిపై జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ మాట్లాడుతూ పూనూరు గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వ స్థలం ఉంటే వివరాలు సేకరించాలని రెవెన్యూ ధికారులకు సూచించారు. అదేవిధంగా పలు గ్రామాలకు సంబంధించి భూసమస్యలపై 9 మంది కలెక్టర్‌కు అర్జీలను ఇచ్చారు. వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా అనంతవరం, యనమదల గ్రామాలలో పారిశుధ్య పనులు సక్రమంగా లేవని పలువురు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా ఈ రెండు గ్రామాలలో త్వరితగతిన పారిశుధ్య పనులు చేపట్టాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవీందర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి రామకృష్ణ, మండల స్పెషల్ ఆఫీసర్ కరుణశ్రీ, ఎంపీడీవో శివ సుబ్రమణ్యం, మండల తహసీల్దారు వై.నాగరాజు, తదితర శాఖలకు చెందిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



భూ సమస్యపై కలెక్టరు రంజిత్ బాషాకు వివరిస్తున్న మహిళ

షర్మిల రాకతో కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

- కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

అద్దంకి, ఫిబ్రవరి 21: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు గా వైఎస్ షర్మిల బాధ్యతలు చేపట్టిన తరువాత క్యాడర్‌లో నూతనోత్సాహం వచ్చిందని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం అన్నారు. అద్దంకి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం అడుసుమల్లి కిషోర్ బాబు అధ్యక్షతన బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన శీలం మాట్లాడుతూ వైసీపీ, టీడీపీలు రాష్ట్ర ప్రయోజనాలను గాలికి వదిలేసి స్వలాభం కోసం కేంద్రం ముందు మోకారిల్లాయని అన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం, రైల్వే జోన్ లాంటి అంశాలను ఏనాడు ప్రశ్నించలేదన్నారు. స్టీలు ప్లాంట్ అమ్ముతుంటే కనీసం అభ్యంతరం చెప్పలేని దౌర్భాగ్య స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కష్టపడి పనిచేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీపతి ప్రకాశం, జనరల్ సెక్రటరీ తోట శివనాగేశ్వరరావు, బాపట్ల పార్లమెంట్ సమన్వయకర్త ధూళిపాళ్ల కల్యాణచక్రవర్తి, అడుసుమల్లి కిషోర్‌బాబు, కోరే సురేంద్రనాద్, ఎర్రమోతు నాగయ్య, మండల పార్టీఅధ్యక్షులు లేళ్ళ సుబ్బారెడ్డి, సురేష్‌బాబు, అబ్రహాం, కబలా సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సాయికాలనీ రోడ్డులో బల్బులేని విద్యుత్ స్తంభం

వెలగని వీధి లైట్లు గ్రామాల్లో అంధకారం

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 : మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాలు సింహభాగం రాత్రి వేళల్లో అంధకారంలో ఉంటున్నాయి. గత ప్రభుత్వం హయాంలో ఆర్థిక సంఘాల నిధులలో వచ్చిన మొత్తాన్ని 15శాతం వరకు విద్యుత్ సౌకర్యాలకు ఖర్చు చేయగా ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులలో టైడ్ 60 శాతం, అన్‌టైడ్ 40 శాతం చేశారు. పైగా ఈ అన్‌టైడ్ 40 శాతంలో 10 శాతం మాత్రమే విద్యుత్ సౌకర్యాలకు ఉపయోగిస్తున్నారు. దీంతో గ్రామాల్లో పూర్తిగా సౌకర్యాలు అందని ద్రాక్షగా మారాయి. అయితే ప్రస్తుతం అన్‌టైడ్‌లో 10 శాతం కూడా లేక ఖజానా ఖాళీగా ఉంది. దీంతో వ్యవస్థ పూర్తిగా కుంటుపడింది. ఈక్రమంలో ఒక విద్యుత్ పోల్ వద్ద మరమ్మతులు చేపట్టాలంటే అధికారుల పరిస్థితి ఆందోళనగా మారుతోంది.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ



ప్రమాదంలో పూర్తిగా దెబ్బతిన్న ఆర్డినరీ బస్సు



ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు

పలువురికి గాయాలు

తప్పిన పెను ప్రమాదం

పర్చూరు - గుంటూరు రహదారిలో బోడవాడ వద్ద సంఘటన

అతివేగమే కారణమంటున్న ప్రయాణికులు



పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో క్షతగాత్రులు

బోడవాడ(పర్చూరు), ఫిబ్రవరి 21: రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పర్చూరు - గుంటూరు ఆర్ అండ్‌బీ రోడ్డులోని బోడవాడ సమీపంలో చోటుచేసుకుంది. ప్రయాణికులు, స్థానికుల సమాచారం మేరకు పర్చూరు నుంచి ప్రయాణికులతో గుంటూరు వెళుతున్న ఆర్డినరీ బస్సు బోడవాడ సమీపానికి చేరుకునే క్రమంలో గుంటూరు నుంచి ప్రయాణికులతో పర్చూరు వస్తున్న ఆర్‌టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా వచ్చి ఆర్డినరీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆర్డినరీ బస్సులో ప్రయాణిస్తున్న కంబంపాటి అక్కమ్మ, ఎం.తిరుపతమ్మ అనే ఇరువురు మహిళలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతోపాటు పలువురు ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదతీరును పరిశీలించారు. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరు తరలించారు.

అతివేగమే ప్రమాదానికి కారణం

ఎక్స్‌ప్రెస్ బస్సు అతివేగంగా దూసుకు రావటం వల్లే ప్రమాదం జరిగిందని ప్రయాణికులు అంటున్నారు. బస్సు వేగాన్ని గుర్తించిన ఆర్డినరీ బస్సు డ్రైవర్ బస్సును మార్జిన్‌లోకి తీసుకుపోవటంతో ప్రాణాలతో బయట పడ్డామని ప్రయాణికులు తెలిపారు.

తప్పిన పెను ప్రమాదం

ప్రమాదం జరిగిన సమయంలో ఎక్స్‌ప్రెస్ బస్సులో 42 మంది, ఆర్డినరీ బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. ఎదురెదురుగా బస్సులు ఢీకొని ఉంటే పెద్ద ఎత్తున ప్రాణనష్టం జరిగి ఉండేదని ప్రయాణికులు అంటున్నారు.

లాడ్జి కిటికీ నుంచి పడి ఉద్యోగి మృతి

కేసు నమోదు చేసుకున్న వన్‌టౌన్ పోలీసులు



కరుణ కుమార్(48)ఫైల్

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 : పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంకు చెందిన అగ్రికల్చర్ ఉద్యోగి చీరాల పట్టణంలో బుధవారం అర్ధరాత్రి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే భీమవరంకు చెందిన గొండు కరుణకుమార్(48) అగ్రికల్చర్ అటెండర్. ఈక్రమంలో సహోద్యోగి సాయివంశీ, డ్రైవర్ శ్రీనుతో కలిసి వేటపాలెం మండలంలోని సంబంధిత డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారి ఇంట్లో శుభకార్యానికి మంగళవారం రాత్రి చీరాలకు వచ్చారు. బుధవారం ఫంక్షన్ కావడంతో చీరాల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ లాడ్జిలో రూం బుక్ చేసుకున్నారు. ఈ సమయంలో సహచరులతో కలిసి మద్యం సేవించారు. అనంతరం ఇరువురు నిద్రించగా కరుణకుమార్ కిటికీలో కూర్చుని జారిపడి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అర్ధరాత్రి లాడ్జి వద్దకు చేరుకుని నిద్రలో ఉన్న ఇరువురిని లేపి విషయంపై ఆరా తీయగా వారు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఏరియా వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే మిగిలిన ఇరువురిని వన్‌టౌన్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కరుణకుమార్ మృతితో ఆ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు చీరాలకు వచ్చారు. మృతి ప్రమాదవశాత్తుగానే జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతునికి మూడు నెలల పాప, భార్య ఉన్నారు.

నిర్ణీత వ్యవధిలో నిర్మాణం పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే బలరాం

చీరాల,ఫిబ్రవరి 21 : చేపట్టిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి చెప్పారు. మండలంలోని జాండ్రపేటలో రూ.7 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్డుకు బుధవారం ఎమ్మెల్యే బలరాం శంకుస్థాపన చేశారు. ముందుగా స్థానిక మహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, వైసీపీ మండల అధ్యక్షుడు అంకాళరెడ్డి, బొడ్డు సుబ్బారావు, లేళ్ల శ్రీధర్, కట్టా గంగయ్య, పన్నెం ప్రసాద్, వృథ్వీ ధనుంజయ, సత్రం లవకుమార్, బక్కా శ్రీనివాసరెడ్డి, బొడ్డు సాంబశివరావు, గుంటూరు సుబ్బారావు పాల్గొన్నారు.



జాండ్రపేట మహాలక్ష్మమ్మ అమ్మవారి చెట్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి

హైవే సైడు కాల్వలపై మూతలు ఏర్పాటు

మార్టూరు, ఫిబ్రవరి 21: మార్టూరు సెంటర్లో గతంలో హైవే అధికారులు ఏర్పాటు చేసిన సైడు కాల్వలపై కొన్ని చోట్ల మూతలుగా ఉన్న బండ రాళ్లు పగిలిపోయాయి. మరి కొన్ని చోట్ల మూతలు లేక పోవడంతో సైడు కాల్వల నుంచి దుర్గంధం బయటకు వ్యాపిస్తున్నది. దానికి తోడు కొంతమంది ద్విచక్రవాహనదారులు ఈ సైడు కాల్వల వద్ద ప్రమాదానికి గురై కాల్వల్లో పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హైవే అధికారులు బుధవారం మార్టూరు సెంటర్లో సైడు కాల్వల్లో మూతలేని చోట్ల సిమెంటుతో ఏర్పాటు చేసిన బండ రాళ్లను మూతలుగా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మార్టూరులోని ప్రధాన సెంటర్లో సైడు కాల్వలపై మూతలను ఏర్పాటు చేశారు. గతంలో మురుగునీరు సక్రమంగా వెళ్లకుండా కాల్వలోనే నిలిచిపోవడంతో హైవే సిబ్బంది కొన్ని చోట్ల మూతలను తొలగించి మురుగునీరు సక్రమంగా వెళ్లే విధంగా చర్యలను చేపట్టారు. దాంతో కొన్ని చోట్ల తొలగించిన మూతలను మళ్లీ ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం వాటిపై కూడా మూతలను ఏర్పాటు చేశారు.



సైడు కాల్వపై భారీ క్రేన్‌తో సిమెంటు మూతలను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పంచాయతీ భవన నిర్మాణానికి రూ.50వేల విరాళం

చీరాల,ఫిబ్రవరి 21 : మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ భవనంపై అంతస్తు నిర్మాణానికి డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు(హైమా సుబ్బారావు) రూ.50వేలు విరాళం ఇచ్చారు. బుధవారం తన వైద్యశాలలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్‌కు ఆ మొత్తాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామస్థునిగా తన వంతు బాధ్యతగా విరాళం అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు దివి శివరాం, వెంకటేశ్వరరెడ్డిపాల్గొన్నారు.



రూ.50వేలు విరాళం అందజేస్తున్న డాక్టర్ హైమా సుబ్బారావు

27న అద్దంకిలో జాబ్ మేళా

అద్దంకి, ఫిబ్రవరి 21: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27 వ తేదీ ఉదయం 9 గంటలకు అద్దంకి లోని ప్రకాశం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణ లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి తమ్మాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 20 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. పూర్తి వివరాలకు 9542970871, 7989697996 సెల్ నెంబర్లను లేదా 9988853335 టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

బీజేపీ ప్రజా పోరుయాత్ర ప్రారంభం

చీరాల,ఫిబ్రవరి 21 : మండలంలోని పెర్లవారిపాలెం నుంచి బుధవారం బీజేపీ ప్రజా పోరుయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రముఖ న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ మాట్లాడుతూ దేశ ప్రగతి బీజేపీతోనే సాధ్యమన్నారు. అందుకు అనుగుణంగా ప్రజలను చైతన్య పరచటమే ప్రజా పోరుయాత్ర ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అర్వపల్లి కుమార్, గౌరాబత్తుని జయశంకరరెడ్డి, నాగేశ్వరరావు, మేడికొండ భరణీరావు, బిట్రా శ్రీను, పెర్ల బ్రహ్మయ్య, బక్క మనోహరరెడ్డి, పెనుగొండ వెంకటేశ్వర్లు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ప్రజా పోరుయాత్రలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కరపత్రాల ఆవిష్కరణ

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 21: ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణమాదిగ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి జిల్లాల పర్యటనలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన పర్యటనకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 2వ తేదీన అద్దంకిలోని బంగ్లారోడ్డులో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, ఎంఈఎఫ్ అనుబంధ సంఘాల సమావేశం జరుగుతుందన్నారు. ఆయా సంఘాల నేతలందరూ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

మధురమైనది తెలుగు భాష

చినగంజాం, ఫిబ్రవరి 21 :తెలుగు భాష ఎంతో మధురమైనదని మున్నం వారిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం. ఎం.మల్లారెడ్డి అన్నారు. మండలంలోని మున్నం వారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మాతృభాషను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెచ్‌ఎం అన్నారు. తెలుగు భాషను కాపాడుకోవడం మనందరి కర్తవ్యమని అన్నారు. అభివృద్ధి అనే పేరుతో ఆంగ్ల భాష మోజులో పడి అమ్మ భాషను విస్మరిస్తున్నారని అన్నారు. అన్ని భాషలలో కల్లా మాతృ భాష అయిన తెలుగు గొప్పదనం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థిని విద్యార్థులు అ అక్షరం ఆకృతిలో ఏర్పడి తెలుగు భాషాభిమానాన్ని చాటారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.నాగమల్లేశ్వరరావు, ఎన్.చంద్రశేఖర్, పి.హిమవంతేశ్వరి పాల్గొన్నారు.



అ అక్షర ఆకృతిగా ఏర్పడిన మున్నంవారిపాలెం పాఠశాల విద్యార్థులు

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడు మృతి

చీరాలటౌన్, ఫిబ్రవరి 21 : చీరాల పరిధిలోని ప్రసాద్‌నగర్‌లో ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాడరేవుకు చెందిన గొర్రెముచ్చు సన్నీ, మీనాలకు శశిధర్(18) ఒక్కగానొక్క కుమారుడు. తండ్రి మత్స్యకారుడు కావడంతో కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా చదవుకునే పరిస్థితిలేక ఇంటర్ మధ్యలో ఆపి తండ్రితో పాటు వేటకు వెళుతున్నాడు. ఈక్రమంలోనే బుధవారం చీరాలకు ద్విచక్ర వాహనంపై వచ్చి తిరిగి వెళుతుండగా ప్రసాద్‌నగర్ సమీపంలో ముందు వెళుతున్న మరో వాహనాన్ని దాటేందుకు ప్రయత్నిస్తూ వాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన నున్న చెట్టును ఢీ కొట్టాడు. దీంతో తీవ్ర రక్తగాయాలతో కొన ఊపిరితో ఉన్న శశిధర్‌ను స్థానికులు చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. అయితే వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు గుంటూరుకు సిఫారసు చేశారు. సంబంధిత ఏర్పాట్లు జరుగుతుండగానే తుదిశ్వాస విడిచాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



గొర్రెముచ్చు శశిధర్(ఫైల్)

శింగరకొండలో వైవీ ప్రత్యేక పూజలు

అద్దంకి, ఫిబ్రవరి21: టీటీడీ మాజీ ఛైర్మన్, రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వైవీ సుబ్బారెడ్డి బుధవారం రాత్రి శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుని గా నామినేషన్ దాఖలు చేసే ముందు కూడా శింగరకొండలో పూజలు నిర్వహించిన వైవీ ఎన్నికైన అనంతరం మరలా బుధవారం పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం వైవీ సుబ్బారెడ్డిని ఈవో సుభద్ర, పూజారులు ఆశీర్వదించి సత్కరించారు. వైసీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి, వైవీ భద్రారెడ్డి, మారం వెంకారెడ్డి, కాకాని రాధాకృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

వేటపాలెం(చీరాల),ఫిబ్రవరి 21 : అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను వేటపాలెం ఎస్సై సురేష్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

కుట్రపూరితంగానే మీడియాపై దాడులు

- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి

నెల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సీఎం జగన్మోహన్‌రెడ్డి వైఫల్యాలను ఎండగడుతున్న మీడియాకు సమాధానం చెప్పలేక కుట్ర పూరితంగా వరుస దాడులకు తెగబడుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. మొన్న రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి, నిన్న కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడి కుట్రలో భాగమేనన్నారు. బుధవారం నెల్లూరులోని తన నివాసం నుంచి ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రోజురోజుకూ శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒంగోలులో తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై పట్టపగలు దాడి జరగడం దురదృష్టకరమన్నారు. పట్టపగలే ఇన్ని దాడులు జరుగుతున్నా పోలీసు వ్యవస్థ ఏమైపోయిందని సోమిరెడ్డి ప్రశ్నించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మీడియాపై జరుగుతున్న వరుస దాడుల విషయంలో గవర్నర్, ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాలని కోరారు.

జగన్ పైశాచికానికి నిదర్శనం : కోటంరెడ్డి



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

కలం... నిరసన గళం

మీడియా ప్రతి నిధులు, కార్యాలయాలపై వైసీపీ గూం డాలు దాడులకు తెగబడటం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి పైశాచికానికి నిదర్శనమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దుయ్యబట్టారు. బుధవారం నెల్లూరు లోని ఎన్టీఆర్ భవన్‌లో ఆయన విలేకరుల సమావే శంలో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక గూండాయిజం పెరిగిపోయిందని, ఆఖరుకు మీడియాకే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇవాళ ఆంధ్రజ్యోతి, ఈనాడులపై దాడులు జరిగాయని, రేపు ఇంకొకరిపై జరుగుతా యన్నారు. జర్నలిస్టులంతా ఒక్కటిగా ఉండి ఇలాంటి దుర్మార్గాలను ఎదుర్కో వాలని పిలుపునిచ్చారు. నిజాలను నిర్భయంగా రాస్తున్న రాధాకృష్ణ, రామోజీ రావు, బీఆర్ నాయుడులపై లారీ క్లీనర్ కొడాలి నాని వ్యాఖ్యలు ఆయన సిగ్గులేని తనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. మీడియాపై దాడులను సాక్షిలో పని చేస్తున్న వారు కూడా ఖండించాలని, వారు కూడా తాము జర్నలిస్టులమన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని కోటంరెడ్డి సూచించారు. ఈ సమావేశంలో మామిడాల మధు, కప్పిర శ్రీనివాసులు, పిట్టి సత్యనాగేశ్వరరావు, కువ్వారపు బాలాజీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

- **ప్రశ్నించే గళం వింటే జగన్‌కు భయం : అజీజ్**

ప్రశ్నించే గళం వింటే సీఎం జగన్మోహన్‌రెడ్డికి వణుకు పుడుతోందని టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అన్నారు. బుధవారం నెల్లూరులోని తన నివాసం నుంచి ఆయన విలేకరులతో మాట్లాడుతూ పరాభవం ఖాయమని తెలిసిపోవడంతో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తూ వైసీపీ మూకతో మీడియా ప్రతినిధులు, సంస్థలపై జగన్‌రెడ్డి దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. నియంతపాలనకు ప్రజాస్వామ్యంలో చోటు లేదని, కాలగర్భంలో కలిసిపోక తప్పదని అజీజ్ స్పష్టం చేశారు.

కొనసాగుతున్న ఆందోళనలు



సైదాపురం : డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు




బిట్రగుంట : తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసనలు చేస్తున్న ఎస్.మల్లి తదితరులు

సైదాపురం/అల్లూరు : పాత్రికేయులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జిల్లాలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. సైదాపురంలో జర్నలిస్టుల యూనియన్ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ అనురాధకు వినతి పత్రం అందజేశారు. యూనియన్ మండల అధ్యక్షుడు రవీంద్రనాథ్, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరులోని పాతబస్టాండు కూడలిలో అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్ రాజు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. నాయకులు నరేంద్ర, వేణుగోపాల్, సుధాకర్, మాల్యాద్రి, రాజేష్‌బాబు, కప్పల నవీన్ కుమార్, బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

- **బిట్రగుంట :** బోగోలు తహసీల్దారు కార్యాలయం ఎదుట దళిత సంఘర్షణ సమితి నాయకులు ఆందోళన చేశారు. ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టుపై దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలంటూ డిప్యూటీ తహసీల్దారు జూలియాబాయికి వినతిపత్రం అందించారు. ఈ నిరసనలో ఆ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి, దివ్యాంగుల నాయకులు యు.రవి, సాదు ప్రసాద్, ఆత్మకూరి తేజ, ఆనంద్, రత్నం, ఏ.మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

అనుకున్నట్లే జరిగింది. ఫ్యాన్‌కు భారీ షాకే తగిలింది. అధికార వైసీపీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి (వీపీఆర్) తన పదవులకు, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఫ్యాన్‌లో భారీ కుదుపు తీసుకొచ్చింది. నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న తనకు నష్టం జరిగేలా జిల్లాకు చెందిన వైసీపీ నాయకులు పావులు కదపడం, ఇందుకు పార్టీ పెద్దలు కూడా సహకరించడంతో వీపీఆర్ కొన్ని రోజులుగా రాజకీయాలకు, పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలోనే ఆయన పోటీ చేయాలనే ఆలోచనను విరమించుకున్నారని, వైసీపీకి రాజీనామా చేస్తారనే ప్రచారం నడిచింది. అనుకున్నట్టుగానే బుధవారం చెన్నై నుంచి నెల్లూరులోని తన నివాసానికి చేరుకున్న వీపీఆర్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, జిల్లా అధ్యక్ష పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సంఘటనతో వైసీపీ నాయకులు, కార్యకర్తలు షాక్‌కు గురయ్యారు.



ఫ్యాన్‌కు షాక్!

- రాజ్యసభ సభ్యత్వానికి, పార్టీకి వీపీఆర్ రాజీనామా
- టీడీపీలో చేరే యోచనలో వేమిరెడ్డి
- ఆయన వెంటే సైకిల్ ఎక్కనున్న నాయకులు
- వైసీపీ నుంచి మొదలు కానున్న వలసలు

నెల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గత అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పదికి పది అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో గెలిచి తిరుగులేని ఆధిక్యతను చాటుకున్న వైసీపీ కొంత కాలంగా బలహీనపడుతూ వస్తోంది. ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిలు వైసీపీ అధిష్ఠానాన్ని ధిక్కరించి తెలుగుదేశం పార్టీలో చేరడంతో వెంకటగిరి, నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాల్లో వైసీపీ గ్రాఫ్ పడిపోయింది. ఇప్పుడు ఏకంగా పార్టీ జిల్లా అధ్యక్షుడే రాజీనామా చేయడంతో పార్టీ ప్రతిష్ఠ మరింతగా పతనం అయ్యింది. ఎమ్మెల్యేల రాజీనామాలు మూడు నియోజకవర్గాల్లో పార్టీని పతనం చేస్తే వీపీఆర్ రాజీనామా జిల్లా వ్యాప్తంగా పార్టీని నైతికంగా దెబ్బతీసింది. వివాద రహితుడిగా గుర్తింపు పొందిన వీపీఆరే పార్టీలో ఇమడలేక బయటకు రావడం జగన్ వ్యవహారశైలిపై ఉన్న విమర్శలకు బలం చేకూర్చింది.

- **వైసీపీ అభ్యర్థుల్లో కలవరం**

వీపీఆర్ వైసీపీకి దూరం కావడం, అంతకంటే ఎక్కువగా టీడీపీకి చేరువ అవుతారన్న ప్రచారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను కలవరపాటుకు గురిచేస్తోంది. వైసీపీ నుంచి వీపీఆర్ పార్లమెంట్‌కు పోటీ చేసి ఉంటే ఎమ్మెల్యే అభ్యర్థులకు చాలా ప్రయోజనాలు ఉండేవి. ముఖ్యంగా ఆర్థిక వనరులతోపాటు అసమ్మతిపోరు ప్రమాదం తప్పి ఉండేది. వాస్తవానికి ఏడాదికి ముందు వీపీఆర్ వైసీపీని వీడుంటే వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు పెద్దగా నష్టం జరిగుండేది కాదు. ఎందుకంటే ఆయన ఏడాదిన్నర క్రితం వరకు క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకలాపాలకు దూరంగానే ఉన్నారు. నెల్లూరు పార్లమెంట్‌కు పోటీ చేయాలని జగన్ ఆయనపై ఒత్తిడి పెంచడం, ఆ క్రమంలో ఆయన క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌పై దృష్టిపెట్టారు. ఇదే ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను కలవరపాటుకు గురిచేస్తోంది. నెల్లూరు పార్లమెంట్ పరిధిలో మెజారిటీ అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలకు వ్యతిరేక వర్గం ఉంది. ఈ అసమ్మతి వర్గాన్ని వీపీఆర్ తన దారిలోకి తెచ్చుకున్నారు. అసమ్మతి సెగలు ఎమ్మెల్యే అభ్యర్థుల మీద పడకుండా సర్దుబాటు చేశారు. ఈయన ఎంపీగా పోటీ చేయడం ద్వారా ఆర్థిక సహాయ సహకారాలతో పాటు అసమ్మతి సెగలను కట్టడి చేయడం వారిలో కొండంత బలాన్ని నింపింది. అయితే ఇప్పుడు వీపీఆర్ పార్టీకి రాజీనామా చేయడం, టీడీపీలో చేరతారన్న ప్రచారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు పిడుగుపాటు చందమయ్యింది. వీపీఆర్ పార్టీ మారే క్రమంలో వ్యతిరేక వర్గంగా ఉన్న నాయకులు, క్యాడర్ వీపీఆర్ వెంట వలస వెళ్లే ప్రమాదం లేక పోలేదు. ఇప్పటికే చాలా నియోజకవర్గాల నాయకులు ఆ ఏర్పాట్లు చేసుకున్నట్లు సమాచారం. కందుకూరు, ఉదయగిరిల మొదలు నెల్లూరు రూరల్ నియోజకవర్గం వరకు వైసీపీ క్యాడర్ నిలువునా చీలే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వీపీఆర్ విషయంలో జగన్ తీసుకున్న తప్పుడు నిర్ణయం తమ తలకు చుట్టుకుందనే బాధ పలువురు ఎమ్మెల్యే అభ్యర్థుల్లో కనిపిస్తోంది.



వీపీఆర్ ఇంటిముందు అభిమానులు కోలాహలం



వీపీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

- **తెలుగుదేశంలో జోష్..!**

వైసీపీకి కంచుకోటలాంటి నెల్లూరు జిల్లాలో ఆ పార్టీకి చెందిన బలమైన నాయకులు ఒక్కొక్కరుగా అధినేతపై తిరుగుబాటు ప్రకటించి బయటకు రావడంతో తెలుగుదేశం పార్టీలో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి. వీపీఆర్ వైసీపీ అభ్యర్థిగా పార్లమెంట్‌కు పోటీ చేయకపోవడం, టీడీపీలో చేరుతారనే ప్రచారాలు 'దేశం'లో జోష్ పెంచాయి.

వామ్మో చడ్డీ గ్యాంగ్!

- ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్లో చోరీ
- బీరువాలో రూ.4.6 లక్షల అపహరణ
- సీసీఫుటేజీ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

కావలి రూరల్, ఫిబ్రవరి 21: కావలి పట్టణ సమీపంలోని ముసునూరు టోల్‌గేట్ వద్ద ఉన్న ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 19వ తేదీ రాత్రి గుర్తుతెలియని ముగ్గురు దుండ గులు ప్రవేశించి ఆఫీస్ రూంలోని బీరువా పగల గొట్టి అందులోని రూ.4.60 లక్షలు అపహరించు కెళ్లా రు. ఈ విషయం గుర్తించిన పాఠశాల ప్రిన్సిపాల్ అమరజ్యోతి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ సీఐ కాటూరి శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని లభించిన సీసీ ఫుటేజ్ ఆధారంగా దుండగుల ధరించిన దుస్తులు, వారి కదలికలను బట్టి చడ్డీ గ్యాంగ్‌గా అనుమాని స్తున్నారు. జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కళాశాలలు, పాఠశాలలు ఈ ముఠా టార్గెట్ చేస్తుందని, ఇదే తరహాలో తమిళనాడులోని విల్లీపురం డిగ్రీ కళాశాలలో, తిరుపతిలోని కార్ల షోరూంలలో ముగ్గురు వ్యక్తులు వెళ్లి దొంగతనాలకు యత్నించగా సీసీ ఫుటేజ్ పరిశీలించి చడ్డీ గ్యాంగ్‌గా నిర్ధారించారన్నారు. జాతీయ రహదారికి సమీపంలో ఉన్న వారు తప్పనిసరిగా తమ ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, వాచ్‌మెన్‌లను ఏర్పాటు చేసు కోవాలన్నారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



జిల్లా ఓటర్లు 19,18,315

- 2317 పోలింగ్ కేంద్రాలు
- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (హరనాథపురం), ఫిబ్రవరి 21 : జిల్లాలో ఇప్పటి వరకు 19,18,315 మంది ఓటర్లు నమోదైనట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. బుధ వారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 2317 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని చెప్పారు. పూర్తి స్థాయిలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు. ఫారం-6 కింద 1662 దరఖాస్తులు, ఫామ్-7 కింద 1748 దరఖాస్తులు, ఫామ్-8 కింద 423 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి చర్యలు తీసుకొంటున్నామని వివరిం చారు. అన్ని రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను పూర్తిస్థాయిలో నియమించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న, వైసీపీకి చెందిన మురళీధర్‌రెడ్డి, సీ నారాయణ, టీడీపీకి చెందిన పీ హరికృష్ణ, కాంగ్రెస్‌కు చెందిన బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

డీఎస్సీ-2008 అభ్యర్థులకు ఆహ్వానం

నెల్లూరు (విద్య), ఫిబ్రవరి 21 : ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డీఎస్సీ-2008లో అర్హత సాధించి కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంటీఎస్ కింద పనిచేసేందుకు సుముఖత వ్యక్త పరిచిన అభ్యర్థులను ఉపాధ్యాయ ఖాళీల్లో నియమించేందుకు ఆహ్వాని స్తున్నట్లు డీఈవో రామారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో సుముఖత వ్యక్తం చేసిన సీహెచ్ గురవయ్య, సీహెచ్ లక్ష్మీ నరసన్న, ఎంవీ సుభాషిణి, ఎన్ ప్రభాకర్, ఎస్‌కే ఫరీదాబాను, కే జనార్ధన్, ఎం ఇంద్రసేనమ్మ బుధవారం ఉద యం 10.30 గంటలకు వారి అర్హత ధ్రువపత్రాలతో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.



పోలీస్‌స్టేషనులో రికార్డులు పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు, చిత్రంలో ఎస్ఐ ఖాజావలి

రక్షకుడే లంచావతారం!


- అరెస్ట్ చేయకుండా నగదు డిమాండ్
- నిందితులతో రూ.25వేలకు ఒప్పందం
- మధ్యవర్తి ద్వారా డబ్బు తీసుకుంటుండగా ఏసీబీ దాడులు
- కొండాపురం ఎస్ఐతోపాటు మహిళ అదుపులోకి..

కొండాపురం, ఫిబ్రవరి 21 : రక్షకుడే లంచావతారం ఎత్తిన సంఘటన ఇది. ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుడి వద్ద నుంచి రూ.25 వేలు లంచం తీసుకున్నందుకు కొండాపురం ఎస్ఐ ఖాజావలిని ఏసీబీ అధికారులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ డీఎస్పీ శ్రీనివాసులు కథనం మేరకు.. కొండాపురం మండలం గరిమెనపెంట పంచాయతీ ఎర్రబొట్లపల్లికి చెందిన కుక్కపల్లి చిన హజరత్తయ్యపై 2023 జూలైలో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. అదే సంవత్సరం ఆగస్టులో చిన హజరత్తయ్య భార్య తనను హింసిస్తున్నాడంటూ కేసు పెట్టింది. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ కేసు విషయమై చిన హజరత్తయ్య, అతని స్నేహితుడు అరిగెల శ్రీనివాసులును ఈ నెల 16వ తేదీన ఎస్సై ఖాజావళి స్టేషన్‌కి పిలిపించారు. మిమ్మల్ని అరెస్టు చేయకుండా ఉండేందుకు డీఎస్పీతో మాట్లాడి 41-ఏ నోటీసు ఇస్తానని, అలాగే చిన హజరత్తయ్యపై భార్య పెట్టిన కేసును రాజీ చేసి, కేసు కొట్టేసేలా చేస్తానని పేర్కొన్నారు. ఇందుకుగాను రూ.30వేలు ఇవ్వాలని ఎస్ఐ డిమాండ్ చేసి, చివరకు రూ. 25 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నారు. లంచం ఇచ్చేందుకు ఇష్టంలేని చిన హజరత్తయ్య ఏసీబీని ఆశ్రయించారు. వారు ఇచ్చిన సూచనలతో బుధవారం నిందితులు ఎస్ఐను కలవగా స్థానికంగా ఉన్న ఓ ఫిల్లింగ్ స్టేషన్‌లో నగదు ఇవ్వాలని సూచించారు. వారు అక్కడకువెళ్లి ఫిల్లింగ్ స్టేషన్‌లో పని చేస్తున్న ఓ మహిళకు నగదు ఇచ్చారు. తనకు నగదు అందినట్లు సదరు మహిళ ఎస్ఐకి ఫోన్ ద్వారా తెలియచేసింది. వెంటనే ఏసీబీ అధికారులు దాడులు చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఆమె వేసుకున్న కోటుకు కుడివైపు జేబులో ఉన్న నగదును స్వాధీనం చేసుకున్నారు. కాగా ఫిల్లింగ్‌స్టేషన్ మేనేజర్ ఖాతా ద్వారా 2023 జూన్ నుంచి ఎస్ఐ ఖాజావళి రూ.లక్షల్లో లావాదేవీలు జరిపినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఇంకా మరికొన్ని లావాదేవీలు ఉన్నాయని, వాటిని పరిశీలిస్తున్నామని వారు వివరించారు. ఎస్ఐతోపాటు సహకరించిన మహిళ పార్వతిని అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ఈ మేరకు కేసునమోదుచేసి నెల్లూరు ఏసీబీ కోర్టులో వారిని హాజరు పరుస్తామని తెలిపారు.

6న కందుకూరులో పొగాకు వేలం ప్రారంభం

- 14 నుంచి కలిగిరి, డీసీపల్లిలో కొనుగోళ్లు

కందుకూరు/మర్రిపాడు, ఫిబ్రవరి 21 : కందుకూరులోని రెండు పొగాకు వేలం కేంద్రాలలో మార్చి 6వ తేదీన కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. గుంటూరులోని పొగాకుబోర్డు కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో పొగాకు వేలం కేంద్రాలను ఈ నెల 29 నుంచే ప్రారంభిస్తుండగా, మార్చి 6న కందుకూరులోని రెండు వేలం కేంద్రాలు, మార్చి 14న కలిగిరి, డీసీ పల్లి వేలం కేంద్రాలలో వేలం ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. రైతులు గ్రేడింగ్‌లు సక్రమంగా చేసుకుని వేలానికి తీసుకుని రావటం ద్వారా గిట్టుబాటు ధరలు పొందాలని ఆయన కోరారు.



అడుగంటుతున్న సోమశిల జలాశయం

- ప్రాజెక్టుల్లో తగ్గుతున్న నీటినిల్వలు
- ఇంకా నెలన్నరపాటు నీరివ్వాల్సిన పరిస్థితి
- కేటాయింపులకు మించి సాగవుతున్న పంటలు
- తాగునీటికి సమస్యలు తలెత్తే ప్రమాదం

జాగ్రత్త పడకుంటే కష్టాలే!

నెల్లూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంటల సాగు కీలక దశకు చేరుకుంది. కొన్నిచోట్ల వచ్చే నెలలో వరి కోతలు జరగనుండగా, మరికొన్ని ప్రాంతాల్లో ఏప్రిల్‌లో కోతలు జరగనున్నాయి. ఈ ఏడాది నీటి లభ్యత తక్కువగా ఉన్న కారణంగా సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. మిచౌంగ్ తుఫాన్ దెబ్బకు రైతులు తీవ్రంగా నష్టపోయి రెండోసారి నార్లు పోసుకున్నారు. ఈ పరిస్థితుల్లో కనుపూరు కెనాల్ మినహాయించి పెన్నా డెల్టాలో మార్చి 15వ తేదీ వరకు కనుపూరు, కావలి, ఉత్తర, దక్షిణ కాలువ కింద ఏప్రిల్ మొదటి వారం వరకు సాగునీరు విడుదల చేయాల్సి ఉంటుందని వ్యవసాయ, ఇరిగేషన్ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. సాగునీటి సలహా మండలి (ఐఏబీ)లో 2 లక్షల ఎకరాలకు నీటి కేటాయింపులు ఇచ్చేలా నిర్ణయం తీసుకోగా ఆ తర్వాత లెక్కలు మారిపోయాయి. 3లక్షల ఎకరాల వరకు సాగు జరుగుతున్నట్లు అంచనా. దీంతో గతంలోలా కాకుండా ఉన్న నీటిని జాగ్రత్తగా వాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. ఇప్పటికే సోమశిల, కండలేరు ప్రాజెక్టుల్లో నీటినిల్వలు రోజురోజుకూ దిగజారుతున్నాయి. కండలేరు కింద గూడూరు, వెంకటగిరి ప్రాంతాల్లో అనధికారికంగా చెరువుల్లో ఉన్న నీటితో పంటలు వేసేశారు. ఇప్పుడు ఆ పంటలను కాపాడుకునేందుకు నీరు ఇవ్వాలని అధికారులపై రైతులు ఒత్తిడి తెస్తున్నారు. మరోవైపు సోమశిల కింద కావలి, దక్షిణ కాలువల చివరి ఆయకట్టుకు నీరందడం లేదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నారు. బుధవారం సోమశిలలో 19.379 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రోజుకు 3500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. ఆవిరి నష్టాలతో కలుపుకొని మూడు రోజులకు ఒక టీఎంసీ ఖర్చవుతోంది. మరో రెండు వారాలు ఇదే మొత్తాన్ని విడుదల చేయాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత డెల్టా ప్రాంతానికి కొంత తగ్గించవచ్చని అభిప్రాయపడుతున్నారు. ఈ లెక్కన చూసుకున్నా ఏప్రిల్ మొదటి వారం వరకు మరో పది టీఎంసీలలోపు మాత్రమే ఖర్చు చేయగలిగితేనే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి. అప్పుడు 7.50 టీఎంసీలు డెడ్ స్టోరేజీ పోను మరో రెండు టీఎంసీలు తాగునీటి అవసరాలకు సరిపోతాయి. అలా కాకుండా నీటి యాజమాన్యంలో నిర్లక్ష్యం వహిస్తే తాగునీటికి ఇబ్బందులు పడాల్సి ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాగుకు పోను మిగిలిన నీటితోనే సెప్టెంబరు, అక్టోబరు వరకు జిల్లా తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంటుంది.



కండలేరు డ్యాం

- **చెన్నైకు అవసరం లేదు!**

ఈ ఏడాది చెన్నై తాగునీటి అవసరాలకు ఇంత వరకు సోమశిల నుంచి నీటి విడుదల చేయలేదు. అదృష్టవశాత్తూ మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో చెన్నైలోని రిజర్వాయర్లన్నీ నిండిపోయాయి. వారికి ఇప్పట్లో నీటి అవసరం ఉండదని అధికారులు చెబుతున్నారు. కాబట్టి ఆ మిగులు నీరే ఇప్పుడు పంటలను కాపాడుతోందని అంటున్నారు. అదే సమయంలో కండలేరులో 10.70 టీఎంసీల నీరు ఉంది. డెడ్ స్టోరేజీ 8.40 టీఎంసీలు పోను నికరంగా 2.30 టీఎంసీలు మాత్రమే సాగు, తాగుకు నీరు అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం రోజుకు 500 క్యూసెక్కుల చొప్పున దిగువకు విడుదల చేస్తున్నారు. కానీ గూడూరు, వెంకటగిరి ప్రాంతాల్లో పంటలను కాపాడేందుకు నీరు విడుదల చేయాలంటూ రైతుల నుంచి విన్నపాలు అందుతుండటంతో కచ్చితంగా నీటిని ఇవ్వాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. అప్పుడు గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి ప్రాంతాలకు తాగునీటిని డెడ్‌స్టోరేజీ నుంచి తీసుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతాయని భావిస్తున్నారు. ప్రతి బొట్టును జాగ్రత్తగా వినియోగించుకుంటేనే వర్షాకాలం వరకు ఇబ్బందులు లేకుండా నెట్టుకురాగలుగుతామని నిపుణులు సూచిస్తున్నారు. ఇక నుంచి ఉన్నతాధికారులు నిరంతరం నీటి యాజమాన్యాన్ని పర్యవేక్షించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

పీహెచ్‌సీలో ప్రసవ వేదన!

- అందుబాటులో ఉండని వైద్యులు, సిబ్బంది
- కందుకూరుకు పరుగులు తీస్తున్న గర్భిణులు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 : గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు మెరుగైన వైద్య సేవలందిండంతోపాటు మాతా శిశు మరణాలను గణనీయంగా తగ్గించాలని, సాధారణ ప్రసవాలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే చేయాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్దేశించింది. కానీ వలేటివారిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పక్కన పెడితే కనీస స్థాయిలో కూడా కాన్పులు చేయడంలేదు. పీహెచ్‌సీలో సగటున ఒక కాన్పు కూడా జరగడం లేదు. ప్రైవేట్ ఆసుపత్రులలో కాన్పులు చేయించుకున్న గర్భిణులను గుర్తించి పీహెచ్‌సీలో కాన్పులు చేసినట్లు అధికారులకు నివేదికలు సమర్పిస్తున్నట్లు సమాచారం. కాన్పుల కోసం గర్భిణులను పీహెచ్‌సీకి తీసుకెళ్లినప్పుడు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక వేళ ఆ సమయంలో వైద్యులు, సిబ్బంది ఉన్నప్పటికీ కాన్పు కోసం వస్తున్న గర్భిణులు బలహీనంగా ఉన్నారనో, మరేదైనా సాకు చెప్పి కందుకూరు ఏరియా ఆసుపత్రికి సిఫార్సు చేస్తున్నట్లు తెలుస్తోంది. వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో మరికొంతమంది గర్భిణులు ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేసి కాన్పులు చేయించుకుంటున్నారు. సాధరణ కాన్పు అయ్యే సూచనలు ఉన్నప్పటికీ ప్రయివేట్ వైద్యులు డబ్బుల కోసం సిజేరియన్‌లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం ప్రతి పీహెచ్‌సీలో సగటున రోజుకొకటి చొప్పున నెలకు కనీసం 30 కాన్పులు చేయాల్సి ఉంది. అయితే నెలకు కనీసం ఒక ట్రెండు కాన్పులు కూడా పీహెచ్‌సీలో చేయడం లేదు. ఈ పీహెచ్‌సీలో భవన వసతితో పాటు అన్ని సదుపాయాలు ఉన్నాయి. ముగ్గురు వైద్యులు, ముగ్గురు స్టాఫ్‌నర్సులు, తగినంతమంది సిబ్బంది, పరికరాలు, మందులు, ల్యాబ్ ఉన్నప్పటికీ గర్భిణులకు ప్రసవాలు చేసే దిక్కేలేదు. అయినప్పటికీ సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఆత్మకూరు, ఫిబ్రవరి 21: త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పదవ తరగతి పరీక్షల నిర్వహణపై ఆత్మకూరు డివిజన్ పరిధిలోని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. పరీక్షల నిర్వహణకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కావలి ఉపవిద్యాశాఖాధికారి రఘురామయ్య, ఎంఈవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు

మంచి మార్కులు సాధించాలి

ఉదయగిరి: పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని ఎంఈవో భిక్షాలు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ షేక్ షకీరాబేగం తదితరులు పాల్గొన్నారు.

మేకపాటి గౌతంరెడ్డికి ఘన నివాళి

ఆత్మకూరు, ఫిబ్రవరి 21: దివంగత రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ద్వితీయ వర్ధంతిని బుధవారం పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి, మున్సిపల్ బస్టాండ్ ఆవరణలో విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటరమణమ్మ, వైస్‌ఛైర్మన్ షేక్ సర్దార్, జేఏసీ కన్వీనర్ సీహెచ్ ఆదిశేషయ్య, వైసీపీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి, పాల్గొన్నారు.

సంగం : మాజీ దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి రెండో వర్ధంతిని బుధవారం వైసీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంగం బ్యారేజి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గౌతమ్‌రెడ్డి అమర రహే అంటూ నినాదాలు చేశారు.



ఆత్మకూరు, సంగంలో గౌతంరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు

వైద్యశిబిరం పరిశీలన

చేజర్ల, ఫిబ్రవరి21: మండలంలోని నూతక్కివారికండ్రిక గ్రామంలో జ్వరాల బారిన పడిన వారికి కోసం మూడు రోజుల కిందట వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి పెంచలయ్య పరిశీలించారు. అనంతరం గ్రామంలో జ్వరాలు, నెప్పులతో బాధపడుతున్న వారిని పరామర్శించి వారికి తగు సలహాలు, సూచనలు ఇచ్చారు. అదే విధంగా గ్రామంలో పర్యటించి నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట మండల వైద్యులు నవీన్, జ్యోతి, సిబ్బంది ఉన్నారు.


నూతక్కివారికండ్రికలో జ్వర పీడితులను పరామర్శిస్తున్న జిల్లా వైద్యాధికారి పెంచలయ్య

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

సీతారామపురం, ఫిబ్రవరి 21: సచివాలయ సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ అన్నారు. బుధవారం సీతారామపురం బిట్-2 సచివాలయాలన్ని తనిఖీ చేసి మాట్లాడారు. సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించాలన్నారు. అలాగే సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, ప్రతిరోజూ మూడుగంటల నుంచి ఐదు గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. అనంతరం పలు రిజిష్టర్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏఈ బాలినేని ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి జీవన్ పాల్గొన్నారు.


సచివాలయంలో రిజిష్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో అబ్దుల్ ఆజాద్

వైసీపీ నేతపై కేసు నమోదు చేయాలి

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 21: కడప జిల్లా పులివెందుల వైసీపీ నేత నర్రా రవీంద్రా రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఎస్సీ సెల్ అధ్య క్షుడు స్వర్ణ కొండయ్య, మండల కన్వీనర్ బయ్యన్నలు బుధవారం ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనా రెడ్డికి ఫిర్యా దు చేశారు. పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎంఎస్ రాజుపై రవీంద్రారెడ్డి సోషల్ మీడియా వేదికగా అసభ్య పదజాలంతో వ్యక్తిత్వానికి భంగం కలిగేలా తప్పుడు పోస్టులను పెట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలోనూ ఇలాగే పోస్టులు పెట్టారని తెలిపారు. కేవలం దళితుడనే చులకన భావంతో ఈ నీచానికి పాల్పడడం దారుణమన్నారు. కార్యక్రమంలో బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, ఓబులరెడ్డి, జాషువా పాల్గొన్నారు.


ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ప్రజా సమస్యలపై దృష్టి సారించండి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్), ఫిబ్రవరి 21: మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చేజర్ల జయంత్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. మండల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని కోరారు. అనంతరం పలు శాఖల అధికారులు వారి యొక్క ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో నందిపాడు, కమ్మవారిపాళెం సొసైటీ అధ్యక్షులు మండ్ల శ్రీనివాసులు, తుమ్మల వెంగయ్య, ఎంపీడీవో సాయిప్రసాద్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ జయంత్‌రెడ్డి

సామాజిక భద్రత పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సామాజిక భద్రత పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్టేట్‌బ్యాంక్ మేనేజర్ కె.నరేష్‌బాబు తెలిపారు. మండలంలోని చుండి, పోలినేనిచెరువు గ్రామాలలో బుధవారం రాత్రి వలేటివారిపాలెం స్టేట్‌బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత ప్రదర్శన జరిగింది. జీరోఖాతాలు, బంగారు రుణాలు తదితర పథకాలపై కళాజాత బృందం సభ్యులు పాటలు, మ్యూజిక్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నరేష్‌బాబు, డిప్యూటీ మేనేజర్ పి. సుబ్బారావు, ఎఫ్ఓఎస్ కొండయ్య, కళాజాత బృందం సభ్యులు వినోద్, చిరంజీవి, డ్వాక్రా మహిళలు, రైతులు పాల్గొన్నారు.


మేనేజర్ నరేష్‌ను అభినందిస్తున్న ఖాతాదారులు

వైసీపీ రాక్షస పాలనకు నిదర్శనమిదే..!

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలన సాగిస్తుందని.. విలేకరులు, పత్రికా కార్యాలయాలపై జరిగిన దాడులే ఇందుకు నిదర్శనమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి మరువకముందే, కర్నూల్‌లో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అనుచరులు ఈనాడు కార్యాలయంపై దాడులు చేయడం ప్రజాస్వామ్యానికి తీరనిమచ్చన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టి పత్రికా స్వేచ్ఛను కాపాడి, దాడులకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

రేపు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 21: స్థానిక ఆల్‌ఖైర్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు అధ్యక్షతన టీడీపీ నియోజకవర్గస్థాయి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, జెడ్పీ మాజీ ఛైర్మన్ చెంచలబాబు యాదవ్, నియోజకవర్గ పరిశీలకులు వికాస్‌హరికృష్ణ పాల్గొంటారన్నారు. కావున నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, ఫిబ్రవరి 21: పట్టణంలోని యూనియన్‌రోడ్డుకు చెందిన ముచ్చుల సుబ్బరాయుడు బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. నియోజకవర్గ టీడీపీ నాయకుడు కాకర్ల సురేష్ తన ప్రతినిధులతో అంత్యక్రియల నిమిత్తం కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాబాషా, పులి సందానీ, సురేష్, ఉప్పుటూరి పెదవెంకటయ్య, ట్రస్టు ప్రతినిధి జల్సాయాదవ్ పాల్గొన్నారు.

అనంతసాగరం ఎస్ఐకి సన్మానం


ఎస్ఐని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

అనంతసాగరం, ఫిబ్రవరి 21: ఇటీవల బదిలీపై వచ్చిన ఎస్ఐ ఎస్ఐ సూర్యప్రకాష్‌రెడ్డిని బుధవారం టీడీపీ నేతలు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. సమస్యలు వివరించి.. వచ్చే ఎన్నికల్లో శాంతిభద్రతకు చర్యలు చేపట్టాని కోరారు. కార్యక్రమంలో పాతపాటి మధుసూదన్‌రెడ్డి, శివారెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

ఉప్పుటేరు నుంచి ఇసుక అక్రమ రవాణా

- బోర్లకు అందని నీరు

లింగసముద్రం, ఫిబ్రవరి 21 : మండలంలోని పెదపవని గ్రామ సమీపంలో ఉన్న ఉప్పుటేరు నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతోంది. ప్రతిరోజూ తెల్లవారుజాము నుంచి ఉదయం 7 గంటల వరకు, అర్థరాత్రి సమయాల్లో ఇసుకాసురులు ఇష్టానుసారం ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. ఇసుక యథేచ్ఛగా తోడేస్తున్నందున ఉప్పుటేరులోని బోర్లలో నీరు అడుగంటే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక రవాణా వలన తమ బోర్లకు నీరు అందే పరిస్థితి లేదంటున్నారు. దీంతో పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు ఇసుక అక్రమ రవాణాకు పాల్పడేవారు అనుమతులు ఉన్నాయని చెబుతున్నారని, కానీ ఈ నెల 14వ తేదీతో గడువు ముగిసిందని అధికారులు చెప్పారని గ్రామస్థులు చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

వైభవంగా శ్రీవారి కల్యాణం

కావలిటౌన్, ఫిబ్రవరి 21: ముసునూరు మందాటి చెరువు ఆనుకుని ట్రంకురోడ్డు వద్ద వెలసివున్న లక్ష్మీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక అర్చకులు వేదగిరి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవం భక్తులను కనువిందు చేసింది. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆటోనగర్ వాస్తవ్యులచే పెద్దఎత్తున అన్నసంతర్పణ గావించారు. సాయంత్రం హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీవారు గజ వాహనంపై పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.



శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, గజవాహనంపై శ్రీవారు

అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం


తెలుగుతల్లికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కందుకూరు, ఫిబ్రవరి 21: అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవ వేడుకలను బుధవారం పట్టణంలోని ప లు ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్ర భుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర, ఐక్యూఏసీ కో ఆర్డినేటరు పి.రాజగోపాలబాబు, తెలుగు విభాగాధిపతి కె.సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు. మండలంలోని ఓగూరు వద్ద ఉన్న సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని తెలుగు ఉపాధ్యాయుడు, కవి ఇనకొల్లు మస్తానయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం తెలుగుభాషపై నిర్వహించిన వివిధ పోటీల లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గడ్డం బాబూరావు, ప్రసాద్, దుర్గాప్రసాద్, రఫి, కవిత, శ్రీవాణి, భావన తదితరులు పాల్గొన్నారు.

కావలిటౌన్ : ఇందిరానగర్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం రత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం జరిగింది. ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రసాదరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

40 రోజులు కష్టపడి పార్టీని గెలిపించుకుందాం

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

అల్లూరు, ఫిబ్రవరి 21 : రానున్న నలభై రోజులు కష్టపడి రాష్ట్రంలో టీడీపీని గెలిపించుకుందామని ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర పిలుపుని చ్చారు. అల్లూరులోని డీఎస్‌ఆర్ ట్రస్ట్‌లో బుధవారం రాత్రి మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ పార్టీ చేయలేని అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని గర్వంగా చెప్పుకొని ఓటు అడిగే హక్కు తమ పార్టీకే ఉందన్నారు. వైసీపీ ఏ ఒక్క అభివృద్ధి కార్యక్రమం జరిగిందో చూపలేని స్థితిలో ఉందన్నారు. అదేవిధంగా కావలి ఇన్‌చార్జిగా దగుమాటి వెంకట కృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి)ని అధిష్ఠానం నియమించిందని, ఆయన నాయకత్వంలో పనిచేసేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలన్నారు.

రాజకీయ భిక్ష పెట్టింది బీద రవిచంద్ర : కృష్ణారెడ్డి

తనకు రాజకీయ భిక్ష పెట్టింది టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రేనని ఆయన అడుగు జాడల్లో తాను నడిచేందుకు సిద్ధంగా ఉన్నానని కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి కావ్య కృష్ణారెడ్డి అన్నారు. రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన వారికే పెద్దపీట వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాలేపాటి సుబ్బానాయుడు, బీద గిరిధర్, బొమ్మి సురేంద్ర, బుల్లా కృష్ణారెడ్డి, కొండూరు పోలిశెట్టి, బండి శ్రీనివాసులు రెడ్డి, కృష్ణచైతన్య, రఫీమాలిక్, తోట శ్రీహరి, పాపనబోయిన రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

పాతూరు నుంచి టీడీపీలోకి వలసలు

కావలి : కావలి పట్టణం పాతూరు 5వ వార్డుకు చెందిన వైసీపీ నాయకుడు కాటా శ్రీనివాసులురెడ్డి తన అనుచరులతో బుధవారం ముసునూరులోని టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరగా వారికి కండువా వేసి ఇన్‌చార్జి కృష్ణారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎస్సీ కాలనీలో పలువురు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన ఎస్సీ కాలనీవాసులతో ఇంటూరి

ఉలవపాడు, ఫిబ్రవరి 21 : మండలంలోని భీమవరం ఎస్సీ కాలనీలో వైసీపీకి చెందిన పలు కుటుంబాలు బుధవా రం రాత్రి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ కందుకూరు ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరిన 30 కుటుంబాల వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించా రు. ఈ సందర్భంగా ఇంటూరి మాట్లాడుతు నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటు రాష్ట్రంలో దళితులకు తీరని నష్టం చేసి వారిని ఆర్థికంగా అణగదొక్కిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కు తుందన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మం డల అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు, నాయకులు జాజుల రవి, జనసేన నాయకుడు లక్ష్మణ్, చలపతి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

27వ వార్డులో..

కందుకూరు : పడమర వడ్డిపాలెం, ఏరియా వైద్యశాల ప్రాంతాలలో బుధవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యా రెంటీ కార్యక్రమం నిర్వహిం చారు. టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, ముచ్చు శ్రీను, పాకల మాల్యాద్రి, కంచర్ల సుబ్బారావు, తన్నీరు సుధాకర్, తిరువల్లూరి కృష్ణమాచారి పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

కావలి రూరల్, ఫిబ్రవరి 21: వైన్ షాపుల నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సెబ్ సీఐ టీ.లక్ష్మణస్వామి పేర్కొన్నారు. కావలి సెబ్ కార్యాలయంలో బుధవారం కావలి, జలదంకి, బోగోలు మండలాలకు చెందిన 15 వైన్‌షాపుల సూపర్‌వైజర్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐ లక్ష్మణస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం సీసాలు బెల్టుషాపులకు సరఫరా చేసినా, ఒక వ్యక్తికి 3 సీసాల కంటే ఎక్కువ ఇచ్చినా వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మ్యానువల్‌గా ఇవ్వకూడదని, ప్రతి సీసాను తప్పనిసరిగా స్కానింగ్ చేసి ఇవ్వాలన్నారు. సమయపాలన పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ ఎస్ఐ రాజశ్రీ, ఎక్సైజ్ ఎస్ఐ సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


సెబ్ అధికారులతో వైన్‌షాపుల సూపర్‌వైజర్లు

బోగోలులో ట్రాఫిక్ కష్టాలు

బిట్రగుంట, ఫిబ్రవరి 21: బోగోలులో బుధవారం సాయంత్రం అర్థగంటకుపైగా ట్రాఫిక్ నిలిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. మూడవ రైల్వే లైన్ ప్రారంభించినప్పటి నుంచి ఎల్సీ గేట్-144 నాలుగు నుంచి ఆరు రైళ్లకు వేయడం, తీసిన వెంటనే మూయడం జరుగుతుండడంతో భారీ, ద్విచక్రవాహనాలు గంటలు తరబడి నిలిపోతున్నాయని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా వైద్యం కోసం వెళ్లే రోగులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల సమస్యలు దృష్టిలో పెట్టుకుని రైల్వే అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


బోగోలు రైల్వేగేటు వద్ద ఆగిన వాహనాలు

జేవీవీ ఆధ్వర్యంలో సైన్స్ ఎగ్జిబిషన్

కావలిటౌన్, ఫిబ్రవరి 21: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బుధవారం రెడ్‌క్రాస్ రక్తనిధి భవనంపైనున్న సమావేశ మందిరంలో సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. ముఖ్య అతిథిగా జేవీవీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్ పాల్గొని ఎగ్జిబిట్స్ తిలకించారు. జేవీవీ పట్టణ అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో విజేతలకు 28న జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకల్లో బహుమతి ప్రదానోత్సవం జరుగుతుంది. కార్యక్రమంలో హరినాథ్, సుబ్బరాయశర్మ, హరినారపరెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.


సైన్స్ ఎగ్జిబిట్స్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ రవికుమార్

కృష్ణమాదిగ పర్యటనను విజయవంతం చేయాలి

కావలి, ఫిబ్రవరి 21: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణమాదిగ ఈ నెల 26న కావలిలో పర్యటిస్తారని ఎమ్మెస్పీ జిల్లా ఇన్‌చార్జి సూరిపాక వాసుదేవరావు మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సూరిపాక ఉదయకృష్ణ మాదిగ తెలిపారు. కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల భవిష్యత్ కార్యాచరణపై విస్తృతస్థాయి సమావేశం కావలిలో జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమాను ఉమ్మడి జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి మాదిగలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నేతలు పందిటి అంబేడ్కర్ మాదిగ, గోచిపాతల వెంకటేశ్వర్లు మాదిగ, చేవూరు కిరణ్‌మాదిగ, గేరా జానకి, గంగపట్ల సంపద్రి, రామ్మోహన్, దర్శిగుంట వాసు, మహేష్, రమణయ్య, కత్తి శివయ్య పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి హామీ గ్రామ సభలు

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 : మడలంలోని 21 గ్రామ పంచాయతీలలో గురువారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రఫీక్‌అహ్మద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న చుండి, బడేవారిపాలెం, అమ్మపాలెం, 23న నలదలపూరు, అయ్యవారిపల్లె, అంకభూపాలపురం, శాఖవరం, కొండారెడ్డిపాలెం, కొండసముద్రం, 24న లింగపాలెం, నూకవరం, 25న శామీరపాలెం, 26న పోకూరు, పోలినేనిచెరువు, శింగమనేనిపల్లె, నేకునాంపురం, వలేటివారిపాలెం, కళవళ్ల, జమీన్‌ఉప్పలపాడు పంచాయతీలలో గ్రామ సభలు జరగనున్నట్లు తెలిపారు.

27న సామాజిక ప్రజావేదిక : స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 27న ఉపాధి హామీ సామాజిక ప్రజావేదిక నిర్వహించనున్నట్లు తెలిపారు.

29న మాలకొండలో దుకాణాలకు వేలం

వలేటివారిపాలెం, ఫిబ్రవరి 21 : మండలంలోని అయ్యవారిపల్లె పంచాయతీ మాలకొండలో వివిధ దుకాణాలకు ఈ నెల 29వ తేదీన బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేది జరిగిన వేలం పాటలలో వివిధ కారణాల వలన 5 దుకాణాల వేలం వాయిదా పడింది. వీటికి మళ్లీ వేలం పాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ట్రిపుల్ ఆర్‌లో ఒక్క ఆర్ పోతే పార్టీకి ఇబ్బందేమీలేదు : బీద


మాట్లాడుతున్న ఎంపీ బీద మస్తాన్‌రావు

అల్లూరు, ఫిబ్రవరి 21 : కావలి నియోజకవర్గానికి ఉన్న ట్రిపుల్ ఆర్‌లో ఒక్క ఆర్ పోతే ఇబ్బందేమీ లేదని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. అల్లూరులోని పార్టీ కార్యాలయంలో బుధవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ వేమిరెడ్డి పార్టీని వీడి వెళ్లడంపై ఆయన మాట్లాడుతూ ఆర్‌పీఆర్, బీఎంఆర్, వీపీఆర్‌లో ఒకరు వెళ్లిపోయినంతమాత్రాన పార్టీకి ఒరిగేదేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, నీలం సాయికుమార్, దర్శిగుంట శిరీష, వేణమ్మ, కోడూరు సాదక్‌రెడ్డి, బిట్రగుంట రమేష్‌రెడ్డి, బీద రమేష్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల ఆత్మీయ సమావేశం

బిట్రగుంట : బోగోలు పంచాయతీ కార్యాలయ ఆవరణంలో వైసీపీ మండల కన్వీనర్ వీరరఘు ఆధ్వర్యంలో బుధవారం వైసీపీ నేతల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆప్కాబ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కార్యకర్తలు కష్ట పడి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎం.సుజాత, జడ్పీటీసీ ఎం.కీర్తన, సర్పంచులు పి.అనిత, రాయి.వినోద్ యాదవ్, నాయకులు దేవరాలసుబ్రహ్మణ్యం, ఎన్.కిరణ్‌కుమార్, శ్రీనివాసులు, జనార్దర్‌రెడ్డి, నవాజ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.